


అనంత
# జనశక్తి
జనం కోసమే మా అక్షరం

22.08.2026
శనివారం | అనంతపురం
సంపుటి : 11 | సంచిక: 101
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BYANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## చిత్రపరిశ్రమలో విషాదం

- సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూత
- అనారోగ్య సమస్యల కారణంగా..
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో తుది శ్వాస


2లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**

తెలుగు చిత్రపరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణంగా శుక్రవారం ఆమె చనిపోయారు. షావుకారు జానకి ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

## మదన్ దిలావర్‌కు 48 గంటల సీజేపీ అల్టిమేటం

- ప్రభుత్వ పాఠశాల తనిఖీకి వెళ్లిన సీజేపీ కార్యకర్తలు
- వారిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు
- దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్
- రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

2లో..





**జైపూర్, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

రాజస్థాన్ రాష్ట్రంలో పాఠశాల పర్యటనకు వెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)పై గ్రామస్తులు దాడి చేయడం సంచలనంగా మారింది. అయితే, బీజేపీ గుండాలే ఈ దాడికి పాల్పడినట్లు సీజేపీ ఆరోపిస్తోంది. మరోవైపు, దాడి చేసిన గ్రామస్తులు తమకు బీజేపీ, కాంగ్రెస్‌తో సంబంధం లేదని చెబుతున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సీజేపీ కోకన్వీనర్ అశుతోష్ రాంకా రాజస్థాన్ ప్రభుత్వానికి 48 గంటల అల్టిమేటం విధించారు. రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ లాల్ రాజీనామాను కోరుతున్నారు.

## ఎంపీ అవినాశ్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు

- వివేకా హత్య కేసులో మరో పరిణామం
- భాస్కర్ రెడ్డి ఇళ్లపై ఈడీ సోదాలు
- విపక్షాలను దారి మళ్లించేదుకే..
- ఆరోపించిన వైసీపీ నేతలు, కార్యకర్తలు

6లో..





**అమరావతి, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మనీలాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డితో పాటు పలువురి నివాసాలు, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద నమోదు చేసిన కేసు ఆధారంగా ఈడీ అధికారులు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌తో పాటు కడపలోని మొత్తం ఆరు ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేశారు.

## బియ్యంకార్డు లేనివారికి కూడా
# సన్నబియ్యం

- మార్కెట్‌లో భారీగా పెరిగిన బియ్యం ధరలు
- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రైతు బజార్లు, రైస్ మిల్లులు వద్ద సెంటర్లు
- ఆధార్ కార్డు ఉన్నా సరిపోతుంది
- ఆధార్ చూపిస్తే చాలు బియ్యం
- కేజీ బియ్యం రూ.52కే అందజేస్తున్న ప్రభుత్వం
- ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పన విక్రయాలు





**అమరావతి, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు భారీగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలకు ఉపశమనం కలిగించేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతక్కువ ధరకే సన్న బియ్యం అందిస్తోంది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నరైతుబజార్లు, రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ల ద్వారా నాణ్యమైన సన్న బియ్యాన్ని, 10 కిలోల లెక్కన తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఆగస్ట్ నెల మొదటి వారం నుంచి ఈ విధానాన్ని ఏపీలో అమలు చేస్తున్నారు. అయితే బియ్యం కార్డు ఉన్నవారికిమాత్రమే సన్నబియ్యం విక్రయించాలని ఏపీ పౌరసరఫరాల శాఖ తొలుత నిర్ణయించింది. అయితే బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుతం బియ్యం కార్డుతో పనిలేకుండా ఆధార్ కార్డు ద్వారా అందరికీ సన్నబియ్యం విక్రయిస్తున్నారు.

మరోవైపు బహిరంగ మార్కెట్లో నాణ్యమైన సన్నబియ్యం కిలో రూ.60 నుంచి రూ.65 వరకూ పలుకుతోంది. అయితే ఈ ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు ఈ విక్రయ కేంద్రాల ద్వారా బీపీటీ(స్టీమ్డ్) రైస్ కిలో రూ.52చొప్పున.. బీపీటీ ముడి(రా రైస్) బియ్యం రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కేంద్రాల ద్వారా వీటి అమ్మకాలు సాగుతున్నాయి. అయితే కొన్నిచోట్ల ఊహించినంత స్థాయిలో సన్నబియ్యం విక్రయాలు జరగడం లేదని తెలుస్తోంది. దీనికి సాంకేతి అంశాలే కారణమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సన్నబియ్యం విక్రయాల కోసం తొలుత రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకున్నారు. ఆ తరువాత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో.. ఆధార్ కార్డు ఉన్నా సరిపోతుందని ప్రభుత్వం తెలిపింది. అయితే ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి చేయటంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. ఆధార్ అథెంటిఫికేషన్ కోసం సర్వర్లు సరిగ్గా పనిచేయక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే కుటుంబానికి 25 కిలోల బస్తా చొప్పున విక్రయించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. మరి ఈ డిమాండ్లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందనేదీ చూడాల్సి ఉంది.

## జీవిత ఖైదు రద్దు 105 ఏళ్ల వృద్ధుడికి..

- సుప్రీంకోర్టులో భారీ ఊరట
- హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష
- మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ ఉత్తర్వులు

2లో..

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

హత్యకేసులో జీవిత ఖైదు శిక్ష పడిన 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు చేస్తూ శుక్రవారం సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌లోని మల్దా జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మొండల్ 1920లో జన్మించారు. 1988లో మర్డర్ కేసులో ఆయన జైలు పాలయ్యారు.

## ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలి

- స్థానిక ఎన్నికల్లో మనదే గెలుపు
- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవాలి
- విధి విధానాలపై ప్రత్యేక కమిటీ
- 14 మందితో ప్రత్యేక కమిటీ

**అమరావతి, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ విషయమై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురువారం ముఖ్య నేతలతో చర్చించారు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధి విధానాల రూపకల్పనకు 14 మందితో ప్రత్యేక కమిటీని పవన్ కళ్యాణ్ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధినాలు, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణుల ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటుంది.


6లో..

## భారీ సినిమాలకు టికెట్ ధరల పెంపు

- 25% సీట్లు నాన్-ప్రీమియం తప్పనిసరి
- 5 షోలకు గ్రీన్ సిగ్నల్
- సినీ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక నిధి

2లో..




## మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

- కొండా సురేఖపై కాంగ్రెస్ ఆగ్రహం
- రేవంత్‌పై కొండా సుస్మిత కామెంట్స్..
- సీఎల్పీ వేదికగా మీడియా సమావేశం
- పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహారం
- అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

6లో..

## జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే

- సుప్రీం కీలక నిర్ణయం
- మూడేళ్ల ప్రాక్టీస్‌ను ఏడాదికి కుదిస్తూ..

2లో..



## కేంద్రంపై రాహుల్ విమర్శలు

- కంటిలో మూడు..
- బాడీలో 200 పెల్లెట్లు
- బాధితుడితో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా
- జంతర్ మంతర్ వద్ద ఘటన

2లో..



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జీ, పెల్లట్లు ఉపయోగించమని ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బాధితుడితో కలిసి వెళ్లారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేవరకు అక్కడ నుంచి కదిలేది లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించడంతో బాధితుడు సాహిల్ లోచాబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్ వెలుపల రాహుల్ ధర్నాకు దిగారు.

## నా టార్గెట్ రేవంత్ రెడ్డి

- మరోసారి కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు
- టార్గెట్ కాంగ్రెస్ కాదని వెల్లడి
- రేవంత్ ఆయన కుటుంబమే నా లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై గతంలో చేసిన వ్యాఖ్యలకు తాజాగా మరోసారి వివరణ ఇచ్చిన కొండా సుస్మిత .. తన టార్గెట్ కాంగ్రెస్ కాదని.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన ఫ్యామిలీ మాత్రమేనని తేల్చి చెప్పారు.



2లో..

## హైదరాబాద్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్


6లో..

# చిత్రపరిశ్రమలో విషాదం



(మొదటి పేజీ తరువాయి)

కుటుంబసభ్యులు ఆమెను చెన్నైలోని కావేరి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 94 ఏళ్ల వయసులో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఆమె తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. షావుకారు జానకి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 5 గంటలనుంచి తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో.. అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులు అర్పించటం కోసం ఉంచుతామని తెలిపారు.

**70 ఏళ్ల సినీ ప్రస్థానం..**

టేకుమళ్ల జానకి 1931 డిసెంబర్ 12వ తేదీన తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. 1949 'రక్షా రేఖ' సినిమాతో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టారు. విజయవారి 'షావుకారు' సినిమా విజయవంతం అవటంతో.. 'షాపుకారు' జానకిగా పాపులర్ అయ్యారు. జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో దాదాపు 400 చిత్రాలలో నటించారు.

రోజులుమారాయి, కన్యాశుల్కం, జయం మనదే, పాండురంగ మహత్యం, డాక్టర్ చక్రవర్తి, అక్కాచెల్లెళ్లు, బడిపంతులు, తాయారమ్మ బంగారయ్య, సంసారం ఒక చదరంగం వంటి హిట్ సినిమాల్లో నటించారు. 1955లో 11 సినిమాల్లో నటించిన షావుకారు జానకి.. 'ఏది నిజం' సినిమాకు జాతీయ బహుమతి అందుకున్నారు. ఆమె చివరగా 2023లో వచ్చిన 'అన్నీ మంచి శకునములే' సినిమాలో కనిపించారు. షావుకారు జానకి సొంత చెల్లెలు కృష్ణకుమారి హీరోయిన్‌గా తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు

# నా టార్గెట్ రేవంత్ రెడ్డి



(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ వ్యవహారంలో ఇప్పటికే వేడెక్కిన తెలంగాణ కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు మరింత రసవత్తరంగా మారాయి. కాంగ్రెస్ అగ్రనేతలపై తనకు గౌరవం ఉందని పేర్కొన్న కొండా సుస్మిత.. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌లను తాను గౌరవిస్తానని పేర్కొన్నారు. తాను కాంగ్రెస్‌ను విమర్శించలేదని.. కేవలం సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబంపై మాత్రమే ప్రశ్నలు లేవనెత్తానని తెలిపారు.

తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన కొండా సుస్మిత.. కాంగ్రెస్ పార్టీపై తనకు ఎలాంటి వ్యతిరేకత లేదని తేల్చిచెప్పారు. అయితే సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన సోదరులపై అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని.. వాటినే తాను ప్రశ్నిస్తున్నానని పేర్కొన్నారు. తనపై కౌంటర్ వ్యాఖ్యలు చేయడానికి ప్రయత్నిస్తే మరిన్ని అంశాలను బయట పెడతానని తీవ్ర హెచ్చరికలు చేశారు.

వచ్చే ఎన్నికల్లో పరకాల సీటు రేవూరి ప్రకాష్ రెడ్డికే అని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై కొండా సుస్మిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి తాను పోటీ చేయడం ఖాయమని ప్రకటించారు. ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించేందుకు పార్టీ హైకమాండ్ ఉన్నప్పుడు.. ముఖ్యమంత్రి ఒక్కరే 2 ఏళ్ల ముందుగానే అభ్యర్థిని ఎలా ప్రకటిస్తారని కొండా సుస్మిత ప్రశ్నించారు. అవసరమైతే పరకాల నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కూడా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి సోదరుడికి చెందిన ఒక కంపెనీకి సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని కట్టబెట్టారంటూ కొండా సుస్మిత మరోసారి సంచలన ఆరోపణలకు తెరతీశారు. ఈ అంశంతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబానికి సంబంధించిన మరిన్ని అవినీతి, అక్రమాలను బయట పెడతానని ఆమె చేసిన హెచ్చరికలు సంచలనం రేపుతున్నాయి. మరోవైపు.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు వ్యవహారం కూడా ఈ వివాదం మధ్య తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అమెరికా పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ రాజకీయ అనుమతి నిరాకరించడంతో ఆగస్ట్ 23వ తేదీన రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి తిరిగి వచ్చిన తర్వాత కొండా సురేఖ, కొండా సుస్మిత వ్యవహారంపై పార్టీ పరంగా కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.

# జీవిత ఖైదు రద్దు 105 ఏళ్ల వృద్ధుడికి..



(మొదటి పేజీ తరువాయి)

1994లో కోర్టు అతడిని దోషిగా తేల్చి జీవిత ఖైదు విధించింది.

తనకు పడ్డ శిక్షను సవాల్ చేస్తూ మొండల్ 2018లో కోల్‌కతా హైకోర్టులో పిటిషన్ వేశారు. హైకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టేసింది. తర్వాత అపెక్స్ కోర్టుకు వెళ్లగా.. అక్కడ కూడా మొండల్‌కు నిరాశే ఎదురైంది. దీంతో మొండల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వయసును దృష్టిలో ఉంచుకుని శిక్షా కాలం ముగియటానికంటే ముందే తనను రిలీజ్ చేయాలంటూ ఆయన పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు 2024 నవంబర్ 29వ తేదీన మొండల్‌కు మధ్యంతర బెయిల్ మంజూర్ చేసింది.

శుక్రవారం మరోసారి సుప్రీంకోర్టులో మొండల్ పిటిషన్‌పై విచారణ జరిగింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. పిటిషనర్ వయసును దృష్టిలో ఉంచుకుని కేసును ముగిస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. మిగిలిన శిక్షాకాలాన్ని కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సుప్రీంకోర్టు తీర్పుతో 105 ఏళ్ల వయసులో రసిక్ చంద్ర మొండల్ జీవిత ఖైదు నుంచి విముక్తి పొందారు.

# భారీ సినిమాలకు టికెట్ ధరల పెంపు

**హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**

తెలుగు సినీ పరిశ్రమను మరింత బలోపేతం చేయడానికి , పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడేందుకు తెలంగాణ ప్రభుత్వం ఒక కొత్త జీవో విడుదల చేసింది. ఈ నిర్ణయాన్ని 'యాక్టివ్ తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ గిల్డ్' స్వాగతిస్తూ పత్రికా ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం తెలుగు సినిమాలు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న తరుణంలో, ఐమాక్స్ , డాల్బీ సినిమా, హెచ్‌డీఆర్ వంటి అత్యాధునిక సాంకేతికతలతో నిర్మించే భారీ బడ్జెట్ సినిమాలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరమవుతాయి. ఈ పరిస్థితులను గుర్తించిన ప్రభుత్వం, అర్హత ఉన్న సినిమాల టికెట్ ధరల పెంపునకు ఒక స్పష్టమైన, నియంత్రిత విధానాన్ని అందించడం ఒక ప్రగతిశీల నిర్ణయమని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

**నియంత్రిత టికెట్ ధరలు , సాధారణ ప్రేక్షకులకు ఉపశమనం**

ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానంలో టికెట్ ధరల పెంపు అనేది ప్రతీ సినిమాకూ స్వయంచాలకంగా వర్తించదు. కేవలం అర్హత ఉన్న భారీ చిత్రాలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది , ప్రభుత్వ అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే అనుమతి ఇస్తారు. అదే సమయంలో సాధారణ ప్రేక్షకులకు కూడా సినిమాలు అందుబాటులో ఉండేలా థియేటర్ ఏసీ,



నాన్‌ఏసీ, స్పెషల్ లేదా మల్టీప్లెక్స్ ఏదైనా సరే మొత్తం సీట్లలో 25% సీట్లను తప్పనిసరిగా నాన్‌ప్రీమియం కేటగిరీకే కేటాయించాలనే నిబంధనను విధించారు.

5 షోలకు అనుమతి , సినీ కార్మికుల సంక్షేమ నిధి థియేటర్లలో రోజుకు 5 ప్రదర్శనలకు (Shows) అనుమతి ఇవ్వడం వల్ల పెద్ద సినిమాలకు ఉండే విపరీతమైన డిమాండ్ త్వరగా తగ్గుతుంది. దీని ద్వారా థియేటర్లపై ఒత్తిడి తగ్గి, చిన్న , మధ్య తరహా బడ్జెట్ సినిమాలకు ఎక్కువ స్క్రీన్లు లభించే అవకాశం ఉంటుంది. దీనికి తోడు, సినిమా రంగాన్ని నమ్ముకున్న వేలాది మంది సినీ కార్మికుల సంక్షేమం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడానికి కూడా ఈ కొత్త విధానం ఎంతగానో దోహదపడుతుంది.

**పరిశ్రమ భవిష్యత్తుకు బలమైన పునాది**

ఈ కొత్త జీవో కేవలం టికెట్ ధరల పెంపునకు మాత్రమే పరిమితం కాకుండా నూతన పెట్టుబడులను, కొత్త సాంకేతికతను, చిన్న సినిమాలను , వేలాది మంది సినీ కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించే ఒక బలమైన వ్యవస్థను నిర్మిస్తుందని ప్రొడ్యూసర్స్ గిల్డ్ పేర్కొంది. తెలుగు సినిమా మరింతగా విస్తరిస్తున్న సమయంలో, పరిశ్రమపై ఆధారపడిన ప్రతి ఒక్కరికీ మెరుగైన అవకాశాలు, ప్రకాశవంతమైన భవిష్యత్తు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.

# మదన్ దిలావర్‌కు 48 గంటల సీజేపీ అల్టిమేటం

(మొదటి పేజీ తరువాయి)

దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, ప్రభుత్వ పాఠశాలలనున ప్రజలు స్వయంగా పరిశీలించడంపై విధించిన ఆంక్షల్ని ఉపసంహరించుకోవాని రాంకా డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను 48 గంటల్లో తీర్చకపోతే రాజస్థాన్ వ్యాప్తంగా భారీ ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సారి తమ పోరాటం కేవలం పాఠశాలల సమస్యలకే పరిమితం కాదని, విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ రాజీనామాను డిమాండ్ చేస్తామని హెచ్చరించారు.

శుక్రవారం ఉదయం రాంపురాకన్వార్‌పురా గ్రామంలో ఈ ఘటన జరిగినట్లు సీజేపీ తెలిపింది. ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించేందుకు పార్టీ కార్యకర్తలు అక్కడి వెళ్లారని, ఈ పాఠశాల కొన్నేళ్లుగా పశువుల కొట్టంలోనే కొనసాగుతోందని రాంకా ఆరోపించారు. బీజేపీతో సంబంధం ఉన్న వ్యక్తులు తమపై దాడి చేసినట్లు చెప్పారు. తమ వాహనాల అద్దాలు పగులగొట్టారని, మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని, ఓ మహిళా కార్యకర్తపై దాడి చేశారని, తన చొక్కాను చించేశారని రాంకా ఆరోపించారు. పోలీసులు ముందే సమాచారం ఇచ్చినా ఘర్షణను అడ్డుకోలేదని చఅన్నారు. విద్యాశాఖ మంత్రి ఆదేశాల మేరకే దాడి జరిగిందని ఆరోపించారు.

**కాక్రోచ్ పార్టీ కార్యకర్తలపై గ్రామస్థుల దాడి**

రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని బగ్రూ ప్రాంతం రాంపురాకన్వర్‌పురా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సమస్యపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పాఠశాల పరిస్థితులను పరిశీలించేందుకు వచ్చిన సీజేపీ (బొద్దింక జనతా పార్టీ) కార్యకర్తలను గ్రామస్థులు వ్యతిరేకించడంతో వివాదం తలెత్తింది. అనంతరం గ్రామస్థులు సీజేపీకి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఈ ఘటనలో తమ బృంద సభ్యులపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని సీజేపీ సభ్యుడు అశుతోష్ రాంకా ఆరోపించారు.

**పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన సీజేపీ కార్యకర్తలు**

రాంపురాకన్వర్‌పురా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సౌకర్యాలను పరిశీలించేందుకు సీజేపీ కార్యకర్తలు వెళ్లారు. పాఠశాల భవనం చాలా కాలంగా శిథిలావస్థలో ఉందని, పిల్లలు సరైన సౌకర్యాలు లేకుండా చదువుకోవాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అయితే సీజేపీ కార్యకర్తల రాకను గ్రామస్థులు వ్యతిరేకించారు. దీంతో అక్కడ వాగ్వాదం, గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. అనంతరం కార్యకర్తలను గ్రామం నుంచి వెళ్లిపోవాలని గ్రామస్థులు కోరినట్లు సమాచారం.

**అశుతోష్ రాంకాకు గ్రామస్థుల నిరసన**

ఈ పరిణామాల మధ్య అశుతోష్ రాంకా పాఠశాలను సందర్శించేందుకు గ్రామానికి చేరుకున్నారు. ఆయనకు కూడా గ్రామస్థుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. రాంకాకు వ్యతిరేకంగా నినాదాలు చేసినట్లు సమాచారం. రాంకా సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, రాంపురాకన్వర్‌పురాలోని ప్రభుత్వ పాఠశాల చాలా సంవత్సరాలుగా పశువుల పాకలో నిర్వహించాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. సమస్యను స్వయంగా పరిశీలించేందుకు తాను అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. తమ బృంద సభ్యులపై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని ఆయన ఆరోపించారు. పిల్లలు ఇలాంటి పరిస్థితుల్లో చదువుకోవాల్సి రావడం ఆందోళనకరమని పేర్కొంటూ, పాఠశాల సమస్యను పరిష్కరించే ప్రయత్నాలను రాజకీయ కారణాలతో అడ్డుకోవడం సరికాదని అన్నారు.

**పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందంటున్న గ్రామస్థులు**

గ్రామస్థుల ప్రకారం, ఈ పాఠశాల గతంలో 5వ తరగతి వరకు కొనసాగేది. పాఠశాల కోసం గ్రామంలోని పెద్దలు భూమిని విరాళంగా ఇచ్చారని స్థానికుడు విష్ణు కుమార్ శర్మ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పాఠశాల భవనం 1999లో నిర్మించారని తెలిపారు. అప్పటి నుంచి భవనానికి అవసరమైన స్థాయిలో పునరుద్ధరణ పనులు జరగకపోవడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుందన్నారు. పిల్లలు



భవనంలో కూర్చుని చదువుకోవడానికి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో, గ్రామస్థులు ప్రస్తుతం ఒక పెద్ద భవనంలో రెండు గదులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు సుమారు 20 నుంచి 30 మంది విద్యార్థులకు బోధిస్తున్నారని చెప్పారు.

**పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదని ఆరోపణ**

ఈ ప్రాంతం బాగ్రూ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వస్తుందని స్థానికులు తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే డాక్టర్ కైలాష్ వర్మ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని విష్ణు కుమార్ శర్మ పేర్కొన్నారు. అయితే, నిధులు లేదా బడ్జెట్‌కు సంబంధించి స్థానికులు పేర్కొన్న మొత్తాల్లో భిన్నమైన వివరాలు ఉన్నాయని సమాచారం. క్షేత్రస్థాయిలో పాఠశాల నిర్మాణం లేదా పునరుద్ధరణ పనులు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

**'ప్రభుత్వం నిర్మించకపోతే మేమే నిర్మిస్తాం'**

గ్రామస్థుడు రాజేష్ కుమార్ శర్మ సీజేపీ కార్యకర్తల రాకను వ్యతిరేకించారు. పాఠశాల సమస్యను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడానికి కార్యకర్తలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నప్పటికీ, నిరసన పద్ధతి కూడా సముచితంగా ఉండాలని అన్నారు. పాఠశాల భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే గ్రామస్థులే కలిసి పాఠశాలను నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని రాజేష్ కుమార్ శర్మ తెలిపారు. తమ పెద్దలు పాఠశాల కోసం భూమిని ఇచ్చారని, పిల్లల భవిష్యత్తు కోసం పాఠశాలను మెరుగుపరచడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.

**పోలింగ్ బూత్ మార్పుపైనా గ్రామస్థుల అభ్యంతరం**

గ్రామంలో గతంలో పోలింగ్ బూత్ ఉండేదని, అయితే ఈసారి దానిని మరో ప్రాంతానికి తరలించారని రాజేష్ కుమార్ శర్మ పేర్కొన్నారు. ఈ విషయంపై కూడా అధికారులు దృష్టి సారించాలని ఆయన కోరారు. ప్రస్తుతం పాఠశాల పరిస్థితి, రాజకీయ కార్యకర్తల రాక, గ్రామస్థుల నిరసన నేపథ్యంలో రాంపురాకన్వర్‌పురాలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాఠశాల పునర్నిర్మాణం లేదా మరమ్మతు పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనే దానిపై గ్రామస్థులు ప్రభుత్వ చర్యల కోసం ఎదురుచూస్తున్నారు.

# జ్యుడీషియల్ సర్వీస్‌కు ప్రాక్టీస్ ఏడాదే



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**

జ్యుడీషియల్ సర్వీసుల్లోకి నేరుగా ప్రవేశించాలనుకునే న్యాయ విద్యార్థులకు సుప్రీంకోర్టు గుడ్ న్యూస్ చెప్పింది. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు మూడేళ్ల న్యాయవాద వృత్తి ప్రాక్టీస్ నిబంధనను ఒక సంవత్సరానికి తగ్గించింది. మూడేళ్ల ప్రాక్టీస్ నిబంధనను తొలగించాలన్న అభ్యర్థనను పూర్తిగా తోసిపుచ్చనప్పటికీ, యువ న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని మార్పులు చేసింది.

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఆగస్ట్ జార్జ్ మసీహ్, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఈ అంశంపై జస్టిస్ వినోద్ చంద్రన్ భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పోస్టుల ప్రత్యక్ష నియామకాలకు కనీస అనుభవం ఉండాలన్న ప్రాథమిక ఉద్దేశాన్ని సమర్థిస్తూనే, నిబంధనలు కఠినంగా ఉండి యువ లా గ్రాడ్యుయేట్లకు ఇబ్బంది కలగకూడదని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

**ముఖ్యమైన మినహాయింపులు:**

2025 మే 20 నుంచి 2027 మార్చి 31 మధ్య వెలువడే సివిల్ జడ్జి పరీక్షల నోటిఫికేషన్లకు హాజరయ్యే లా గ్రాడ్యుయేట్లకు ఎటువంటి ప్రాక్టీస్ అనుభవం లేకపోయినా దరఖాస్తు చేసుకునేందుకు సుప్రీంకోర్టు మినహాయింపునిచ్చింది. ఈ కాలంలో ఎంపికైన అభ్యర్థులు నేరుగా ట్రెయినీ జ్యుడీషియల్ ఆఫీసర్లుగా నియమితులవుతారు. అలానే వీరు స్టేట్ జ్యుడీషియల్ అకాడమీలో ఒక సంవత్సరం పాటు శిక్షణ పొందాలి. ఆ తర్వాత ఒక సంవత్సరం పాటు స్ట్రక్చర్డ్ లా క్లర్క్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఇందులో మొదటి ఆరు నెలలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి లేదా హయ్యర్ జ్యుడీషియల్ సర్వీస్ సభ్యుల పర్యవేక్షణలో, తర్వాతి ఆరు నెలలు హైకోర్టు సిట్టింగ్ జడ్జిల పర్యవేక్షణలో క్లర్క్‌షిప్ పూర్తి చేయాలి. శిక్షణ కాలంలో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ స్థూల వేతనంలో సగానికి సమానమైన గౌరవ వేతనం అందుకుంటారు.

2027 ఏప్రిల్ 1 లేదా ఆ తర్వాత వెలువడే నోటిఫికేషన్ల ద్వారా సివిల్ జడ్జిలుగా ఎంపిక కావాలనుకునే అభ్యర్థులు కనీసం ఒక సంవత్సరం పాటు న్యాయవాద వృత్తి అనుభవాన్ని కలిగి ఉండాలి. దీనిని ధ్రువీకరణ పత్రం ద్వారా సరిచూస్తారు. ఎంపికైన తర్వాత పైన పేర్కొన్న విధంగా ఒక సంవత్సరం అకాడమీ శిక్షణ, ఒక సంవత్సరం క్లర్క్‌షిప్ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ శిక్షణ కాలం పరిపూర్ణంగా ముగిసిన తర్వాతే వారు రెగ్యులర్ పోస్టుల్లో నియమితులై పూర్తి స్థాయి వేతనాన్ని అందుకుంటారు.

న్యాయ వ్యవస్థలో ప్రవేశించే ముందు అభ్యర్థులకు వృత్తిగత అనుభవం ఉండాలనే తలంపుతో పాటు, అకస్మాత్తుగా విధించిన కఠిన నిబంధనల వల్ల మహిళలు, దివ్యాంగులు, యువ లా గ్రాడ్యుయేట్లు నష్టపోకూడదనే ఉద్దేశంతో ఈ మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

# కేంద్రంపై రాహుల్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల నిరసన సమయంలో పోలీసులు, పారామిలిటరీ బలగాలు క్రూరంగా వ్యవహరించారనే ఆరోపణలపై పరిశీలనకు సుప్రీంకోర్టు ఒక ఉన్నతాధికార నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు కదలేది లేదని కాంగ్రెస్ ఎంపీ ఉద్ఘాటించారు.

"మేము విద్యార్థుల కోసం నిలబడతాం. న్యాయం కోసం పోరాడతాం. మేము మౌనంగా ఉండం.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు డీసీపీ ఆఫీస్ వద్ద ధర్నా కొనసాగుతుంది" అని కాంగ్రెస్ ఎక్స్ (ట్విట్టర్) లో పేర్కొంది. ఈ ధర్నాలో ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. జులై 20న జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు పెల్లెట్ గన్‌తో దాడి చేశారని, దానివల్ల అతడు ఒక కంటిని కోల్పోయే స్థితిలో ఉన్నాడని తెలిపారు. అయితే, నిరసనకారులపై పెల్లెట్ గన్‌లు తాము వాడలేదని ఢిల్లీ పోలీసులు ఖండించారు.

కానీ, వీటిని ఉపయోగించడంపై సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కశ్మీర్‌లో నిరసనకారులపై 2010లో తొలిసారిగా ఉపయోగించిన పెల్లెట్ గన్‌లు, షాక్ బ్యాటన్‌లు జంతర్ మంతర్ వద్ద మోహరించిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అల్లర్ల నియంత్రణ విభాగమైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆయుధ సామగ్రిలో భాగం. ఢిల్లీ నిరసనల సమయంలో వీటి వాడకంపై సీఆర్పీఎఫ్ మౌనం వహించింది.



ఒక పెల్లెట్ గన్, 600 వరకు లోహపు లేదా రబ్బరు తూటాలు నింపిన కాట్రిడ్జ్‌లను పేలుస్తుంది. ఇవి సెకనుకు 1,000 అడుగుల వేగంతో విస్తృతంగా వ్యాపిస్తాయి. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం.. ఈ గన్‌ను కనీసం 500 అడుగుల దూరం నుంచి కాల్చాలి. వీటిని గురిపెట్టే వారి నడుము కింది భాగాన్ని లక్ష్యంగా చేసుకోవాలి. మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఒక చిన్న ప్లాస్టిక్ బాక్స్‌లో ఉన్న పెల్లెట్లను చూపుతూ.. "ఇవి ఆ బాధితుడి శరీరం నుంచి తీసిన పెల్లెట్లు. అతడి కంటిలో మూడు, శరీరంలో 200కి పైగా దూసుకెళ్లాయి" ఎయిమ్స్, లేడీ హార్డింజ్ ఆసుపత్రి మెడికల్ రిపోర్టులను ఆధారంగా చూపించారు.

మరోవైపు, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ రాహుల్ గాంధీ అరాచక రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదై విచారణ జరుగుతోందని, సుప్రీంకోర్టు కమిటీ కూడా ఏర్పాటు చేసిందని, రాహుల్ గాంధీ చట్టాన్ని గౌరవించడం లేదని ఆరోపించారు.

అంతకుముందు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాహుల్ గాంధీ లేఖ రాస్తూ.. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిగిన క్రూరమైన దాడికి జవాబుదారీతనం కోరారు. అలాగే, యువతపై పెల్లెట్ గన్‌లు సహా లాఠీఛార్జ్‌కు ఆమోదించారా? అని కూడా ప్రశ్నించారు. గత నెల వర్షాకాల సమావేశాల మొదటి రోజైన జులై 20న నీట్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తోన్న విద్యార్థులు పార్లమెంటువైపు మార్చ్ సందర్భంగా భద్రతా సిబ్బంది పెల్లెట్ గన్‌తో జరిపిన కాల్పుల్లో గాయపడిన సచిల్ లోచాబ్ (19)ను గాంధీ మీడియా ముందు ప్రదర్శించారు.

# సంగీతం... తైక్వాండోలు కాదు.. పిల్లలతో మాట్లాడండి



పోటీ ప్రపంచంలో రాణించడానికి పాఠశాల వేళల తర్వాత సంగీతం, తైక్వాండోలో శిక్షణ అంటూ పిల్లల్ని అనేక రకాల క్లాసులకు పంపించే బదులు కొంత సమయం కేటాయించి వారితో మాట్లాడాలని తల్లిదండ్రులకు సుప్రీంకోర్టు సూచించింది. ఒక కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం గురువారం ఈ సూచన చేసింది. ''ఇతరులతో ఎలా మెలగాలనేది పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలి. ముఖ్యంగా అబ్బాయిలకు..! వారు అమ్మాయిలతో, మహిళలతో ఎలా ప్రవర్తించాలనేది చెప్పి తీరాలి. అదనపు క్లాసులకు పంపించేందుకు వెంపర్లాడే బదులు పిల్లలతో మాట్లాడుతుంటే వారికి, తల్లిదండ్రులకు మధ్య బంధం బలపడుతుంది'' అని తెలిపింది. పోటీ ప్రపంచంలో పైచేయి సాధించడానికి అదనపు తరగతులు అవసరమేనని ఒక న్యాయవాది సమర్థించుకోగా జస్టిస్ నాగరత్న జోక్యం చేసుకున్నారు. రకరకాల తరగతులు పిల్లలకు మంచివి కావని స్పష్టంచేశారు.

**ఆ కేసుల్లో స్వతంత్ర విచారణాధికారం లేదు**

భ్రూణ హత్యల నివారణ లక్ష్యంగా రూపొందించిన పీసీపీఎన్‌డీటీ చట్టం (ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయగ్నోస్టిక్ టెక్నాలజీస్ యాక్ట్) కింద పోలీసులు స్వతంత్ర విచారణ జరపడానికి వీల్లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టంచేసింది.. పిండ దశలో లింగ నిర్ధారణను ఈ చట్టం నిషేధించింది. చట్టం నిర్ణయించిన అధికారులే ఇలాంటి కేసుల్లో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం పేర్కొంది. పీసీపీఎన్‌డీటీ చట్టం కింద నమోదయ్యే కేసుల పరిష్కారానికి సాంకేతిక, వైద్య పరిజ్ఞానం అవసరమని తెలిపింది. ''ఈ చట్టం కింద పోలీసులు స్వతంత్రంగా దర్యాప్తు జరిపేందుకు అవకాశం లేదు'' అని తేల్చి చెప్పింది.

# అమ్మా! నాన్న పైనుంచి గర్వంగా నీవైపు చూస్తుంటాడు

దిల్లీ: అమ్మ సోనియాగాంధీని ప్రేమించే లక్షలాది అభిమానులు ఈ ఏడాది చివరలో విడుదల కానున్న ఆమె జ్ఞాపకాల పుస్తకం ''బిలాంగింగ్ : ఎ జర్నీ ఆఫ్ లవ్'' చదవబోతున్నందుకు తనకు గర్వంగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ విపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ గురువారం తెలిపారు. వ్యక్తిగత విషయాలను బయటపెట్టడానికి ఇష్టపడని ఆమె తన అందమైన కథను ప్రపంచానికి చెప్పడం ఎంత కష్టమైన పనో తనకు తెలుసన్నారు. ఈ మేరకు రాహుల్ 'ఎక్స్' ద్వారా తన స్పందన తెలియజేశారు. ''అమ్మా! నాన్న నీ పక్కన ఉండటం చూసి 35 ఏళ్లకు పైగా అయింది. నాన్న మనల్ని వదిలి వెళ్లిపోయాక జీవితం నీ ముందుకు విసిరిన ప్రతి సవాలును అంతు లేని ధైర్యం, హుందాతనంతో ఎదుర్కోవడం నేను చూశాను. నాన్న లేని నీ జీవితం ఎంత కఠినంగా గడిచిందో ప్రియాంకకు, నాకు మాత్రమే తెలుసు. ఈరోజు తన జయంతి రోజున నాన్న పైనుంచి నవ్వుతూ తన అందమైన సోనియా వైపు గర్వంగా చూస్తూ ఉంటాడు'' అంటూ రాహుల్ భావోద్వేగంతో రాసుకొచ్చారు.

**యువతకు అవకాశాలతోనే 'స్వ రాజ్'**

యువత తమ మనోభావాలను స్వేచ్ఛగా చెబుతోందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని రాహుల్‌గాంధీ అన్నారు. దేశంలోని వ్యవస్థల్లో మౌలిక మార్పులు తీసుకురావడానికి ఈ శక్తి ఉపయోగపడాలని, ఈ చైతన్యాన్ని దేశ యువత భవిష్యత్తును మార్చేందుకు ఎలా వినియోగించాలన్నదే అసలైన పోరాటమన్నారు. తన తండ్రి, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా జవహర్ భవన్‌లో జరిగిన 'సమృద్ధ స్వరాజ్యం; రాజీవ్ దార్శనికతకు నివాళి' కార్యక్రమంలో రాహుల్ మాట్లాడారు. మహాత్ముడి స్వరాజ్య దార్శనికత ఫలించాలంటే ప్రభుత్వం యువతకు అవకాశాలు కల్పించాలని, అందరం వారికి తోడ్పాటును అందించాలన్నారు. స్వాతంత్ర్యం, స్వరాజ్యం రెండూ ఒకటి కాదన్న రాహుల్.. ఒకరు మరొకరికి స్వాతంత్ర్యం ఇవ్వవచ్చని, 'స్వ రాజ్' మాత్రం ఇంకొకరు ఇచ్చేది కాదన్నారు. యువత దేశంలోని పరిస్థితులను అర్థం చేసుకొని గళం విప్పుతున్నందుకు తాను గర్విస్తున్నట్లు తెలిపారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్, పలువురు పార్టీ నేతలు, యువత పాల్గొన్నారు.

**రాజీవ్‌కు ప్రధాని నివాళి**

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ప్రధాని మోదీ నివాళులర్పించారు. గురువారం రాజీవ్ జయంతి సందర్భంగా ఎక్స్ వేదికగా ప్రధాని స్పందించారు. 1944 ఆగస్టు 20వ తేదీన రాజీవ్ గాంధీ జన్మించారు. 1991 మే 21వ తేదీన హత్యకు గురయ్యారు. 1984 అక్టోబరు 31 నుంచి 1989 డిసెంబరు 2 వరకూ ప్రధానిగా పని చేశారు.



రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ పార్టీ నివాళులర్పించింది. వీర్‌భూమిలోని ఆయన సమాధివద్ద పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలు నివాళులర్పించారు.

# హత్య కేసులో దోషి.. 105 ఏళ్ల వృద్ధుడికి 'సుప్రీం' ఉపశమనం

ఓ హత్య కేసులో దోషిగా తేలి శిక్ష అనుభవిస్తున్న 105 ఏళ్ల వృద్ధుడికి సుప్రీం కోర్టు ఉపశమనం కల్పించింది. ఇదివరకు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌నే అంతిమ నిర్ణయంగా పేర్కొంది. గతంలో విధించిన యావజ్జీవ కారాగార శిక్ష పూర్తి కాకపోయినా అతడిని తిరిగి అదుపులోకి తీసుకోవద్దని.. ఇక నుంచి ఆయన స్వేచ్ఛగా జీవించవచ్చని స్పష్టం చేసింది.

పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన రసిక్ చంద్ర మోండల్ (105) దాదాపు నలభై ఏళ్ల క్రితం ఓ హత్య కేసులో నిందితుడు. 1994లో అతడిని న్యాయస్థానం దోషిగా తేల్చి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఈ శిక్షను తొలుత కలకత్తా హైకోర్టులో సవాల్ చేయగా చేయగా అక్కడ చుక్కెదురైంది. అనంతరం సుప్రీం కోర్టుకు వెళ్లినప్పటికీ ఉపశమనం లభించలేదు.



అయితే, తనకు 99ఏళ్ల వయసు అని, వృద్ధాప్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్నానని పేర్కొంటూ మోండల్ మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ముందస్తు విడుదల చేయాలని కోరుతూ 2020లో పిటిషన్ దాఖలు చేశారు. అతడి పిటిషన్‌ను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ స్పందనను కోరింది. చివరకు 2024 నవంబర్‌లో మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. తాజాగా ఇదే కేసును విచారించిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం.. పిటిషనర్ వయసును పరిగణనలోకి తీసుకొని ఈ కేసును మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఇంకా అతడికి ఏమైనా శిక్ష మిగిలి ఉన్నట్లయితే దానిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది.

## ఉపాధ్యాయుడు, మహిళా టీచర్ మధ్య 'అతి సాన్నిహిత్యం'.. విద్యార్థుల ఫిర్యాదు

సన్నిహితంగా గడిపేందుకు ఓ ఉపాధ్యాయుడు, మహిళా టీచర్ సమయానికి ముందే తరగతులు ముగిస్తున్నారు. దీనిపై విద్యార్థులు కలెక్టరేట్ లో ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడాలో చోటుచేసుకుంది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. బీచ్ బహీర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు.. అదే స్కూల్‌లోని మహిళా టీచర్‌తో సన్నిహితంగా ఉంటున్నారు. ఏకాంతంగా గడిపేందుకు.. సమయం కంటే ముందుగానే తరగతులు ముగించి, విద్యార్థులను ఇళ్లకు పంపించేస్తున్నారు. వారి తీరుతో విసిగిపోయిన విద్యార్థులు జిల్లా కలెక్టరేట్ ను ఆశ్రయించి.. ఉపాధ్యాయులపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గిరిజన వ్యవహారాల శాఖ సహాయ కమిషనర్ సత్యేంద్ర సింగ్‌ను కలెక్టర్ ఆదేశించారు. విచారణలో ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య సన్నిహిత సంబంధం ఉందని తేలడంతో వారిని వేర్వేరు పాఠశాలలకు బదిలీ చేశారు. సదరు ఉపాధ్యాయుల స్థానంలో కొత్త అతిథి ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు.



# అందుకే ప్రతి ప్రశ్నకు రూ.200 వసూలు

**ఆన్సర్ కీ ఛాలెంజ్ ఫీజుపై స్పష్టత**

యూజీసీ నెట్ ఆన్సర్ కీపై అభ్యంతరాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయించిన ఫీజుపై విమర్శలు వస్తున్నాయి. ప్రతి ప్రశ్నకు రూ.200 చొప్పున అంటే.. అభ్యర్థులపై అధిక భారం పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్‌టీఏ దీనిపై స్పందిస్తూ.. ఫీజు చెల్లింపు ప్రక్రియపై వివరణ ఇచ్చింది. అభ్యంతరాలు సరైనవైతే.. రీఫండ్ ఉంటుందని స్పష్టం చేసింది.

''ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా ఈ ఆన్సర్ కీ ఛాలెంజ్ సిస్టమ్‌ను రూపొందించాం. ఒక ప్రశ్నకు సంబంధించిన సమాధానంపై ఎవరైనా విద్యార్థి అభ్యంతరం వ్యక్తం చేస్తే దాన్ని సబ్జెక్ట్ నిపుణులు పరిశీలిస్తారు. ఒకవేళ సదరు విద్యార్థి అభ్యంతరం సరైనది అయితే.. ఆన్సర్ కీని సవరిస్తాం. కొత్త సమాధానం పరీక్ష రాసిన విద్యార్థులందరికీ వర్తిస్తుంది. సదరు అభ్యర్థి ఛాలెంజ్ సరైనదే అని రుజువైతే ఆ ప్రశ్నకు చెల్లించిన మొత్తం రీఫండ్ చేస్తాం. అర్థంలేని అభ్యంతరాలు రాకుండా ఉండేందుకే ప్రతి ప్రశ్నకు రూ.200 చొప్పున ఫీజును నిర్ణయించాం. అంతేగానీ.. దీన్నుంచి లాభం పొందడానికి కాదు'' అని ఎన్‌టీఏ వెల్లడించింది.

జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్), అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల అర్హతకు, పీహెచ్‌డీ ప్రోగ్రాముల్లో ప్రవేశం కోసం నిర్వహించిన సీఎస్ఐఆర్‌యూజీసీ నెట్ ప్రాథమిక కీను ఎన్‌టీఏ ఇటీవల విడుదల చేసింది. ఆన్సర్ కీలో ఏదైనా సమాధానం తప్పుగా ఉందని అభ్యర్థులు భావిస్తే.. ప్రతి ప్రశ్నకు రూ.200 చెల్లించి కీ పై తమ అభ్యంతరాలను తెలియచేయొచ్చని ప్రకటించింది. జూన్ 22 నుంచి 30 వరకు 87 సబ్జెక్టుల్లో యూజీసీ నెట్ పరీక్షను నిర్వహించింది.




అయితే, ఇందులో ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నపత్రాల్లో వివిధ రకాల లోపాలపై ఫిర్యాదులు రావడంతో ఆ పరీక్షలను రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఈ సబ్జెక్టులకు సెప్టెంబరులో మరోసారి పరీక్ష నిర్వహించనుంది.

## సెప్టెంబరు 30 నాటికి 'అయోధ్య' నిర్మాణం పూర్తి: నృపేంద్ర మిశ్ర

ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయ నిర్మాణం సెప్టెంబరు 30 నాటికి పూర్తవుతుందని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర గురువారం మీడియాకు వెల్లడించారు. ఎల్ అండ్ టీ, టాటా నిర్మాణసంస్థల ప్రతినిధులు ఆ తర్వాత కూడా నెల రోజులపాటు ఆలయం వద్దే ఉంటారన్నారు. రాజకీయ నిర్మాణ్ నిగమ్ ఆధ్వర్యంలో ఆడిటోరియం, మ్యూజియం పనులు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఇవి పూర్తి కావచ్చన్నారు. మ్యూజియం కోసం రాత ప్రతులు సిద్ధం చేశామని, వీటిని ఐఐటీ మద్రాసు నిపుణుల ఆధ్వర్యంలో వీడియోల రూపంలోకి మారుస్తామని చెప్పారు. ఆలయం చుట్టూ ప్రహరీగోడ నిర్మాణం డిసెంబరు కల్లా పూర్తవుతుందన్నారు.



# ప్లీజ్.. చైనీస్ అనొద్దు మేము భారతీయులం




''ఇతరులు మమ్మల్ని చైనీస్ అంటే చాలా బాధ, కోపం కలుగుతాయి. మేము భారతీయులమే. ఇటానగర్‌లో ఉంటాం. దయచేసి, చైనీస్ అనొద్దు''.. అంటూ దాదాపు పదేళ్ల వయసున్న ఈ చిన్నారి చేతులు జోడించి చెబుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. దేశానికి ఓ మూలగా సరిహద్దులో ఉన్న ఈశాన్య రాష్ట్రాల ప్రజలు తరచూ ఎదుర్కొనే వివక్షకు 56 సెకండ్ల ఆ వీడియో అద్దం పడుతోంది. రూపురేఖల ఆధారంగా వ్యక్తులను గుర్తించే ధోరణిని ఈ అరుణాచల్ ప్రదేశ్ చిన్నారి ప్రశ్నిస్తోంది. వైవిధ్యమే భారతదేశ బలమంటూ ఈ బాలిక వీడియోకు నెటిజన్ల నుంచి విపరీతమైన మద్దతు లభిస్తోంది. ''ఈ చిన్నారి మాటలు నేరుగా మనసును తాకుతున్నాయి. నిజమైన భారతీయత అంటే ఏమిటో చెబుతున్నాయి. సొంత దేశంలో గుర్తింపు కోసం ఇలా వేడుకునే పరిస్థితి దేశంలో మరే చిన్నారికీ రావొద్దు'' అని ఓ నెటిజను 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ''పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజలు భారతీయ గుర్తింపును స్వీకరించేలా ఒప్పించడానికి మనం చాలా శక్తిని వెచ్చిస్తున్నాం. ఈ దేశాన్ని ప్రేమిస్తూ, భారతీయులమని గర్వపడే ఈశాన్య ప్రాంతంలోని మన సొంత పౌరులను చైనీయులు అంటున్నాం'' అని మరొకరు ఆవేదన వ్యక్తం చేశారు.

# పెల్లెట్ గన్‌ల అంశం.. దిల్లీలో రాహుల్ గాంధీ ధర్నా



దిల్లీలో విద్యార్థుల నిరసనల సమయంలో పోలీసులు పెల్లెట్ గన్ లతో కాల్పులు జరపడాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా విమర్శించారు. పెల్లెట్లు తగిలి గాయపడిన సాహిల్ అనే యువకుడితో కలిసి రాహుల్ శుక్రవారం మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు తిరస్కరించడంతో పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ బయట ధర్నాకు దిగారు. ఈ విషయంపై ఈ నెల 17న మెయిల్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకూ అక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశారు. రాహుల్ వెంట ప్రియాంకా గాంధీతోపాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు ఈ ధర్నాలో పాల్గొన్నాయి. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. 'సాహిల్ శరీరంలో 200కు పైగా పెల్లెట్స్ షెల్స్ ఉన్నాయి. వాటిలో మూడు కంట్లోకి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ నిరసనల్లో పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని కేంద్రమంత్రులు, పోలీసులు చెబుతున్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిపై ఇటువంటి క్రూర చర్యలు చట్టవిరుద్ధం మాత్రమే కాదు.. తీవ్రమైన నేరం కూడా. ఈ ఘటనకు బాధ్యులను గుర్తించి.. వారిపై కేసు నమోదు చేయాలి. సాహిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి' అని రాహుల్ డిమాండ్ చేశారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనల సమయంలో విద్యార్థులను అడ్డుకునేందుకు పోలీసులు, భద్రతా బలగాలు వారిపై పెల్లెట్ గన్‌లను వినియోగించారని రాహుల్ గాంధీ వెల్లడించారు. అవి తగిలి గాయపడిన విద్యార్థితో మీడియా సమావేశం సైతం నిర్వహించారు. ఇంత జరిగినా ఈ విషయాన్ని పోలీసులు పట్టించుకోవట్లేదని.. దాడి చేసిన సిబ్బందిపై ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని పేర్కొన్నారు.

# ట్రాన్స్‌జెండర్‌నని నమ్మించి.. పూజల పేరుతో ఎయిర్ హోస్టెస్‌పై అత్యాచారం



తాను ట్రాన్స్‌జెండర్‌నని.. ఇంటికి ఉన్న దిష్టి పోవడానికి పూజలు చేస్తానని నమ్మించి ఓ యువకుడు ఎయిర్ హోస్టెస్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ముంబయిలో చోటుచేసుకుంది. ముంబయిలోని ఓ ప్రముఖ హౌసింగ్ సొసైటీలోకి బుధవారం ఓ వ్యక్తి ట్రాన్స్‌జెండర్ రూపంలో ప్రవేశించాడు. ఇంటికి చెడు దిష్టి ఉందని.. దానిని పోగొట్టడానికి పూజలు చేయాలని అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో ఉన్న 25ఏళ్ల ఎయిర్ హోస్టెస్‌ను నమ్మించాడు. అదే సమయంలో తన భర్త అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అతడు చెప్పిన మాయ మాటలను నమ్మి.. పూజలు చేయడానికి ఆమె అంగీకరించారు.

ఫ్లాట్‌లోకి ప్రవేశించిన అనంతరం అతడు ఎయిర్‌హోస్టెస్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడిని కల్యాణ్ ప్రాంతంలోని ఓ మురికివాడకు చెందిన అనిల్ షిండే (28)గా గుర్తించారు.




# స్పష్టమైన నియంత్రణలే ముఖ్యం!

ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో స్వచ్ఛంద సంస్థలు(ఎన్‌జీవోలు) కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో చాలావాటికి అంతర్జాతీయ దాతృత్వం ద్వారా నిధులు అందుతున్నాయి. ఇలాంటి విరాళాలను స్వీకరించడం, వినియోగించడం వంటి అంశాల్లో పారదర్శకత, నియంత్రణ కోసం 2010లో 'ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్‌ఏ)'ను తెచ్చారు. అయితే, కేంద్రం దీనికి సవరణలు ప్రతిపాదిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై విమర్శలు, భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొన్ని ఎన్‌జీవోల నుంచి భయాందోళనలూ వ్యక్తమవుతున్నాయి. దాంతో తాజాగా ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. ఈ నేపథ్యంలో, ప్రతిపాదిత బిల్లుపై వ్యక్తమవుతున్న విమర్శల్లో నిజమెంత? ప్రభుత్వ ఉద్దేశమేంటి? అన్నవి పరిశీలనార్హమైనవి.

ప్రపంచంలోని అనేక దేశాలు విదేశీ నిధులను అనుమతించడంతో పాటు వాటిపై కొన్ని నియంత్రణలనూ విధిస్తున్నాయి. భారత్ కూడా విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) తీసుకొచ్చింది. ఆ ప్రకారం భారతీయ ఎన్‌జీవోలు, ట్రస్టులు, సొసైటీలు వంటివి విదేశీ విరాళాలను స్వీకరించాలంటే ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్ లేదా ముందస్తు అనుమతి అవసరం. ప్రత్యేక బ్యాంకు ఖాతాలను నిర్వహించడంతో పాటు విదేశీ నిధులను ఎలా ఖర్చుపెట్టారో లెక్కలు చూపించాల్సి ఉంటుంది. 2020 నాటి సవరణలతో ఎఫ్‌సీఆర్‌ఏ చట్రం మరింత పదును తేలింది. వాస్తవానికి, విదేశీ నిధులంటే కేవలం డబ్బులే కాదు, కొన్ని షరతులు కూడా ఉంటాయి. విదేశీ దాతలు పారదర్శకత లేకుండా, ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించడం కోసం నిధులిస్తే సహజంగానే ఆందోళన ఉత్పన్నమవుతుంది. అందుకోసం నియంత్రణలను కఠినతరం చేయాల్సి వస్తుంది. అదే సమయంలో కట్టుదిట్టంగా రూపొందించని నియంత్రణల వల్ల నిజాయతీగా పనిచేసే ఎన్‌జీవోలను అనవసరంగా లక్ష్యంగా చేసుకోవడం, చట్టబద్ధమైన పౌరసమాజ కార్యకలాపాలను పరిమితం చేయడం వంటి ప్రమాదాలుంటాయి.

**విదేశీ నిధులపై అనుమానమెందుకు?**

బ్రిటన్, అమెరికా, ఆస్ట్రేలియా వంటివి సైతం నేడు 'విదేశీ ప్రభావం'పై ఆందోళన చెందుతున్నాయి. కానీ, విదేశీ నిధులను పూర్తిగా నిషేధించడం కంటే పారదర్శకత, నమోదు, సంబంధాల వెల్లడింపు వంటి మార్గాలకే ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ విషయంలో భారతదేశ పరిస్థితి కొంత భిన్నమైనదని గుర్తించాలి. మనది అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ప్రజాస్వామ్యం. ప్రాంతీయ అసమానతలు, భాష, మతపరంగా వైరుధ్యాలున్నాయి. బలహీన వర్గాలు అధికం. సంపన్న దేశాలతో పోలిస్తే మన దగ్గర దేశీయ దాతృత్వ వనరులు తక్కువ. అందువల్ల విదేశీ దాతృత్వం భారతదేశానికి గణనీయమైన సామాజిక ప్రయోజనాలను అందించగలదు. విదేశీ నిధులతో చారిత్రకంగా అనేక సంస్థలు విద్య, ఆరోగ్యం, దివ్యాంగులూ బాలల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, విపత్తు సాయం, పర్యావరణ పరిరక్షణ, పరిశోధన, ఉపాధి కల్పన వంటి రంగాల్లో పనిచేస్తున్నాయి. కాబట్టి విదేశీ నిధులకు పూర్తిగా తలుపులు మూసివేయడం సామాజికంగా, ఆర్థికంగా ప్రభావం చూపే నిర్ణయమే అవుతుంది.

అయితే, విదేశాల నుంచి పెద్దయెత్తున నిధులు పొందే సంస్థల గురించి ప్రభుత్వం చాలా విషయాలను తెలుసుకోవాల్సి ఉంటుంది: నిధులు ఎవరు ఇస్తున్నారు, ఎలా వస్తున్నాయి? అందుకు షరతులేంటి? స్వీకరణ సంస్థను ఎవరు నియంత్రిస్తున్నారు, వచ్చిన నిధులు ఎక్కడికి వెళ్తున్నాయి, ఎందుకు వెళ్తున్నాయి? నిజంగానే సామాజిక సేవ జరుగుతోందా? రాజకీయ, మతపరమైన కార్యక్రమాలకు నిధులు ఉపయోగిస్తున్నారా? అనేవి ఇందులో కీలకం. వీటితో పాటు మనీలాండరింగ్, ఉగ్రవాద నెట్‌వర్క్‌లతో సంబంధాలు, మతమార్పిడి కోసం ప్రలోభాలు, హవాలా మార్గాలు, ఉగ్రవాద భావజాల వ్యాప్తి, రహస్య నియామకాలు, నిరసనలకు నిధులు వినియోగించడం వంటి అంశాలనూ తెలుసుకుంటారు. అయితే, ఇలాంటి ఆరోపణలను మొత్తం ఎన్‌జీవో రంగానికి ఆపాదించడం సరికాదు. ప్రతి దర్యాప్తు ఆధారాలు, చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే జరగాలి. విదేశీ నిధుల విషయంలో అత్యంత సున్నితమైన అంశం, మతమార్పిడికి ఈ నిధులను వినియోగిస్తున్నారా అన్నదే. అయితే మతపరమైన సేవకూ, మతమార్పిడి షరతుగా సేవచేయడానికీ మధ్య స్పష్టమైన తేడాను గుర్తించడమూ ముఖ్యమే.

**కొత్త విధానం ఎలా ఉండాలి?**

ప్రభుత్వం తీసుకురాదలచిన సవరణ చట్టం- విదేశీ నిధులు ఎక్కడి నుంచి వచ్చాయో, ఎవరికి వెళ్లాయో, ఎలా ఖర్చయ్యాయో పూర్తిగా గుర్తించగలగాలి. ఇది సమర్థించదగిన విధానం. అదే సమయంలో, తప్పగా రూపొందించే నియంత్రణలు నిజాయతీగా పనిచేసే స్వచ్ఛంద సంస్థలను, పౌర సమాజాన్ని అణచివేసే పరిస్థితిని సృష్టించవచ్చు. వర్ధమాన దేశాలకు విదేశీ దాతృత్వం అభివృద్ధికి అవసరమైన వనరుగా ఉంటుంది. భారత్ ఓవైపు విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, విదేశీ విశ్వవిద్యాలయాలు, విదేశీ సాంకేతికత, అంతర్జాతీయ పరిశోధనా సహకారం, విదేశీ పర్యాటకులు, విదేశాల నుంచి భారత సంతతి పంపే నగదును కోరుకుంటోంది. అంతర్జాతీయ దాతృత్వాన్నీ ఆశిస్తోంది. కాబట్టి నియంత్రణల విషయంలో స్పష్టతకు పెద్దపీట వేయాలి. ప్రజాస్వామ్య దేశమేదీ పారదర్శకతలేని విదేశీ నిధులను రాజకీయ జోక్యానికీ, మనీలాండరింగ్‌కూ, ఉగ్రవాదానికీ, బలవంతపు సామాజిక ప్రభావానికీ అనుమతించదు. విదేశీ నిధుల వినియోగంలో పారదర్శకత, జవాబుదారీతనం, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ ముమ్మాటికీ అవసరం. అయితే ఎఫ్‌సీఆర్‌ఏ సవరణల్లో సంస్థల నమోదు, రద్దు లేదా గడువు ముగిసిన సందర్భంలో విదేశీ నిధులతో సమకూరిన ఆస్తులపై ప్రభుత్వానికి విస్తృత అధికారాలు కల్పించడం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నిబంధనలు స్వచ్ఛంద సంస్థల స్వయంప్రతిపత్తిని ప్రభావితం చేయవచ్చని, ముఖ్యంగా సామాజిక సేవ, మైనారిటీ సంస్థలపై అనవసర ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. అందువల్ల దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు సంస్థలకు తగిన అప్పీల్ అవకాశం, పారదర్శక ప్రక్రియ, స్వతంత్ర సమీక్ష ఉండేలా చట్టంలో సమతుల్యత అవసరం. అత్యుత్తమ ఎఫ్‌సీఆర్‌ఏ వ్యవస్థ విదేశీ నిధులను పూర్తిగా తొలగించదు; విదేశీ దాతృత్వం, విదేశీ జోక్యం మధ్య స్పష్టమైన తేడాను కచ్చితమైన ఆధారాలతో పారదర్శకంగా, సమర్థ పర్యవేక్షణ ద్వారా గుర్తిస్తుంది. ఇప్పుడు కేంద్రం తీసుకురాదలచిన ఎఫ్‌సీఆర్‌ఏ విధానానికి ఇదే మూలసూత్రం కావాలి.




# అంతిమ పరిష్కారం.. 'నీట్' రద్దు!

**ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) పేరుతో జెన్ జీ యువత, విద్యార్థులు ఇటీవల ఒక అపూర్వ నిరసన చేపట్టారు. ఆ ఆందోళన ఫలితంగా కాలవాహినిలో మరుగున పడిన వివిధ అంశాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. వాటిలో ఒకటి– 'నీట్' రద్దు; మరొకటి– 'విద్యను ఉమ్మడి జాబితా నుంచి తొలగించి రాష్ట్రాల జాబితాలోకి తిరిగి చేర్చడం'. వైద్యవిద్యా కోర్సులు ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్‌లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించే 'నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్' (నీట్)ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటి నుంచీ అది వివాదాస్పదంగానే ఉన్నది. వైద్య విద్యలో శిక్షణ కోసం రాష్ట్రాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షల వల్ల అనేక అక్రమాలు చోటుచేసుకోవడంతో పాటు విద్యార్థులపై విపరీతమైన ఆర్థిక భారం పడి, వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నందున జాతీయ స్థాయిలో ఒకే విధమైన ప్రవేశ పరీక్ష ఉండాలని కొందరు నిపుణులు సూచించారు. వైద్య విద్యలో ప్రవేశించడానికి అవసరమయ్యే అర్హతా పరీక్ష జాతీయ స్థాయిలో ఒకేవిధంగా ఉండాలని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) సైతం కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఈ సూచనల మేరకు కేంద్రం 2013లో వైద్య విద్యకు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష 'నీట్'ను ప్రవేశపెట్టింది. అయితే, అప్పటి నుంచి ఈ ఏడాది వరకు 5 సార్లు 'నీట్' నిర్వహణలో పలు అక్రమాలు సంభవించాయి. ఆ అవకతవకలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. వైద్య ప్రవేశ పరీక్షను పూర్తిగా రద్దు చేసి తిరిగి నిర్వహించిన సందర్భాలు... గతంలో 2015లో AIPMT విషయంలో, తాజాగా 2026లో నీట్ విషయంలో చోటుచేసుకున్నాయి. ఇది గమనార్హమైన వాస్తవం. 'నీట్'కు ప్రతి ఏటా హాజరవుతున్న విద్యార్థుల సంఖ్య సగటున 21 లక్షలు ఉంటుండగా, వారిలో 11 నుంచి 13 లక్షల మంది దాకా అర్హత సాధిస్తున్నారు. వీరిలో కేవలం 1 లక్షా 10 వేల నుంచి 1 లక్షా 25 వేల మంది వరకూ ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులలో ప్రవేశం పొందుతున్నారు. అంటే, 'నీట్' రాసిన వారిలో సీట్లు పొందేవారి సంఖ్య కేవలం 6 శాతంగా మాత్రమే ఉంటోంది.**




విధానపరంగా చూసినప్పుడు జాతీయ స్థాయిలో ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించడం అన్నది సముచితంగా కనిపిస్తోంది. అయితే 'నీట్' నిర్వహణలో అనేక లోపాలు, వైరుధ్యాలు ఉన్నాయనేది ఒక వాస్తవం. లక్షలాది విద్యార్థుల జీవితాలతో ముడివడి ఉన్న 'నీట్'ను లోపరహితంగా నిర్వహించలేకపోవడం కేంద్ర ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతోంది. ఈ ఏడాది (2026) 'నీట్' పరీక్ష రద్దు కావడంతో 12 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. జీవితాన్ని పణంగా పెట్టి కష్టపడి చదివే విద్యార్థులకు పేపర్ లీకేజీ వంటి అక్రమాలు అశనిపాతంగా పరిణమిస్తున్నాయి. పరీక్ష రద్దు కావడంతో తీవ్రమైన మానసిక ఒత్తిడికిలోనై కుప్పకూలిపోతున్నారు. రెండోసారి ఫీజు లేకుండా పరీక్ష నిర్వహించినప్పటికీ.. అందుకు చాలామంది విద్యార్థులు సన్నద్ధం కాలేకపోవడం ఓ చేదు వాస్తవం. 'నీట్'ను రద్దు చేయాలన్న డిమాండ్ ఊపందుకోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే పరీక్షా పత్రాల లీకేజీలు, ఇతర అక్రమాల వంటివి మాత్రమే కాకుండా అసలు ఈ పరీక్షను నిర్వహిస్తున్న తీరే దేశ సమాఖ్య వ్యవస్థను సవాల్ చేసే విధంగా ఉండటం ప్రధానంగా కనిపిస్తోంది. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ దేశంలోని 22 భాషల్ని అధికారికంగా గుర్తించింది. అయితే ఆశ్చర్యకరంగా 'నీట్' ప్రశ్న పత్రం 13 భాషల్లో మాత్రమే ఉంటుంది. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించడానికే 'నీట్' అని చెప్పే కేంద్ర ప్రభుత్వం ఈ లోపాన్ని ఎలా సమర్థించుకుంటుంది? ఈ 13 భాషలలో ప్రవేశం లేని విద్యార్థులు తమకు రాని ఏదో ఒక భాషలో లేదా ఇంగ్లీషును ప్రత్యామ్నాయంగా ఎంచుకొని అందులో పరీక్ష రాయాలి. అంటే, 'నీట్'లో 9 భాషల విద్యార్థులకు ఎంత అన్యాయం జరుగుతుందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ సరిపోతుంది.

'నీట్'లో మరో కీలకమైన లోపం ఏమంటే ప్రశ్నపత్రాన్ని 'సీబీఎస్ఈ' సిలబస్‌ను ఆధారం చేసుకొని రూపొందిస్తున్నారు. విద్యార్థుల్లో అత్యధికులు తమ రాష్ట్రంలో అమలు చేసే రాష్ట్ర సిలబస్‌ను మాత్రమే చదువుతారు. అంటే, 'నీట్'కు హాజరవుతున్న సీబీఎస్ఈ సిలబస్ విద్యార్థులకు ఇతరుల కంటే అదనపు ప్రయోజనం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. 'నీట్' రద్దు చేయాలని మొదటి నుంచీ పలు విధాలా పోరాటం చేస్తున్న తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం '2021లో వైద్య విద్యా ప్రవేశాలపై ఆ జాతీయ ప్రవేశ పరీక్ష ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి 'ఏకే రాజన్' కమిటీని ఏర్పాటు చేసింది. కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేవారికే 'నీట్'లో దాదాపు 90 శాతం సీట్లు లభిస్తున్నాయని, 'నీట్' అన్నది వేల కోట్ల రూపాయల విద్యా వ్యాపారానికి కేంద్ర బిందువుగా మారిందని, మెడికల్ డాక్టర్ కావాలనుకుంటున్న పేద, వెనుకబడిన వర్గాల హక్కులను, ప్రయోజనాలను ఇది కాలరాస్తోందని ఏకే రాజన్ కమిటీ నివేదిక వెల్లడించింది. మరి ఈ పరిస్థితుల్లో ఒక ప్రశ్న సహజంగానే సర్వత్రా చర్చకు వస్తోంది: 'విద్య అన్నది విద్యార్థి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించడం కోసం నేర్చుకునేదా? లేక విజ్ఞానం, నైపుణ్యాలు సముపార్జించి, తద్వారా ఉపాధి పొందే మార్గంగా ఎంచుకునేదా?' 'నీట్' పరీక్ష లేనప్పుడు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యనభ్యసించి అమెరికా, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు వెళ్లి అక్కడే స్థిరపడి ప్రసిద్ధ వైద్యులుగా భారతీయులు ఎంతో పేరు గడించారని కొందరు గుర్తు చేస్తున్నారు. గల్ఫ్ దేశాలలో, ఇంగ్లాండ్‌లో ఉన్న వైద్యులలో 20శాతం మంది భారతీయులేనని గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతేకాదు, 'నీట్' మొదలయ్యాక గత కొన్నేళ్లుగా దేశంలో వైద్య విద్యనభ్యసించే విద్యార్థులలో తగిన ప్రమాణాలు లేవన్న విమర్శ కూడా వినిపిస్తోంది.

పలు రాష్ట్రాలు, ప్రత్యేకించి ఈశాన్య ప్రాంత రాష్ట్రాలతోపాటు ఆర్థికంగా వెనుకబడిన బిహార్, రాజస్థాన్ మొదలైనవి కేంద్ర ప్రభుత్వం అందించే నిధులతోనే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. ఈ రాష్ట్రాలపై ఆర్థిక భారం తగ్గించడం కోసమే కీలకమైన 'విద్య'ను రాష్ట్రాల జాబితా నుంచి తొలగించి 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి ఉన్నత విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం ఇతోధికంగా రాష్ట్రాలకు నిధులు అందిస్తూ వస్తోంది. ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి కేంద్రం 'సర్వశిక్షా అభియాన్' వంటి కార్యక్రమాలను అమలు చేస్తోంది. అయితే, దేశంలో ప్రతి రాష్ట్రానికీ తమదైన ప్రత్యేక భాషా సంస్కృతులు ఉన్న నేపథ్యంలో స్థానిక అవసరాల రీత్యా అవసరమైన విద్యా వ్యవస్థను, విద్యా విధానాన్ని తమకు తాముగా రూపొందించుకునే స్వేచ్ఛ కోసం విద్యను రాష్ట్ర జాబితాకు బదలాయించాలని తమిళనాడు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఈ డిమాండ్ ఎక్కువగా వినిపిస్తోంది. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమైన సమాఖ్యవాద సూత్రాన్ని 'నీట్' ఉల్లంఘిస్తోందని ఆరోపిస్తూ, ఆ జాతీయ ప్రవేశ పరీక్ష రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. విద్యా విషయమై నిర్ణయాలు తీసుకునే రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని 'నీట్' హరించివేస్తోందని కూడా ఆ పిటిషన్‌లో తమిళనాడు ప్రభుత్వం పేర్కొంది. అంతేకాకుండా.. 'నీట్' పరీక్ష గ్రామీణ ప్రాంతాలు, రాష్ట్ర బోర్డు విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నది కనుక అది రాజ్యాంగ అధికరణ 14 (చట్టం ముందు అందరూ సమానులే) ప్రకారం సమానత్వ హక్కును ఉల్లంఘిస్తోందని కూడా ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ఇంకా తుది తీర్పు వెలువరించలేదు. కేంద్రం, రాష్ట్రాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడానికి రాజ్యాంగ అధికరణ 131 సుప్రీంకోర్టుకు అధికారాలు కల్పించింది. ఈ నేపథ్యంలో, సుప్రీంకోర్టు తీర్పు రాష్ట్రాలకు అనుకూలంగా ఉండవచ్చనే అభిప్రాయం న్యాయ వ్యవస్థ వర్గాలలో వ్యక్తమవుతోంది. అమెరికాతోపాటు పలు దేశాలలో విద్యను స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రస్థాయి ప్రభుత్వాలే నిర్వహిస్తున్నాయి. ఫెడరల్ ప్రభుత్వాలు విద్యలో జోక్యం చేసుకోవు.

మన దేశంలో కూడా విద్యను రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చవలసిన అవసరమున్నది. దీనివల్ల రాష్ట్రాలు గతంలో వలే తమ సొంత విధానాలు, ప్రమాణాలను నిర్ణయించుకోవడానికి, స్వయం ప్రతిపత్తితో పనిచేయడానికి అవకాశం లభిస్తుంది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు 'నీట్' వల్ల ఒకే ఒక్క అవకాశం ఉంటోంది. వైద్య విద్య ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తే ఇతర రాష్ట్రాలు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు వెళ్లే అవకాశం విద్యార్థులకు లభిస్తుంది. విభిన్న నేపథ్యాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రతిభకు అన్యాయం జరగదు. సామాజిక న్యాయానికి భంగం వాటిల్లదు. అదేవిధంగా తక్కువ ప్రాతినిధ్యం ఉన్న సామాజిక వర్గాలకు రాజ్యాంగ పరంగా లభించిన రిజర్వేషన్ విధానం రాష్ట్రాల స్థాయిలో సమర్థంగా అమలవుతుంది. అంతేకాకుండా రాజ్యాంగం ప్రవచించిన సమాఖ్య విధానం పటిష్ఠమవడమే కాకుండా కేంద్ర రాష్ట్ర సంబంధాలు సామరస్యంగా ఉంటాయి. అందువల్ల నీట్ పరీక్షను రద్దు చేయడం, విద్య అంశాన్ని రాష్ట్రాల జాబితాకు బదలాయించడం అన్ని విధాలా శ్రేయస్కరం.

# విష సంస్కృతికి ఆనవాళ్లు

**అభివృద్ధి అంటే కేవలం జీడీపీలో పెరుగుదల కాదు. మొన్నటి కంటే నిన్న, నిన్నటి కంటే నేడు జీవన ప్రమాణాలు ఎంత మెరుగుపడ్డాయి, సర్వమానవ సమానత్వాన్ని నిరాకరించే అనాగరిక ఆలోచనల్లోంచి బయటపడుతున్నామా లేదా అన్నవే పురోగతికి వాస్తవ కొలమానాలు. ఆ గీటురాళ్ల మీద గణిస్తే జనభారతం చేరుకోవాల్సిన ప్రగతి గమ్యాలు ఇంకా సుదూరంగానే కనిపిస్తాయి. ముఖ్యంగా లైంగికతకు సంబంధించి మన సమాజంలో వేళ్లూనుకున్న మూస అభిప్రాయాలు స్త్రీల భద్రత, గౌరవాలను కాలరాస్తున్నాయి. మహిళల వస్త్రధారణకూ లైంగిక నేరాలకూ ముడిపెట్టి కొంతమంది చేసే చిల్లర వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయి. అలాంటివి ఏవిధంగానూ ఆమోదయోగ్యం కావని దిల్లీ హైకోర్టు తాజాగా తేల్చిచెప్పింది. లైంగిక వేధింపుల కేసులో ఒక వ్యక్తిని దోషిగా ప్రకటిస్తూ- మహిళల వస్త్రధారణను సాకుగా చూపి పురుషుల దుష్ప్రవర్తనను సమర్థించలేరని, స్త్రీల ఇష్టాయిష్టాలను నియంత్రించే అధికారం ఎవరికీ లేదని ఉన్నత న్యాయస్థానం స్పష్టీకరించింది. అమ్మాయిలతో ఎలా నడుచుకోవాలో ఇంట్లో అబ్బాయిలకు నేర్పకుండా ప్రతిదానికీ ఆడపిల్లలనే తప్పబడుతూ, లైంగిక అకృత్యాల కేసుల్లోనూ బాధితురాళ్లపైనే నెపం మోపి నేరగాళ్లను వెనకేసుకొచ్చే పురుషాధిక్య సంస్కృతి దేశీయంగా చాలాచోట్ల వెర్రితలలు వేస్తోంది. సామాజిక మాధ్యమాల్లోనూ అదే అవాంఛనీయ అమానవీయ ధోరణి ప్రబలమవుతోంది!**



వెనకటికాలంతో పోలిస్తే ఆడపిల్లలు ఇప్పుడు ఎక్కువ సంఖ్యలో చదువుకుంటున్నారు. శాస్త్ర పరిశోధనల నుంచి దేశ రక్షణ వరకు అనేకానేక కీలక రంగాల్లో తమ ప్రతిభా సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. కానీ, వారిని పితృస్వామ్య భావజాల కళ్లద్దాల్లోంచి మాత్రమే చూస్తున్న ప్రబుద్ధులు చాలామంది అసభ్య వ్యాఖ్యల వాంతులు చేసుకుంటూ, లైంగిక నేరాలను సాధారణీకరించేస్తున్నారు. అలాంటి మూకల మూలంగానే దేశీయంగా మహిళలపై దాష్టీకాలు ఏడాదికేడాదికి పెరిగిపోతున్నాయి. ఆసేతుహిమాచలం స్త్రీలపై రోజుకు పన్నెండొందలకు పైగా దారుణాలు చోటుచేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లోనూ వేధింపుల పర్వాలు తీవ్రతరమవుతున్నాయి. అయిదేళ్లలో అలాంటి కేసులు రెట్టింపు అయ్యి నిరుటికి రెండున్నర లక్షలకు చేరాయి. భారతావనికి సంబంధించి గడచిన కొన్నేళ్లలో సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ కంటెంట్ పరిమాణం దాదాపు 900శాతం అధికమైందని ఇటీవల ఒక అధ్యయనంలో వెల్లడైంది. విషం మాదిరిగా ఆన్‌లైన్‌లో వ్యాపిస్తున్న అశ్లీల డీప్‌ఫేక్‌లలో 90శాతం మహిళలను లక్ష్యంగా చేసుకున్నవే. వాటిని అరికట్టడంలో ఆయా సంస్థల వైఫల్యం, నేరగాళ్లను గుర్తించి కఠినంగా దండించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడంలో యంత్రాంగం చేతకానితనం... ఇవన్నీ కలిసి స్త్రీలకు ఎక్కడా సురక్షిత వాతావరణం లేకుండా చేస్తున్నాయి!

ఆన్‌లైన్ వేధింపుల విషయంలోనే కాదు, అత్యంత హేయమైన నేరాల్లోనూ నిందితులకు సకాలంలో శిక్షలు పడకపోతుండటం వల్ల మహిళా సాధికారతకు విఘాతకరమైన అరాచక పరిస్థితులు అలాగే కొనసాగుతున్నాయి. 201824 మధ్య దేశవ్యాప్తంగా 2.15 లక్షలకు పైగా అత్యాచార ఘటనలు నమోదైతే, 31వేల కేసుల్లోనే అపరాధులకు శిక్షలుపడ్డాయి. శాస్త్రీయమైన దర్యాప్తులు, వేగవంతమైన విచారణలతో ఈ అవ్యవస్థను మార్చడమెంత ముఖ్యమో మగపిల్లలకు చిన్నప్పటి నుంచే మంచీచెడూ చెబుతూ పెంచడమూ అంతే ప్రధానం. కట్టూబొట్టు, మాటతీరు, ప్రవర్తన తదితరాల్లో అమ్మాయిలపై ఆంక్షలు విధిస్తూ... అబ్బాయిలు ఎలా ఉన్నా, ఏం చేసినా చెల్లిపోతుందనే మనస్తత్వాల్లో మార్పు రానంత కాలం జుగుప్సాకర నేరాల ఉద్ధృతికి కారణమవుతున్న లింగ వివక్ష అంతం కాదు. అంతవరకు ఆర్థికంగా ఎంతగా ముందడుగు వేసినప్పటికీ జాతి పురోగమనం అర్థవంతం కాబోదు!

# పాత ఒప్పందానికి పాతర

అనిశ్చిత ప్రపంచంలో మరో కొత్త రక్షణ ఒప్పందం ఉనికిలోకొచ్చింది. తుర్కియే, సౌదీ అరేబియా, పాకిస్తాన్‌లు గత శుక్రవారం 'మక్కా రక్షణ ఒప్పందం' పేరిట ఒక ఒడంబడిక కుదుర్చుకున్నాయి. పూర్తి పాఠాన్ని బయటపెట్టలేదు గనుక దీని లోతుపాతులు తెలియవు. కానీ పాకిస్తాన్ విదేశాంగ శాఖ 'ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కరిపై దాడి జరిగినా అది అందరిపైనా జరిగిన దాడిగా పరిగణించాల'ని నిర్ణయించుకున్నట్టు ఒక ప్రకటన విడుదల చేసింది. తుర్కియే అధ్యక్షుడు రిసెప్ తయీప్ ఎర్డోగాన్ మాత్రం 'ఈ ఒప్పందం కింద ఉమ్మడిగా రక్షణ పరిశ్రమ ప్రాజెక్టులు చేపట్టడం, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో పాలుపంచుకోవటం ఉంటాయ'ని ఎక్స్ వేదికగా ప్రకటించారు. ఒప్పందం విషయంలో అమెరికాకు ఆగ్రహం కలుగుతుందని సౌదీ భావించినట్టుంది. అందుకే 'ఈ మూడు దేశాలకూ ఇప్పటికే ఉన్న ఇతర రక్షణ ఒప్పందాలు దీనికి అడ్డురాబోవ'ని సౌదీ ఉపమంత్రి రేయాద్ క్రిమ్లీ వివరణనిచ్చారు. ఒప్పందంపై కొద్ది నెలలుగా సాగిన చర్చల్లో పాల్గొన్న ఈజిప్టు చివరన ముఖం చాటేసింది. ఇంతకూ ఇస్లామిక్ దేశాల సహకార సంస్థ (ఓఐసీ) సదస్సులో గతంలో కుదిరిన 'మక్కా ఒప్పందం' ఏమైంది?

ఈ మూడు దేశాలకూ ఇరుగుపొరుగుతో వాటి వాటి సొంత ఘర్షణలున్నాయి. తమలో తమకున్న పొరపొచ్చాలు వీటికి అదనం. నాటోలో భాగస్వామిగా ఉన్న తుర్కియేకు ఏజియన్ సముద్రంలో మరో సభ్య దేశం గ్రీస్‌తో సరిహద్దు లడాయి వుంది. ఇజ్రాయెల్‌తో వైరం సరేసరి. పాకిస్తాన్ అయితే ఇటు మన దేశంతో పాటు అఫ్గానిస్తాన్‌తో కూడా కలహిస్తోంది. ఇరాన్‌పై అమెరికా దాడుల్ని సమర్థించటమేకాక... దాని అభీష్టం మేరకు ఇజ్రాయెల్‌తో అవగాహన కుదుర్చుకున్న చరిత్ర సౌదీది. పర్యవసానంగా ఇరాన్ నుంచీ, ఎర్ర సముద్రంలో ఇరాన్ మద్దతుదార్లయిన హౌతీలనుంచీ సమస్యలు ఎదుర్కొంటోంది. ఇక 2018లో తుర్కియే గడ్డపై జర్నలిస్టు ఖషోగ్గిని కిరాయి హంతకులతో సౌదీ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ హత్య చేయించారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయంలో రెండు దేశాల సంబంధాలూ దెబ్బతిన్నాయి. అమెరికా ప్రాపకంతో తెరవెనక సర్దుబాట్లు కుదిరినా తుర్కియే ఆగ్రహం చల్లారలేదు.

ఇలా ఎవరికి వారు సక్రమంగా లేకుండా, ఎవరిపై దాడి జరిగినా అందరం ఏకమవు తామనటంలోని సహేతుకత ఏమిటో అర్థంకాదు. దేశంలో అమెరికా స్థావరాలుంటే భద్రతకు తిరుగులేదని ఇతర గల్ఫ్ దేశాలతోపాటు సౌదీ కూడా అమాయకంగా అనుకున్నది. అమెరికా వేరేవారిపై దాడి చేస్తే దాని అధునాతన రక్షణ వ్యవస్థవల్ల ఒక్క క్షిపణి కూడా తమ గడ్డపై పడబోదని నమ్మింది. అదంతా ఉత్త భ్రమగా తేలింది. ఇరాన్ వల్లకాడు కావటానికి తోడ్పడుతూ తమ జోలికి మాత్రం అది రాకూడదని కోరుకోవటం అత్యాశ అని అర్థమైంది. అందుకే రక్షణ ఒప్పందాలు కుదుర్చుకుని అందరినీ హడలెత్తించాలని ఆ దేశం నిర్ణయించుకున్నట్టు కనబడుతోంది. నిరుడు పాక్‌తో కుదిరిన రక్షణ ఒప్పందం తాజా యుద్ధంలో కొరగాకుండా పోయింది. ఇరాన్‌తో అంటకాగిన పాక్... కనీసం సౌదీపై అది చేసిన దాడుల్ని ఖండించటానికి కూడా సిద్ధపడలేదు. తీరు మారకపోతే ఈ త్రైపాక్షిక ఒప్పందానికీ అదే గతి పడుతుంది.

ఇస్లామిక్ దేశాలు 2005లో 'మక్కా ఒప్పందం'కు దుర్చుకున్నాయి. ఆ సంగతి ముగ్గురిలో ఎవరికైనా గుర్తుందా? పదేళ్లపాటు కొనసాగాల్సిన ఆ ఒప్పందాన్ని మరో పదేళ్లు పొడిగించారు కూడా. దాని అతీగతీ తెలియదు. 21వ శతాబ్దంలో ఇస్లాంకు ఎదురవుతున్న సవాళ్లపై జరిపిన సదస్సులో ఈ ఒప్పందం కుదిరింది. ఇస్లామిక్ ప్రపంచంలో సంయమనం, సౌభ్రాతృత్వం, మానవ హక్కులు, సుపరిపాలన, ఆర్థిక సహకారం, ఘర్షణల నివారణ, పేదరిక నిర్మూలన, ఉన్నత విద్య, శాస్త్ర సాంకేతికతలు, మహిళల హక్కులు దాని ప్రధానాంశాలు. ఇందులో పాలస్తీనా కూడా ఉంది. వినడానికి భేషుగ్గా ఉంది. కానీ ఆచరణ? తాజా ఒప్పందంతో వాటన్నిటినీ పర్షియన్ గల్ఫ్‌లో నిండా ముంచినట్టేనా? ఇతరుల్ని ఇబ్బందుల్లోకి నెడుతూ, వారినుంచి తమకేమీ కాకూడదని ఆశించటం వ్యర్థ ప్రయత్నమని ఈ దేశాలు గుర్తించాలి. ఇందుకు బదులు 2005 నాటి ఒప్పందం అమలుకు చిత్తశుద్ధితో కృషిచేయాలి. అప్పుడు మాత్రమే వాటికి కోరుకున్న శాంతి లభిస్తుంది.

అనంత
జనశక్తి
జనం కోసమే మా అక్షరం
శనివారం | అనంతపురం | 22.08.2026 | 01

## భక్తిశ్రద్ధల నడుమ శ్రీ లక్ష్మీశ్రీనివాసుల కల్యాణ మహోత్సవం

**ధర్మవరం / బత్తపల్లి**

**ఆగష్టు 21 అనంత జనశక్తి న్యూస్ :**



బత్తలపల్లి గ్రామంలోని వడ్డవీధిలో కొలువు దీరిన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయం భక్త జన సందడితో కళకళలాడింది. ఆలయంలో శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ లక్ష్మీ శ్రీనివాసుల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు.

# తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' శస్త్రచికిత్స

- **మహిళకు మూత్రపిండాల పనితీరు పునరుద్ధరణ**
- **విశాఖపట్నంలోని ఏఐఎన్‌యు హాస్పిటల్ సెంటర్ ఫర్ రోబోటిక్ సర్జరీ**

**విశాఖపట్నం, ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**



ఉత్తరాంధ్ర యురాలజికల్ వైద్యరంగంలో ఆసియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యురాలజీ (AINU) వైజాగ్ సరికొత్త మైలురాయిని అధిగమించింది. కాకినాడకు చెందిన 50 ఏళ్ల మహిళకు అత్యంత సంక్లిష్టమైన 'లాంగ్ సెగ్మెంట్ యురేటరిక్ స్ట్రిక్చర్' (మూత్రనాళం పొడవునా ఏర్పడిన అవరోధం) సమస్యను నయం చేయడానికి,విశాఖపట్నంలోనే తొలిసారిగా రోబోటిక్ 'బోరి ఫ్లాప్' రీకన్స్ట్రక్షన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఆమె కిడ్నీ పనితీరును పునరుద్ధరించారు.బాధితురాలు ప్రారంభంలో మూత్రనాళంలో రాయి సమస్యతో బాధపడుతూ వేరే ఆసుపత్రిని సంప్రదించారు. అయితే మూత్రనాళం ఇరుకుగా ఉండడం వల్ల రాయిని తొలగించడం సాధ్యపడలేదు. ఫలితంగా ఆమె మూత్రపిండాల ఇన్ఫెక్షన్, మూత్ర అవరోధానికి గురయ్యారు. ఆ పరిస్థితిలో ఆమె ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో చేరగా, వైద్య బృందం వెంటనే పర్క్యుటేనియస్ నెఫ్రోస్టోమీ (PCN) ట్యూబ్ ద్వారా ఇన్ఫెక్షన్‌ను నియంత్రించి, ఆ తర్వాత మూత్రనాళంలోని రాయిని తొలగించింది. అయినప్పటికీ, మూత్రనాళం చాలా భాగం దెబ్బతినడం వల్ల ఆమెకు పదేపదే ఇన్ఫెక్షన్లు వస్తుండేవి. దీంతో వైద్యులు రోబోటిక్ రీకన్స్ట్రక్టివ్ పద్ధతి ద్వారా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స సమయంలో యురేటర్ (మూత్రనాళం) భాగం ఊహించిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంలో దెబ్బతిన్నట్లు గుర్తించారు. దాంతో సాధారణ శస్త్రచికిత్సలు ఉపయోగపడవని గ్రహించిన శస్త్రచికిత్స నిపుణులు, 'రోబోటిక్ బోరి ఫ్లాప్ రీకన్స్ట్రక్షన్' పద్ధతిని ఎంచుకున్నారు. ఇందులో మూత్రాశయం నుంచి ఒక చిన్న కణజాలాన్ని తీసుకుని, దెబ్బతిన్న మూత్రనాళాన్ని పునర్నిర్మించారు.సాంప్రదాయ ఓపెన్ సర్జరీ తో పోలిస్తే, రోబోటిక్ సాంకేతికత ద్వారా చిన్న కీహోల్ ద్వారా మాత్రమే ఈ ఆపరేషన్ పూర్తి చేశారు. దీనివల్ల రక్తస్రావం లేకపోవడం, నొప్పి లేకపోవడం మరియు రోగి వేగంగా కోలుకోవడం సాధ్యమైంది. శస్త్రచికిత్స పూర్తయిన మూడో రోజే రోగి కోలుకోవడంతో, కిడ్నీ ట్యూబ్‌ను తొలగించి ఆమెను డిశ్చార్జ్ చేశారు.ఈ సందర్భంగా సీనియర్ రోబోటిక్ సర్జన్ డాక్టర్ అమిత్ సాప్లే మాట్లాడుతూ: "ఈ కేస్ చాలా సంక్లిష్టమైనది. మూత్రనాళం ఇరుకుగా ఉన్న భాగం కీలకమైన రక్తనాళాలకు అత్యంత సమీపంలో ఉండటంతో ఆపరేషన్ సవాలుగా మారింది. రోబోటిక్ పరిజ్ఞానం వల్ల అత్యంత ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స పూర్తి చేయగలిగాం" అని తెలిపారు.ఏఐఎన్‌యు వైజాగ్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీనియర్ యురాలజిస్ట్ డాక్టర్ జి. రవీంద్ర వర్మ మాట్లాడుతూ: "దీర్ఘకాలిక యురేటరిక్ స్ట్రిక్చర్స్ కిడ్నీ పనితీరును దెబ్బతీస్తాయి. రోబోటిక్ బోరి ఫ్లాప్ విధానం ద్వారా మూత్రాశయ కణజాలాన్ని ఉపయోగించి మూత్ర ప్రవాహాన్ని సాధారణ స్థితికి తెచ్చాము. బాధితురాలి కిడ్నీని కాపాడటంలో రోబోటిక్ సాంకేతికత విప్లవాత్మక మార్పులు తెస్తోంది" అని పేర్కొన్నారు.ఈ రోబోటిక్ శస్త్రచికిత్సను డాక్టర్ అమిత్ సాప్లే, డాక్టర్ జి. రవీంద్ర వర్మ, మరియు డాక్టర్ పి. శ్రీధర్ లతో కూడిన నిపుణుల బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ఏఐఎన్‌యు వైజాగ్ ఆసుపత్రిలో ఈ తరహా సంక్లిష్ట రోబోటిక్ శస్త్రచికిత్సలతో పాటు రాడికల్ ప్రోస్టేటెక్టోమీ, రాడికల్ సిస్టెక్టోమీ వంటి అనేక అధునాతన ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.

# రాజధాని రైతుల కుటుంబంలో నేనూ ఒకడిగా ఉండి ల్యాండ్ పూలింగ్ చేశాను

- **మంత్రి నారాయణ**
- **తుళ్లూరు శివాలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేసిన మంత్రి**
- **రైతుల త్యాగాలతోనే అమరావతి తిరిగి రాజధానిగా మారిందని వెల్లడి**

**అమరావతి ఆగస్టు 21,అనంత జనశక్తి న్యూస్**



రాజధాని నిర్మాణం కోసం చేపట్టిన ల్యాండ్ పూలింగ్ సమయంలో తాను రాజధాని రైతుల కుటుంబంలో ఒకడిగా ఉండి వారితో కలిసి పనిచేశానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ అన్నారు. రైతులతో తనకు ఎంతో అనుబంధం ఉందని, ల్యాండ్ పూలింగ్ సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకు రైతుల మధ్యే ఉండి పనిచేశానని ఆయన గుర్తు చేసుకున్నారు. రైతుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అమరావతి తిరిగి రాష్ట్ర రాజధానిగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. శుక్రవారం తుళ్లూరులో శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, శ్రీ బాల కోటేశ్వరస్వామి వార్ల ఆలయ పునఃశంకుస్థాపన మహోత్సవానికి మంత్రి నారాయణ హాజరయ్యారు. ప్రభుత్వ సహకారంతో గ్రామస్తులు ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న నేపథ్యంలో ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తుళ్లూరు శివాలయానికి ఎంతో ప్రాశస్త్యం ఉందన్నారు. ఈ ప్రాంతానికి పురాతన చరిత్ర ఉందని, అలాంటి చారిత్రక ఆలయాన్ని తిరిగి నిర్మించడం సంతోషకరమని పేర్కొన్నారు.

**రైతులతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మంత్రి**

రాజధాని ల్యాండ్ పూలింగ్‌లో తుళ్లూరు రైతులు ఎంతో సహకరించారని మంత్రి నారాయణ తెలిపారు. "రాజధాని రైతుల కుటుంబంలో నేనూ ఒకడిగా ఉండి పూలింగ్ చేశాను" అని ఆయన పేర్కొన్నారు.ల్యాండ్ పూలింగ్ సమయంలో రైతులతో తనకు ఏర్పడిన అనుబంధాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రైతుల మధ్యే ఉండి పనిచేశానని, ఒకరి ఇంట్లో అల్పాహారం, మరొకరి ఇంట్లో భోజనం, ఇంకొకరి ఇంట్లో సాయంత్రం స్నాక్స్, మరో రైతు ఇంట్లో రాత్రి భోజనం చేసేంతగా వారితో అనుబంధం ఏర్పడిందని తెలిపారు.గతాన్ని ఎప్పటికీ మర్చిపోకూడదని, అమరావతి కోసం రైతులు ఏ ఉద్దేశంతో తమ భూములను ఇచ్చారో ఆ ఉద్దేశం నెరవేరాలని తాను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని మంత్రి నారాయణ అన్నారు.

**రైతుల పోరాటానికి తుళ్లూరు ఆలయం సాక్ష్యం**

అమరావతి రాజధాని కోసం రైతులు చేసిన పోరాటంలో తుళ్లూరు శివాలయం కీలక స్థలంగా నిలిచిందని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఇదే పవిత్రమైన ఆలయం నుంచి రైతులు 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రను ప్రారంభించారని గుర్తు చేశారు.రైతులు, ముఖ్యంగా మహిళా రైతులు నాటి ప్రభుత్వ హయాంలో ఎన్నో ఇబ్బందులు, ఒత్తిళ్లు ఎదుర్కొన్నారని మంత్రి అన్నారు. అయినప్పటికీ వారు వెనక్కి తగ్గకుండా అమరావతి కోసం పోరాడారని తెలిపారు.

రైతులు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అమరావతి తిరిగి రాష్ట్ర రాజధానిగా మారిందని, ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ అన్నారు. అమరావతి కోసం పోరాడిన ప్రతి రైతు సోదరుడికి ఈ సందర్భంగా మరోసారి అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

**రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగవంతం**

అమరావతిలో రైతులకు కేటాయించిన రిటర్నబుల్ ప్లాట్లలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. రోడ్లు, ఇతర ప్రాథమిక మౌలిక వసతుల పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

రాజధానిలో వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పనులను ప్రాజెక్టుల వారీగా చేపడుతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి నెలా ప్రాజెక్టుల వారీగా భవనాలను పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

**ప్రాజెక్టుల వారీగా రాజధాని అభివృద్ధి**

రాజధానిలో ప్రస్తుతం ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్ రోడ్ వంటి కీలక ప్రాజెక్టుల పై దృష్టి పెట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు.ప్రాజెక్టుల అవసరాలకు అనుగుణంగా ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను కొనసాగిస్తున్నామని చెప్పారు. ఆయా ప్రాజెక్టులకు అవసరమైన భూముల సమీకరణ పూర్తిచేసి అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

**సీడ్ యాక్సెస్ రోడ్డుకు ఎలివేటెడ్ కారిడార్**

సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవేతో అనుసంధానించే మూడో విడత నిర్మాణ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.వచ్చే శనివారం రోజున సీడ్ యాక్సెస్ రోడ్డును నేషనల్ హైవేతో కలిపే మూడో విడత నిర్మాణ పనులు, ఎలివేటెడ్ కారిడార్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. పనులు వేగంగా జరిగేలా అవసరమైన యంత్రాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

అమరావతిలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేసి, రైతులు రాజధాని కోసం చేసిన త్యాగాలకు తగిన ఫలితం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు..వరలక్ష్మీ వ్రతం సందర్భంగా రాష్ట్రంలోని మహిళలందరికీ మంత్రి నారాయణ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు

## ప్రముఖ నటి షావుకారు జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

**అమరావతి ఆగస్టు 21**

**అనంత జనశక్తి న్యూస్**



**ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ 'షావుకారు' జానకి మృతి పట్ల రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం తెలుగు సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. "'షావుకారు' చిత్రంతో సినీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొని 'షావుకారు జానకి'గా విశేష కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారు. రాజమహేంద్రవరంలో జన్మించిన ఆమె దశాబ్దాలకు పైగా సాగిన తన సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో 400కు పైగా చిత్రాల్లో నటించి, వైవిధ్యమైన పాత్రలతో సహజ నటనను ప్రదర్శించి కోట్లాది మంది అభిమానులను మెప్పించారు" అని గుర్తుచేసుకున్నారు. తెలుగు చిత్రసీమలో తన అభినయంతో చెరగని ముద్ర వేసిన షావుకారు జానకి మరణం కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు..ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన సానుభూతిని తెలిపారు.**

## కుస్తీ పోటీల్లో విద్యార్థినికి గోల్డ్ మెడల్

**ధర్మవరం ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్:**



విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కుస్తీ పోటీలలో శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పి ఆర్ టి వీధికి చెందిన గుంజేపల్లి కిరణ్మయి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. కిరణ్మయి ధర్మవరంలో కోటా ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి వరకు, అదేవిధంగా పదవ తరగతి జడ్పీ గర్ల్స్ హైస్కూల్ లో చదువుతూ స్పోర్ట్స్ కోటాలో తిరుపతిలోని పద్మావతి జూనియర్ కాలేజ్ (టీటీడీ) ఇంటర్మీడియట్ లో చేరుకొంది. అక్కడ కూడా తాను విద్యతోపాటు స్పోర్ట్స్ యందు మంచి ప్రతిభ కనపరుస్తూ కళాశాలలో మంచి గుర్తింపు పొందింది. తదుపరి విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో జరిగిన రాష్ట్ర కుస్తీ పోటీల్లో వెయిట్ కేటగిరి 49లో గోల్డ్ మెడలను సాధించింది. అదేవిధంగా బాస్కెట్బాల్ లో కూడా తన ప్రతిభను కనపరుస్తూ రాజస్థాన్, కలకత్తా, తమిళనాడు, పాండిచేరి రాష్ట్రంలో కూడా తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది. తల్లిదండ్రులు కవిత, వెంకటనారాయణ. తండ్రి బార్బర్ షాప్ వృత్తి చేసుకుంటూ కుమార్తెను పోషించుకుంటూ వచ్చాడు. కేవలం వీరికి ఒకే ఒక సంతానమే కిరణ్మయి. గోల్డ్ మెడల్ సాధించడం పట్ల బంధుమిత్రులు, తల్లిదండ్రులు, ఇతర క్రీడాకారుడు కిరణ్మయిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తం మీద ధర్మవరం పేరును ఇతర జిల్లాలలో కుస్తీ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించడం నాకెంతో గర్వంగా ఉందని కిరణ్మయి తెలిపింది.

## రాయదుర్గానికి 25న మంత్రి నారా లోకేష్ రాక



- **పర్యటన ఏర్పాట్లను సమీక్షించిన ఎమ్మెల్యే కాలవ., ఎస్పీ జగదీష్.**

**రాయదుర్గం ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఈ నెల 25న రాయదుర్గం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. నియోజకవర్గంలో 300 మెగావాట్ల సుజలాన్ కంపెనీ ప్లాంటుకు ఆయన శంకుస్థాపన చేస్తారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శుక్రవారం కనేకల్లు క్రాస్ సభాస్థలిని సందర్శించారు. జిల్లా ఎస్పీ జగదీష్, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పర్యటన కొనసాగే ప్రాంతాలను సందర్శించి ఏర్పాట్లపై సమీక్షించారు. మంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాటు చేయనున్న సభా వేదిక, స్టాల్స్, పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వాహనాల పార్కింగ్, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ జగదీష్ అధికారులకు సూచించారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

## ఘనంగా వరలక్ష్మీవ్రతం... ఏడుగురు అక్కమ్మ గార్ల పూజా కార్యక్రమం.





- **కన్యకల గొంది లో ఘనంగా అక్కమ్మ దేవతల పూజా కార్యక్రమం**
- **పెద్ద ఎత్తున అన్నదానం**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్:**

**మండలంలోని కన్యకల గొంది గ్రామంలో ఏడుగురు అక్కమ్మ దేవతల పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మి వ్రతంతో పాటు అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మవరానికి చెందిన పెనకచర్ల సత్యనారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె అల్లుళ్లు గురుప్రసాద్, సురేష్ ఆచారి, కుమార్తెలు భువనేశ్వరి, అశ్విని, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. పూజా కార్యక్రమానికి వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అక్కమ్మ దేవతల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.**

## వివాహ ఆహ్వానంతో ఆత్మీయ కలయిక



**ధర్మవరం ఆగష్టు 21 అనంత జనశక్తి న్యూస్ :**

**తెలుగుదేశం పార్టీ యువ నాయకులు సంధా రాఘవ ను మర్యాదపూర్వకంగా కలిసి వివాహ మహోత్సవ ఆహ్వాన శుభపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. వివాహ ఆహ్వానం సందర్భంగా రాఘవ్‌తో ఆత్మీయంగా మాట్లాడి, శుభాకాంక్షలు తెలియజేశారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, మిత్రుల సమక్షంలో జరగనున్న ఈ వివాహ వేడుకకు ఆయన హాజరు కావాలని కోరారు.**

### సాక్షాలు లేకపోయినా..

# బీసీ నేతలే టార్గెట్టా !

**- తిరుపతి వాసు యాదవ్‌పై అక్రమ కేసు బనాయించడం దుర్మార్గం**
**- వైసీపీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్**

**అనంతపురం, ఆగస్టు 21 : అనంత జనశక్తి న్యూస్**




ఈ కూటమి ప్రభుత్వానికి బీసీ నాయకులను టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకుందని, ఎలాంటి ఆధారాలు లేకపోయినా కేవలం కుట్రపూరితంగా తిరుపతి బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్‌పై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీలు, బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోయాయన్నారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో బీసీలను భయభ్రాంతులకు గురి చేయడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలో బీసీల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్‌పై కల్పిత కథలతో కేసులు పెట్టారని, ఒక్క ఆధారమైనా, వీడియో విజువల్స్ ఏమైనా ఉన్నాయా ? అని ప్రశ్నించారు. బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు యాదవ్ ఎలాంటి తప్పు చేయలేదని, కావాలని నిందలు మోపి అతనిపై అక్రమ కేసులు పెట్టించారన్నారు. పోలీసులు సైతం కూటమి నేతలకు ప్రైవేట్ సైన్యంలా మారారని విమర్శించారు. చట్టం అధికార పార్టీకి చుట్టం కాదని, పోలీసులు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలన్నారు. వాసు యాదవ్ తల్లి రేణుకా యాదవ్ చేసిన సవాల్‌ను ఎమ్మెల్యే జేబీ శ్రీనివాస్ స్వీకరించాలన్నారు. శ్రీవారి పాదాల సాక్షిగా ఆ తల్లి ప్రమాణం చేసిందని, 'నీకు నిజంగా ధైర్యం, నిజాయితీ ఉంటే.. వాసు యాదవ్ నీపై దాడి చేశాడని ఇదే శ్రీవారి పాదాల సాక్షిగా ప్రమాణం చేయడానికి సిద్ధమా.. అంటూ ఎమ్మెల్యే జేబీ శ్రీనివాస్‌కు సవాల్ విసిరారు. కూటమి నేతలు చేస్తున్న అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా బీసీ నాయకులపై కక్షపూరిత కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని రమేష్ గౌడ్ పేర్కొన్నారు.

### బండ్ల గణేష్ నివాసానికి

# ఎమ్మెల్యే పరిటాల సునీత



**కుమార్తె, అల్లుడికి ధర్మవరం పట్టు వస్త్రాలు ఇచ్చి శుభాకాంక్షలు**
**- పరిటాల రవితో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్న బండ్ల గణేష్**

**హైదరాబాద్ ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**

సినీనటుడు, నిర్మాత బండ్ల గణేష్ నివాసానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత వెళ్లారు. గత ఆదివారం బండ్ల గణేష్ కుమార్తె జనని, అల్లుడు సూర్య తేజ వివాహం ఘనంగా జరిగింది. వివాహానికి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ హాజరయ్యారు. ఆరోజు హాజరు కాలేకపోయిన ఎమ్మెల్యే సునీత శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని బండ్ల గణేష్ నివాసానికి వెళ్లారు. గణేష్ దంపతులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. నూతన వధూవరులకు ఆమె ధర్మవరం పట్టువస్త్రాలు ఇచ్చి ఆశీర్వదించారు. అనంతరం కుటుంబసభ్యులతో ఆత్మీయంగా గడిపారు. శ్రీరాములయ్య సినిమా సమయం నుంచి బండ్లగణేష్ కు పరిటాల కుటుంబంతో అనుబంధం ఉంది. ఆ సినిమాలో నటించిన బండ్ల గణేష్ పరిటాల రవితో సన్నిహితంగా ఉండే వారు. ఆ రోజులను గణేష్ మరోసారి గుర్తు చేసుకున్నారు. పరిటాల రవితో అనుబంధాన్ని మరువలేనిదని గణేష్ అన్నారు..

### ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై

# సీబీఐ విచారణ జరపాలి




**- కేంద్ర ప్రభుత్వానికి డాక్టర్ పోతుల నాగరాజు విజ్ఞప్తి**

**అనంతపురం ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్‌లో 2014 నుంచి 2026 వరకు జరిగిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో సమగ్ర విచారణ జరిపించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సమితి నాయకులు, డాక్టర్ పోతుల నాగరాజు విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత భవిష్యత్తుతో రాజకీయ పార్టీలు చెలగాటం ఆడుతున్నాయని ఆయన ఆరోపించారు. రాజకీయ ఆధిపత్యం, అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు నిరుద్యోగులను బలిచేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు జరిగినా వాటిని వెలుగులోకి తీసుకువచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.2014 నుంచి ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలతో పాటు కేంద్రీయ విద్యాసంస్థల్లో ప్రవేశాలు, నీట్, డీఎస్సీ, గ్రూప్-1, గ్రూప్-2 తదితర నియామకాలు, ప్రవేశాల్లో క్రీడా కోటాకు సంబంధించిన అంశాలపై కూడా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్రీడా సంఘాల గుర్తింపును సమీక్షించి, అక్రమాలు జరిగినట్లు తేలిన సంఘాల గుర్తింపును రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా నియామక ప్రక్రియల్లో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి కోరింది.

# నూతన ఎమ్మెల్సీ రమాదేవికి జిల్లాలో ఘన స్వాగతం

**- బాట్ల సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు**
**- ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికాతో కలిసి నగరంలో భారీ ర్యాలీ**
**- బీసీల్లో అట్టడుగు వర్గానికి చెందిన నాకు అవకాశం ఇచ్చారు.. రమాదేవి**
**- వడ్డెర్ల సమస్యలపై చట్ట సభలో వాణి వినిపిస్తానన్న రమాదేవి**
**- పార్టీలో క్రమశిక్షణగా, బాధ్యతగా పని చేస్తే పదవులు వస్తాయి.. ఎమ్మెల్యే దగ్గుపాటి**
**- బీసీలంటే టీడీపీ.. టీడీపీ అంటే బీసీలన్న దగ్గుపాటి**
**- అనంతపురం, బీసీలపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం.. ఎంపీ అంబికా**

**అనంతపురం ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్**



నూతన ఎమ్మెల్సీ వడ్డె దళవాయి రమాదేవికి అనంతపురం జిల్లాలో ఘన స్వాగతం లభించింది. ఎవరూ ఊహించని విధంగా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకున్న రమాదేవి.. తొలిసారి జిల్లాకు వచ్చిన సందర్భంగా వడ్డెర్లు, బీసీలు, టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.ముందుగా ఆమె ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా, కుటుంబ సభ్యులతో కలిసి గుత్తి లోని బాట్ల సుంకులమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి వడ్డెర్లు, బీసీ నేతలతో కలసి అనంతపురం నగరానికి వచ్చారు. తపోవనం వద్ద వడ్డెర్లు, బీసీలు భారీ గజమాలతో స్వాగతం చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సప్తగిరి సర్కిల్, టవర్ క్లాక్ మీదుగా ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే, ఎంపీతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ రమాదేవి మాట్లాడుతూ బీసీల్లో అట్టడుగున ఉన్న వడ్డెర కులానికి చెందిన నాకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సామాన్య క్లస్టర్ ఇన్ ఛార్జిగా ఉన్న నాకు ఈ అవకాశం రావడంలో ఎమ్మెల్యే దగ్గుపాటి కృషి ఎంతో ఉందని.. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నా వడ్డెర కులస్థులు నా వెన్నంటే ఉండి ప్రోత్సహించారని.. కచ్చితంగా వారి కోసం పని చేస్తానని ఆమె చెప్పారు. వారికి ఏ కష్టం ఆడబిడ్డగా ముందుంటానని.. చట్టసభలో మా వాణి వినిపిస్తానని చెప్పారు. మరోవైపు ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం ఆడబిడ్డకు ఎమ్మెల్సీగా అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. బీసీలంటే టీడీపీ.. టీడీపీ అంటే బీసీలన్నది మరోసారి నిరూపించారన్నారు.రమాదేవి గతంలో యూనిట్ ఇన్ ఛార్జిగా, అంగన్వాడీ సంఘం పార్లమెంట్ అధ్యక్షురాలిగా పని చేశారన్నారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి క్లస్టర్ ఇన్ ఛార్జిగా ఎంతో కష్టపడి పని చేస్తున్నారన్నారు. ఏపని ఇచ్చినా వందశాతం పూర్తి చేస్తున్నారన్నారు. డోర్ టూ డోర్ కార్యక్రమం కూడా 95శాతం పూర్తి చేశారన్నారు. పార్టీలో క్రమశిక్షణ, బాధ్యతగా ఉంటే ఎవరికైనా పదవులు వస్తాయని చెప్పడానికి రమాదేవి నిదర్శనం అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లతో పాటు 38వేల కోట్ల బడ్జెట్ లో కేటాయించారన్నారు. ఇటు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీలు ఉంటే అందులో బీసీలకు ఒకరికి అవకాశం ఇచ్చారన్నారు. మొదటి నుంచి అనంతపురంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. అందులో భాగంగా ఈసారి బీసీ మహిళకు ఎమ్మెల్సీ అన్నది చిన్న విషయం కాదన్నారు. ఒక సామాన్య క్లస్టర్ ఇన్ ఛార్జి వడ్డెర కులానికి చెందిన మహిళకు పిలిచి అవకాశం ఇచ్చారన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ వడ్డెర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారన్నారు. ఇప్పటికే పట్టణాల్లో 33.33శాతం, గ్రామాల్లో 34శాతం స్థానిక సంస్థల్లో బీసీలకు అవకాశం కల్పించారన్నారు. మేమంతా ఐకమత్యంగా చట్టసభల్లో పని చేసి.. ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని ఎంపీ అంబికా తెలిపారు.

# వేమారెడ్డిపల్లిలో ఆధ్యాత్మిక వైభవం..

**- సీతారాముల ఆలయంలో ఘనంగా తొలిరోజు పూజలు**

**ఓబులదేవర చెరువు, ఆగస్టు 21: అనంత జనశక్తి న్యూస్**

ఓబులదేవర చెరువు మండల పరిధిలోని వేమారెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తుల ఐకమత్యంతో నిర్మించిన నూతన సీతారాముల దేవాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా తొలిరోజు నిర్వహించిన ప్రత్యేక పూజలకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.తొలిరోజు గోపూజ, గంగాపూజ, గణపతి పూజ, కంకణధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనతో పాటు విష్ణు సహస్రనామార్చన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రాహ్మణులు మురళి స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంత్రోచ్చారణలు,



భక్తుల ఆధ్యాత్మిక నామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తిభావంతో నిండిపోయింది. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్తులకు గ్రామస్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు సంతోషంగా పాల్గొని సీతారాముల స్వామివారి ఆశీస్సులు పొందారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎస్సై మల్లికార్జున రెడ్డి గ్రామాన్ని సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గ్రామస్తులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పోలీసుల పర్యవేక్షణతో కార్యక్రమాలు ప్రశాంతంగా కొనసాగాయి.

గ్రామస్తుల ఐకమత్యానికి ప్రతీకగా నూతన సీతారాముల ఆలయం నిర్మాణం జరగడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తొలిరోజు పూజా కార్యక్రమాలతో వేమారెడ్డిపల్లి గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.నేడు ధ్వజస్తంభ స్థాపన. గోపురం పై కలశ స్థాపన. మహా స్నాపనం. దేవతామూర్తుల ఊరేగింపు ఉంటుందని అర్చకులు మురళి స్వామి బృందం తెలిపారు

రెండో రోజు కూడా అన్నదాన కార్యక్రమం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు

# ఉయ్యూరులో డయేరియాపై అసత్య ప్రచారం జరుగుతోంది ..

**- మంత్రి నారాయణ**
**- ఉయ్యూరు, పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది విరేచనాలతో ఆసుపత్రిలో చేరారు**
**- ప్రస్తుతం ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని, అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి ప్రకటన**
**- డయేరియాకు మున్సిపల్ పైప్‌లైన్ కాలుష్యమా.. ఆర్వో ప్లాంట్ల నీటి సమస్యా అనేది తేలాల్సి ఉందని వెల్లడి**
**- ప్రాథమిక పరీక్షల్లో తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి నారాయణ స్పష్టం**



**- ఉయ్యూరులో రూ.98 కోట్లతో అమృత్ 2.0 కింద కొత్త నీటి సరఫరా పనులు చేపడుతున్నామని వెల్లడి**

**విజయవాడ ఆగస్టు 21, అనంత జనశక్తి ప్రతినిధి**

ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్న బాధితులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పరామర్శించారు. అనంతరం ఉయ్యూరు 5వ వార్డులో డయేరియా నమోదైన ప్రాంతాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్, జాయింట్ కలెక్టర్ నవీన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఉయ్యూరులో డయేరియాపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. ఉయ్యూరుతో పాటు పరిసర గ్రామాల్లో మొత్తం 11 మంది విరేచనాలతో ఆసుపత్రిలో చేరారని, వారిలో ఆరుగురు మాత్రమే ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధికి చెందినవారని చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని, బాధితులందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మంత్రి తెలిపారు. ఈ నెల 17న ఒక వ్యక్తి కార్డియాక్ సమస్యతో ఆసుపత్రిలో చేరి మరణించారని, ఆయన మృతికి డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేసే నీటి పైప్‌లైన్‌కు, పరిసర గ్రామాల్లోని నీటి సరఫరా లైన్లకు సంబంధం లేదని మంత్రి వివరించారు. డయేరియాకు కారణం మున్సిపల్ పైప్‌లైన్‌లో నీటి కాలుష్యమా.. లేక ఆర్వో ప్లాంట్ల నీటిలో ఏదైనా సమస్యా అనే అంశాన్ని పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రాథమిక పరీక్షల్లో తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని తేలిందని మంత్రి వెల్లడించారు. మరింత లోతైన విశ్లేషణ ద్వారా అసలు కారణాన్ని నిర్ధారించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఉయ్యూరు పట్టణంలో రూ.98 కోట్లతో అమృత్ 2.0 కింద నీటి సరఫరా పనులు చేపడుతున్నామని చెప్పారు. పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన, సురక్షితమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మవద్దని, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్లి వైద్యం పొందాలని మంత్రి నారాయణ సూచించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు.

# గుమ్మ పంచాయతీలో రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీ

**- మొక్కల పెంపకంతో గిరిజనులకు ఆర్థిక భరోసా**

**అనంతగిరి, ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**




అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుమ్మ గ్రామ పంచాయతీ పరిధిలోని కరివేసు, చెరుకుబిడ్డ, చీడివలస గ్రామాల్లో రైతులకు సిల్వర్ మొక్కల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విబి-జీ-రామ్‌జీ పథకంలో భాగంగా రైతులకు మొక్కలను అందజేశారు.కార్యక్రమంలో సాంకేతిక సహాయకుడు రామ్‌చందర్, వీఆర్పీ కృష్ణవేణి రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలను నాటిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి సంరక్షణ విధానాలను రైతులకు వివరించారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్తులో రైతులకు ఆర్థిక ప్రయోజనాలు కలిగే అవకాశం ఉందని తెలిపారు.

**రైతులకు మొక్కల పంపిణీ చేసిన టీడీపీ నేత**

గుమ్మ పంచాయతీ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాడి నాగేశ్వరరావు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కల్పించే ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు మొక్కలను నాటి, వాటిని జాగ్రత్తగా సంరక్షించాలని కోరారు.కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు శెట్టి కృష్ణమూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జాగరపు శ్రీను, పాడి కృష్ణమూర్తి, గుమ్మ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ బిడ్డ చిన్నదేముడు, బిడ్డ దేముడు (ఠాగూర్), స్థానిక రైతులు సింబోయిన శ్రీకాంత్, సింబోయిన బోడన్న, బిడ్డ సన్యాసిరావు, పాడి వెంకటరమణ, పాడి రామన్నతో పాటు పథకం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరీపై శ్రీ సత్యసాయి జిల్లా యంత్రాంగం ఉక్కుపాదం

- 40 మంది గిరిజన కార్మికులకు విముక్తి.. తక్షణ ఆర్థిక సాయం, వైద్యం, స్వగ్రామాలకు రవాణా
- బాధ్యులపై కేసులు.. అక్రమ అప్పులు రద్దు



**పుట్టపర్తి, ఆగస్టు 21:అనంత జనశక్తి న్యూస్**

అప్పుల పేరుతో మహారాష్ట్రకు చెందిన గిరిజన పేద కార్మికులను శ్రీ సత్యసాయి జిల్లాకు అక్రమంగా తరలించి బొగ్గు భట్టీల్లో వెట్టిచాకిరీ చేయిస్తున్న ఘటనపై జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏకకాలంలో దాడులు నిర్వహించి 4 నెలల పసికందు నుంచి 63 ఏళ్ల వృద్ధుల వరకు మొత్తం 40 మంది బాధితులను సురక్షితంగా రక్షించాయి.మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా నిజాంపూర్ తాలూకా ఆదివాసీవాడి గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలను అప్పుల పేరుతో మోసగించి జిల్లాకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. మహారాష్ట్రకు చెందిన శ్రీకాంత్ జాన్యు కోలి ఇచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ తక్షణమే స్పందించి అధికారులను అప్రమత్తం చేశారు.పుట్టపర్తి ఆర్‌డీఓ పి. సువర్ణ నేతృత్వంలో కొత్తచెరువు మండలం తలమర్లలోని బొగ్గు తయారీ స్థావరంపై అధికారులు దాడి చేసి దార్శన్ జాధవ్, మంజుల, నాలుగు నెలల పసికందు కార్తికి, ఎనిమిదేళ్ల నికితను రక్షించారు. మరోవైపు పెనుకొండ ఆర్‌డీఓ టి. ఆనంద కుమార్ ఆధ్వర్యంలో గోరంట్ల మండలం చింతలపల్లి, ముతరాయని తండా, పులేరు రోడ్డు ప్రాంతాల్లో నిర్వహించిన దాడుల్లో 36 మందిని రక్షించారు. బాధితులను తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేని తాత్కాలిక గుడారాల్లో ఉంచి, బొగ్గు భట్టీల వద్ద తీవ్రమైన వేడి, పొగ మధ్య రాత్రింబవళ్లు పని చేయించినట్లు అధికారులు తెలిపారు. కూలీ చెల్లించకుండా అప్పుల పేరుతో వారిని వెట్టిచాకిరీకి గురిచేసినట్లు గుర్తించారు.ఈ ఘటనకు సంబంధించి ప్రధాన కాంట్రాక్టర్ రమేష్ తారు రాథోడ్, ఏజెంట్ ప్రకాష్ దేవిచంద్ రాథోడ్‌లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొత్తచెరువు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి భారతీయ న్యాయ సంహిత, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం, వెట్టిచాకిరీ నిరోధక చట్టం కింద చర్యలు చేపట్టారు. గోరంట్ల పోలీస్‌స్టేషన్‌లోనూ సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.వెట్టిచాకిరీ నిరోధక చట్టం-1976 ప్రకారం బాధితులకు అధికారిక విముక్తి ధ్రువపత్రాలు అందజేశారు. వారిపై మోపిన అక్రమ రుణాలను రద్దు చేశారు. బాధితులకు భోజనం, వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన ఆర్థిక సహాయం, ప్రయాణ ఖర్చులు అందించారు. ప్రత్యేక వాహనాల్లో వారిని మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లా నిజాంపూర్ తాలూకాలోని స్వగ్రామాలకు సురక్షితంగా తరలించారు.

**కలెక్టర్ హెచ్చరిక**

మానవ హక్కులను ఉల్లంఘిస్తూ గిరిజన కార్మికులను అక్రమంగా తరలించి వెట్టిచాకిరీకి గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ హెచ్చరించారు. శ్రమదోపిడీ, అక్రమ రవాణాపై జిల్లావ్యాప్తంగా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అనంతగిరిలో లోకుల గాంధీకి ఘన నివాళి



**అనంతగిరి,ఆగస్టు 21:అనంత జనశక్తి న్యూస్**

భారతీయ జనతా పార్టీ అభివృద్ధి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన స్వర్గీయ లోకుల గాంధీని ఆయన ఐదవ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఘనంగా స్మరించుకున్నారు. అనంతగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు, అల్లూరి జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. లోకుల గాంధీ పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సంక్షేమానికి ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ ప్రజా క్షేత్రంలోనే తుదిశ్వాస విడవడం ఆయనకు ప్రజల పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని అన్నారు.లోకుల గాంధీ ఆశయాలను, సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజల కోసం పనిచేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని పలువురు నాయకులు, కార్యకర్తలు గుర్తుచేసుకున్నారు.కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వర్గీయ లోకుల గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# ఏజెన్సీ హక్కులు కల్పించాలి.. గిరిజనులుగా గుర్తించాలి



- కొండ శిఖర గ్రామాల గిరిజనుల పాదయాత్ర

**అనంతగిరి, ఆగస్టు 21:అనంత జనశక్తి న్యూస్**

అనంతగిరి మండలంలోని కొండ శిఖర గ్రామాల గిరిజనులను ఏజెన్సీ ప్రాంత గిరిజనులుగా గుర్తించి షెడ్యూల్ ఏరియా పరిధిలో చేర్చాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు శుక్రవారం భారీ పాదయాత్ర నిర్వహించారు. రొంపిల్లి పంచాయతీ చిన్నకోనెల నుంచి ప్రారంభమైన పాదయాత్ర బూరిగ, సిమ్మిడివలస, రాయపాడు, బొంగిజ గ్రామాల మీదుగా సుమారు ఐదు కిలోమీటర్లు సాగింది.తమ సాగు భూములకు రక్షణ కల్పించాలని, కార్పొరేట్ సంస్థలు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి భూములను కాపాడాలని గిరిజనులు కోరారు.తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు తమకు తెలియకుండానే ఇతరుల పేర్లపై రెవెన్యూ రికార్డుల్లో నమోదయ్యాయని ఆరోపించారు. భూ రికార్డులపై సమగ్ర విచారణ జరిపి అసలు హక్కుదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కొండ శిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. బొడ్డవలసి నుంచి రాయపాడు, సిమ్మిడివలస, బొంగిజ, బూరిగ, చిన్నకోనెల వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు పూర్తికాలేదన్నారు.

2025లో సుమారు రూ.6 కోట్లతో బీటీ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. అత్యవసర సమయంలో అంబులెన్సులు కూడా గ్రామాలకు చేరుకోలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లేట్ డెత్ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసి మూడు నెలలు గడిచినా ఇప్పటికీ అందలేదని గ్రామస్తులు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్లను వెంటనే జారీ చేయాలని కోరారు.రొంపిల్లి, ఎన్.ఆర్.పురం, భీంపోలు, గరుగుబెల్లి, గుమ్మకోట పంచాయతీల పరిధిలోని కొండ శిఖర గ్రామాలను షెడ్యూల్ ఏరియా పరిధిలోకి తీసుకువచ్చి ఏజెన్సీ హక్కులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పాదయాత్రలో సోమెల అప్పలరాజు, కోనపర్తి సింహాచలం, కోటపర్తి మహేష్, రేగం లచ్చమ్మ, పొట్టంగి గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి.

- తాసిల్దార్ దేవరాజ్.

**ధర్మవరం ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్:**




ఆగస్టు 22, 23, 29 అనంతరం 30వ తేదీలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిధిలో నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ సహాయ ఓటరు నమోదు అధికారి, తాసిల్దార్ దేవరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ఏపీలో ఎస్ ఐ ఆర్ 2026 లో భాగంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ స్పెషల్ క్యాంపు ప్రతి నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 వరకు బిఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్లు తమకు సంబంధించిన పోలీస్ స్టేషన్లో సందర్శించి డ్రాఫ్ట్ ఎలక్ట్రాన్ రోల్లో తమ పేరు చిరునామా ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని నీకు తెలిపారు. అలాగే ఏ ఎస్ డి లిస్టులో తమ పేరు లేదా వివరాలు ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవాలని తెలిపారు. ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకోవడం పేరు తొలగింపు లేదా వివరాలలో మార్పులు సవరణలు, సంబంధించి అర్హత కలిగిన వారు ఫారం 6ఫారం 7 అండ్ ఫారం 8 ద్వారా సమర్పించవచ్చునని తెలిపారు. అనంతరం ఓటర్లకు బిఎల్వోలు ఫారం పూర్తి చేయడంలో సహకరించాలని తెలిపారు. ప్రత్యేకంగా 18, 19 సంవత్సరాల వయసు గల అర్హులైన యువతి యువకులు ఓటరుగా నమోదు కానట్లయితే ఈ ప్రత్యేక నమోదు కార్యక్రమంలో హాజరై సద్వినియోగం చేసుకొని ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. కావున నియోజకవర్గంలోని ప్రజలు ఈ స్పెషల్ క్యాంపెయిన్ను సద్వినియోగం చేసుకొని ఓటర్ల జాబితాలో తమ పేరు వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# శిథిలమైన రోడ్ల పరిశీలన

- త్వరలోనే నూతన బీటీ రోడ్ల నిర్మాణం
- నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జ్ మహేష్ చౌదరి.

**ధర్మవరం రూరల్ ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్:**



మండల పరిధిలోని దర్శనమల నుంచి వెంకట తిమ్మాపురం, అలాగే రావులచెరువు నుంచి కృష్ణాపురం రోడ్డు వరకు పూర్తిగా శిథిలావస్థకు చేరిన తారు రోడ్ల స్థానంలో నూతనం రోడ్లను నిర్మించేందుకు కసరత్తు ప్రారంభమైంది. ఇటీవల సాస్కీ నుంచి నూతన తారు రోడ్లు నిర్మాణానికి నిధుల విడుదల చేశారు.తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు పంచాయతీ రాజ్ అధికారులు, పార్టీ నాయకులు శుక్రవారం ఈ రహదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు తిరుమల రెడ్డి, సూర్య శేఖర్‌లతో కలిసి టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మహేష్ చౌదరి రోడ్ల దుస్థితిని స్వయంగా తనిఖీ చేశారు. త్వరలోనే నూతన బీటీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నేతలకు సూచించారు . ఈ కార్యక్రమంలో ఆయా గ్రామపంచాయతీలకు చెందిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు విజయ్ సారధి,ఏలు కుంట్ల రమణ,జంగం నరసింహులు,చెన్నారెడ్డి, చెన్నకేశవులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# దీపలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి దేవి మాత

**యాడికి, ఆగష్టు 21, అనంత జనశక్తి న్యూస్ :**



మండల కేంద్రంలో ఉన్న శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ దేవాలయంలో శ్రావణ రెండవ శుక్రవారం సందర్భంగా దీపలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి దేవి మాత భక్తులకు దర్శనమిచ్చారు.ఉదయం కన్యకాపరమేశ్వరి దేవి మాత కు పంచామృత అభిషేకాలు చేసి, వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. సాయంత్రం ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసిన 1001 దీపాలతో దీపలక్ష్మి గా వాసవి కన్యకా పరమేశ్వరి మాత ను అలంకరించారు. ప్రతి ఒక ఆర్యవైశ్య మహిళ వారి ఇంటి నుండి రెండు దీపాలతో గుడికి చేరుకుని ప్రత్యేక హారతులు సమర్పించారు. కోలాటాలాడుతూ నృత్యాలు చేస్తూ, అమ్మవారికి ఆహ్వానం పలికారు . పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. జై వాసవి మాత జై జై వాసవి మాత అంటూ ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గాధంశెట్టి బాలా, లయన్ పవన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు,మహిళ సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# నీకు సీబీఐపై నమ్మకం ఉందా..?

- జగన్ పై మంత్రి సవిత నిలదీత
- ఆనాడు వివేకా హత్య కేసుపై సీబీఐ దర్యాప్తు ఎందుకు వద్దన్నావ్..?
చెల్లెలు సునీత డిమాండ్ ను కూడా పట్టించుకోలేదు కదా...
- నీతీరు దొంగే దొంగ అన్నట్లుంది...
- గ్రూప్ 1 మూల్యాంకనం అక్రమాలు బయటపడడంతో డైవర్షన్ రాజకీయాలు
- అసెంబ్లీలో చర్చకు ఎందుకు రాలేదు...?
- మెగా డీఎస్సీ అభ్యర్థుల కష్టాన్ని తక్కువ చూసి చూడొద్దు
- జగన్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ బెదిరిపోరు
- రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ : మంత్రి సవిత




**పెనుకొండ ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**

గ్రూప్ 1 లో జరిగిన అక్రమాలపై బయటకు పొక్కడంతో మెగా డీఎస్సీ నిర్వహణపై జగన్ దొంగే దొంగ అన్నట్లు ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడుతున్న జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా నమ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. డీఎస్సీలోపై తప్పుడు ఆరోపణలు చేయడం కాదని, అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సవాల్ చేసినా ఆయన ముఖం చాటేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. యువతకు ఉద్యోగాలే కల్పనే లక్ష్యంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఇచ్చిన మాటకు కట్టుబడి జాబ్ క్యాలెండర్ అమలు చేస్తూ, కూటమి ప్రభుత్వం ఏటా ఉద్యోగాలు భర్తీ చేస్తుందని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీలో టీచర్ పోస్టు సాధించిన పెనుకొండకు చెందిన టీచర్లు జ్యోతి, గంగాధర్ ఇళ్లకు శుక్రవారం వెళ్లి వాళ్లతో మాట్లాడారు. అనంతరం మహిళా టీచర్ జ్యోతితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మెగా డీఎస్సీలో ఎటువంటి అక్రమాలు జరగలేదనడానికి తన పక్కనున్న మహిళా టీచరే ఉదాహరణ అని అన్నారు. డీఎస్సీలో రెండు పోస్టులకు ఆమె క్వాలీఫై అయ్యిందన్నారు. ఆమె తమ్ముడు కూడా డీఎస్సీ అర్హత పరీక్ష రాసినా, ఉత్తీర్ణత సాధించలేకపోయారన్నారు. మెగా డీఎస్సీ పారదర్శకతను ఈ అక్కా తమ్ముడే నిదర్శనమన్నారు. జగన్ తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం బెదిరిపోదని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రభుత్వ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు. డీఎస్సీ అంటే సీబీఎన్ అని, సీబీఎన్ అంటే డీఎస్సీ అని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు గారి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీని అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించామని తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి అపోహలకు, భయాలకు గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. టీచర్ల కష్టానికి దక్కిన ఈ విజయం వారికి గర్వకారణమని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

**మా మనస్సులను బాధపెట్టొద్దు : మహిళా టీచర్ జ్యోతి**

'పెనుకొండలో టీచర్ గా పనిచేస్తున్నానని, నా పిల్లల సాక్షిగా చెబుతున్నా... తాను కష్టపడి మెగా ఎస్సీలో ఉద్యోగం సాధించానని' మహిళా టీచర్ తెలిపారు. మెగా డీఎస్సీలో అక్రమాలు జరిగి ఉంటే తనతో పాటు తన తమ్ముడికీ ఉద్యోగం సంపాదించేవాళ్ల కదా..? అని పశ్నించారు. మెగా డీఎస్సీ కోసం ఎంతో కష్టపడి చదవానని, తాను రెండు పోస్టులకు అర్హత సాధించానని తెలిపారు. తమ కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడడం సరికాదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా తమ మనస్సులు బాధపెట్టడం సరికాదని జగన్ నుద్దేశించి మహిళా టీచర్ జ్యోతి కోరారు. అనంతరం గంగాధర్ మాట్లాడుతూ.. తాను వ్యవసాయ కుటుంబానికి చెందినవాడినని, అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూ డీఎస్సీకి సిద్ధమయ్యానని తెలిపారు. కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే ఎంతో కష్టపడి ఉద్యోగాన్ని సాధించానన్నారు. బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా అందించిన డీఎస్సీ కోచింగ్ తనకు ఎంతో ఉపయోగపడిందని గంగాధర్ తెలిపారు.

**గ్రూప్ 1 లో అక్రమాలతో జగన్ డ్రామాలు**

తన హయాంలో జరిగిన గ్రూప్ 1 పరీక్షలో మూల్యాంకనంలో జరిగిన తప్పిదాల నుంచి బయటపడడానికి జగన్ మెగా డీఎస్సీపై తప్పడు ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. దొంగే దొంగ అన్నట్లు మెగా డీఎస్సీపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. భర్త, పిల్లలకు, కుటుంబానికి దూరంగా ఉంటూ, అనంతపురంలో మెగా డీఎస్సీపై శిక్షణ పొందారన్నారు. వారి కష్టాన్ని తక్కువ చేస్తూ.. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల మనోభావాలు, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా జగన్ మాట్లాడడం సరికాదన్నారు. జగన్ కు చట్టాలపైనా, సీబీఐపైనా మ్మకం ఉందా..? అని ప్రశ్నించారు. వైఎస్ వివేకా హత్య కేసులో తొలుత సీబీఐ దర్యాప్తు కోరిన జగన్, అధికారంలోకి రాగానే ఎందుకు మాటమార్చారని ప్రశ్నించారు. బాబాయ్ కూతురు, చెల్లెలు వైఎస్ సునీత ఎన్ని పర్యాయాలు కోరినా, వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అవసరంలేదని చెప్పలేదా..? అని నిలదీశారు. బయటకూర్చొని మాట్లాడడం సరికాదని, అసెంబ్లీ వేదికగా చర్చ జరిపి ఉంటే వాస్తవాలు ప్రజలకు తెలిసేవని మంత్రి అన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల

- కమిటీలో చిలకం మధుసూదన్ రెడ్డి....

**ధర్మవరం ఆగష్టు 21 అనంత జనశక్తి న్యూస్ :**



స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డిని నియమించినందుకు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్కు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా చిలకం మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై పవన్ కళ్యాణ్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, కమిటీ లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పార్టీ అధినాయకత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని మరింత బాధ్యతతో ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు.

## సిమ్స్ మరియు ఎం వై పి ఎస్ ఎన్ ఆధ్వర్యంలో స్నేహపూర్వక టీచర్స్ షటిల్ టోర్నమెంట్



**కదిరి ఆగస్టు 21,అనంతశక్తి న్యూస్**

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఎం వై పి ఎస్ ఎన్ వ్యవస్థాపక చైర్మన్ మరియు సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసిన్ ఖాన్ సౌజన్యంతో జిల్లా స్థాయి స్నేహపూర్వక టీచర్స్ షటిల్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించడం జరిగింది.

స్థానిక కదిరి, రాయచోటి రోడ్డులో గల వేమల షటిల్ కోర్టు నందు యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ తాహెర్ వలి ముఖ్య అతిథిగా ఈ షటిల్ టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ షటిల్ టోర్నమెంట్లో జిల్లా వ్యాప్తంగా 32 జట్లు పోటీ పడగా, హోరాహోరీగా జరిగిన పోటీలలో (అనీల్ , తాజ్ )తలపుల మరియు (ఇర్షాద్,సుధాకర్) నల్లమాడ ఫైనల్స్ లో తలపడ్డాయి. నల్లమాడ జట్టు పై తలపుల జట్టు విజయం సాధించారు.వీరికి ఉపాధ్యాయ దినోత్సవం సెప్టెంబర్ 05 తేదీన ట్రోఫీలను ఎం వై పి ఎస్ ఎన్ వ్యవస్థాపకుడు మరియు సిమ్స్ హాస్పిటల్ ఎండి నిసార్ యాసిన్ అందచేస్తారు.

ఈ కార్యక్రమంలో నిర్వాహకులు హరిప్రసాద్, బాబాజాన్,ఆజం బాషా,సందీప్, రెడ్డప్ప, హరూన్, బాబా ఫక్రుద్దీన్, పాపారాయుడు, రాజ్, రఫీ, గండికోట శ్రీనివాసులు,ముబారక్ తో పాటు విశ్రాంత ప్రధానోపాధ్యులు ఖాదర్ వలి మరియు టీచర్లు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 21 అనంత జన శక్తి న్యూస్.**



వరలక్ష్మీ వ్రతం పర్వదినాన్ని పురస్కరించుకొని. మండలంలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎనుములపల్లిలోని పురాతన శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలను,గ్రామస్తులు నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ పలం, పుష్పం, కాయ, కర్పూరం వస్త్రం వాయినం సమర్పించి అమ్మవారి కరుణ, కటాక్షం అష్ట ఐశ్వర్యాలు, ఆశీర్వాదాలు ఆకాంక్షిస్తూ మొక్కుబడులు తీర్చుకొని భక్తులు వేడుకున్నారు. మహిళ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. రుత్వికులు రాజా స్వామి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అంతేకాక మండల పరిధిలోని బత్తులపల్లి గంటల మారెమ్మ, పెడపల్లి మారెమ్మ, పెద్దమ్మ, నిడిమామిడి, నిడిమామిడమ్మ, చౌడమ్మ దేవాలయాల్లో, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ప్రసాదాలు వితరణ చేశారు.

## ఘనంగా వరలక్ష్మివ్రతం



**యాడికి, ఆగష్టు 21, అనంత జనశక్తి న్యూస్:**

మండల కేంద్రంలోను , గ్రామాలలోను శుక్రవారం ఘనంగా వరలక్ష్మి వ్రతం ను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వరలక్ష్మి చిత్ర పటానికి, వరలక్ష్మి మూర్తికి వివిధ పూలమాలలతో అలంకరణ చేశారు. అర్చనలు చేసి,శ్రీ లక్ష్మి దేవి అష్టోత్తర శతనామావళి పఠించారు. మహామంగళ హారతులు సమర్పించారు. తీర్థప్రసాదాలను అందచేశారు. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు ఆచరించే వరలక్ష్మీ వ్రతం సకలాభీష్టాలను, అష్ట ఐశ్వర్యాలను ప్రసాదిస్తుందని, ఈ పూజ చేయడం వల్ల ఇంట సుఖశాంతులు, మఆయురారోగ్యాలు, నిత్య సౌభాగ్యం కలుగుతాయని పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం వేడుకలు!

**ఆమడగూరు , ఆగస్టు 21 అనంత జనశక్తి న్యూస్**

అమడగూరు,మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో శుక్రవారం మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రత వేడుకల్లో ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉపవాసంతో వేకువ జామనే వరలక్ష్మి దేవి విగ్రహాన్ని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వరలక్ష్మి అమ్మవారిని కొలిస్తే అన్ని శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. వరలక్ష్మి పండ సందర్భంగా అమ్మవారికి పళ్ళు పలహారాలతో పాటు , బంగారం, వెండి, లక్ష్మి నీ అమ్మవారి, ముందర, ఉంచడంతో అకుటుంబం ధన,ఆరోగ్యం సిరి సంపదలతో ఉంటుందని భక్తుల నమ్మకం.ఈ ఉదయం నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి దేవి చిత్రపటానికి పసుపు కుంకుమ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూలు పండ్లు డబ్బులు అమ్మవారు ముందు పూజలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరలక్ష్మి దేవి కరుణ కటాక్షాలు ఎల్లప్పుడూ తమపై ఉండాలని కోరుకున్న కోరుకున్నారు. అందరం భక్తులతో తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆడపడుచులకు పసుపు కుంకుమ తో పాటు, సారీ తో పాటు, పండ్లు పలహారాలు పంపిణీ చేశారు.



# కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి మహర్దశ



- త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వైద్య రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**కోటబొమ్మాళి, ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**

కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని త్వరలో వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాబార్డు నిధులు రూ.2.90 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ప్రసూతి, శిశు ఆరోగ్య విభాగం భవనాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ మౌలిక వసతులను బలోపేతం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిని వంద పడకల స్థాయికి పెంచి మరింత మెరుగైన వైద్య సేవలు అందించేలా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలి**

ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రసూతి, శిశు ఆరోగ్య సేవలను మరింత విస్తృతం చేసి ప్రజలకు చేరువ చేయాలని అన్నారు.

**మానవతా దృక్పథంతో సేవలందించాలి**

వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బంది మానవతా దృక్పథంతో వ్యవహరించి రోగులకు ఆప్యాయతతో సేవలందించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సంతృప్తికరమైన వైద్య సేవలు అందించి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని కోరారు.ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రోగులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేలా ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. విజయలక్ష్మి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరిప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీలక్ష్మి, మెడికల్ ఆఫీసర్లు పి. గణేష్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది బటన్లు నొక్కి మభ్య పెట్టే ప్రభుత్వం కాదు

- ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వమిది
- ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి
- రెండేళ్లలో 1296 కోట్లతో అభివృద్ధి, సంక్షేమాన్ని అందించామన్న దగ్గుపాటి

**నంతపురం ఆగస్ట్ 21,అనంత జనశక్తి న్యూస్**




వైసీపీ ప్రభుత్వంలా బటన్లు నొక్కి ప్రజల్ని మభ్యపెట్టకుండా రెండేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వం ఇది అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు అన్నారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన 55వ ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరిస్తూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు 55 సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామని... ఇందులో 1243 అర్జీలు రాగా.. 1204అర్జీలను ఇప్పటికే పరిష్కరించామన్నారు. 39 మాత్రం రెవెన్యూతో పాటు ఇతర సమస్యల కారణంగా అవి పెండింగ్ లో ఉన్నాయని వివరించారు. గత ప్రభుత్వంలో 10 లక్షల కోట్ల అప్పులు పెట్టి పోతే వాటన్నింటినీ భరిస్తూ సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దక్కుతుందన్నారు. అలాగే ఈ రెండేళ్లలో 25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకురావడమే కాకుండా.. 25 లక్షల ఉద్యోగుల కల్పన దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భర్తీ చేస్తే.. వైసిపి దీనిపై రాద్ధాంతం చేస్తున్నారన్నారు. అక్రమాలు ఎక్కడ జరిగాయో నిరూపించాలని మంత్రి నారా లోకేష్ గారు సవాల్ విసిరితే వైసిపి నాయకులు ముందుకు రాకుండా పారిపోతున్నారని అన్నారు. రాయలసీమలో హార్టికల్చర్ హబ్ కోసం 40 వేల కోట్లు కేటాయించారని.. పిపిపి మోడల్ లో మరో 60 వేల కోట్లు తీసుకొస్తున్నారన్నారు. అనంతపురం జిల్లాకి లక్ష కోట్ల రూపాయల మేర పెట్టుబడులు వచ్చాయన్నారు. 5వ జనరేషన్ కి సంబంధించిన యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమ పుట్టపర్తికి వచ్చిందంటే.. అది మన జిల్లాకే గర్వకారణం అని అన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఈ రెండేళ్లలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసామన్నారు. 300 కోట్లతో కేవలం రోడ్లు డ్రైనేజీలు ఇతర మౌలిక వసతుల కల్పించామన్నారు. సుమారుగా 20 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రోడ్లను సైతం పూర్తి చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు వివరించారు.

# ఆర్డీటీ మైదానంలో హోరాహోరీ పోరులు

- వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3లో రెండో రోజు ఉత్కంఠ......
- విజేతలుగా మోటుమర్ల, శివంపల్లి, జికేపి వారియర్స్....

**ధర్మవరం ఆగష్టు 21 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం ఆర్డీటీ మైదానంలో జరుగుతున్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్ ఆరు జట్లు తలపడగా మోటుమర్ల, శివంపల్లి, జికేపి వారియర్స్ జట్లు విజయాలు సాధించాయి. మొదటి మ్యాచ్‌లో తూమచర్ల XI లయన్స్ 89/8 పరుగులు చేయగా.. మోటుమర్ల 90/3 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్న రాజుకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

రెండో మ్యాచ్‌లో దంపెట్ల యూత్ 55/9 పరుగులు చేయగా.. శివంపల్లి 58/2 పరుగులు చేసి 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. కిరణ్ విరాట్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. మూడో మ్యాచ్‌లో అర్జున్ వారియర్స్ 77/9 పరుగులు చేయగా.. జికేపి వారియర్స్ 79/1 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ప్రతాప్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. మ్యాచ్‌లను మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబుతో పాటు బీజేపీ నాయకులు, సీనియర్ క్రికెట్ క్రీడాకారులు ప్రారంభించి, క్రీడాకారులను అభినందించారు. యువత క్రీడల్లో రాణించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయని పేర్కొన్నారు.



# -డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ!

- ఏళ్ల నిరీక్షణకు తెర.. కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల స్వప్నం సాకారం
- క్రమబద్ధీకరణకు విశేష కృషి చేసిన ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి సన్మానం
- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వానికి కాంట్రాక్ట్ ఉద్యోగుల హృదయపూర్వక కృతజ్ఞతలు
- ఎన్జీవో రాష్ట్ర నాయకత్వానికి, ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు

**విజయవాడ ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్**




డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ (రెగ్యులరైజేషన్) ప్రక్రియ విజయవంతం కావడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తమ చిరకాల స్వప్నాన్ని సాకారం చేసేందుకు అలుపెరగని కృషి చేసిన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు . A. విద్యాసాగర్ ని, కాంట్రాక్ట్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం విజయవాడలోని ఎన్జీవో హోమ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన నాయకత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు మరియు అభినందనలు తెలియజేశారు.

**కీలక పాత్ర పోషించిన 'సాగర్-రమణ' నాయకత్వం:**

ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ...ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశాన్ని ఎన్జీవో రాష్ట్ర నాయకత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని కొనియాడారు.ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో అధ్యక్షుడు విద్యాసాగర్ గారు నిరంతరం శ్రమించారని తెలిపారు. వారి ప్రత్యేక చొరవతోనే ముఖ్యమంత్రి ఆమోదం, క్యాబినెట్ ఆమోదం లభించడమే కాకుండా, అసెంబ్లీలో బిల్లు పాస్ అయిందని గుర్తుచేశారు. ఆ తర్వాత డిపార్ట్‌మెంట్ ప్రాసెస్ చట్ట సవరణ (అమెండ్మెంట్) ద్వారా సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు మార్గం సుగమమైందని వారు స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్జీవో సంఘం చొరవతో 8000 మంది కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కి మార్గం ముఖ్యమంత్రి ఆమోదంతో సగం అయిందని, ఇప్పుడు యాక్ట్ 30 సవరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం లభించడంతో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్కు కూడా మార్గం సుగమం అయిందని తెలిపారు.

**ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు:**

ఏళ్ల తరబడి వేచి చూస్తున్న ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపి, వారి కుటుంబాలకు భరోసా కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఆర్థిక శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ కి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, శాఖాధికారులకు మరియు సంబంధిత ప్రభుత్వ యంత్రాంగానికి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు సమర్పించారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈ కృతజ్ఞతా కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరెడ్ల అంజనీ కుమార్, కార్యదర్శి శ్రీదేవి, సహాయ కార్యదర్శితో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి భారీ సంఖ్యలో విచ్చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఎన్జీవో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంజీర్ సాగుతో .... ఆరోగ్యం.. ఆదాయం



**డా. ముచ్చుకోట సురేష్ బాబు**

ఎల్‌నినో ప్రభావంతో అనంతపురం జిల్లాలో వర్ష పాతం తగ్గి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్న నేపథ్యంలో, తక్కువ నీటితో సాగు చేయగలిగే, మంచి దిగుబడి మరియు ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అంజీర్ సాగు అనంతపురం ప్రాంత రైతులకు ఒక మంచి అవకాశంగా కనిపిస్తోంది.గత నాలుగు నెలల్లో కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయిన పరిస్థితుల్లో, నీటి అవసరం తక్కువగా ఉండే పంటలను ఎంపిక చేయడం కీలకంగా మారింది. వేడి, పొడి వాతావరణాన్ని తట్టుకోగల అంజీర్ మొక్కలు అనంతపురం నేలలు, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.గుత్తి ప్రాంతంలో దయానా రకం సాగు

గుత్తి మండలం వన్నెదొడ్డి ప్రాంతంలో దయానా రకం అంజీర్‌ను శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. అక్కడ మంచి నాణ్యత కలిగిన అంటుకట్టిన మొక్కలను తయారు చేసి రైతులకు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన మొక్కలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా అంజీర్ సాగును మరింత విస్తరించవచ్చు.అంజీర్ (ఫికస్ కారిక ) ప్రపంచంలోని పురాతన పండ్లలో ఒకటి. రుచి, పోషక విలువల కారణంగా దీనికి ప్రత్యేకమైన మార్కెట్ ఉంది. తాజా అంజీర్‌లో నీటి శాతం అధికంగా ఉండగా, ఎండిన అంజీర్‌లో సహజ చక్కెరలు, పీచు, కాల్షియం, పొటాషియం, ఇనుము, మెగ్నీషియం, విటమిన్ ఏ, సి వంటి పోషకాలు లభిస్తాయి.అంజీర్‌లోని పీచు జీర్ణక్రియకు, మలబద్ధకం నివారణకు సహాయపడుతుంది. కాల్షియం, పొటాషియం వంటి ఖనిజాలు ఎముకల ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయి. అయితే ఎండిన అంజీర్‌లో సహజ చక్కెరలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిది.

**దయానా రకానికి ప్రత్యేకత**

దయానా అంజీర్ రకం రైతులు, ఇంటి తోటల పెంపకందారుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ రకం పెద్ద పరిమాణంలో పసుపుఆకుపచ్చ రంగు పండ్లను, తియ్యటి అంబర్‌ఎరుపు గుజ్జును ఇస్తుంది. నాణ్యమైన టిష్యూ కల్చర్ లేదా అంటుకట్టిన మొక్కలు అనుకూల పరిస్థితుల్లో సుమారు 10-12 నెలల్లో కాపు ప్రారంభించే అవకాశం ఉంది. అంజీర్‌కు రోజుకు 6-8 గంటల సూర్యకాంతి అవసరం. నీరు నిల్వ ఉండకుండా మంచి డ్రైనేజీ కలిగిన నేలలో నాటాలి. వేడి, ఎండ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులతో మంచి ఫలితాలు సాధించవచ్చు.రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయం అనంతపురం వంటి కరువు ప్రభావిత ప్రాంతాల్లో నీటి లభ్యత రోజురోజుకూ తగ్గుతున్న నేపథ్యంలో, తక్కువ నీటి అవసరం ఉన్న ఉద్యాన పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అంజీర్‌తో పాటు డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి పద్ధతులను అనుసరిస్తే నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.తాజా పండ్లతో పాటు ఎండిన అంజీర్‌కు కూడా మార్కెట్ ఉండటం ఈ పంటకు అదనపు ప్రయోజనం. శాస్త్రీయ సాగు పద్ధతులు, నాణ్యమైన మొక్కలు, మార్కెటింగ్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే అంజీర్ అనంతపురం రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కరువు పరిస్థితులను అధిగమించేందుకు ప్రతి ఎకరాకు అధిక నీరు అవసరమయ్యే పంటలకే పరిమితం కాకుండా, తక్కువ నీటితో అధిక విలువను సృష్టించే పంటల వైపు రైతులు మళ్లడం కాలానుగుణ అవసరం. అంజీర్ సాగు ఆ దిశగా ఒక ఆశాజనకమైన మార్గంగా నిలవవచ్చు.





# నెల్లూరులో కూటమి సంబరాలు



**- బీసీలకు 33.3% రిజర్వేషన్లపై హర్షా తిరేకాలు**
**- జై హో బీసీ నినాదం కాదు.. టీడీపీ సిద్ధాంతం.**
**- చంద్రబాబు, పవన్, నారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం.**
**- గత ప్రభుత్వంలో బీసీలకు తీవ్ర అన్యాయం.- మళ్లీ ఇపుడు పండగ వాతావరణం**

నెల్లూరు ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్

నెల్లూరు నగరంలోని 48వ డివిజన్‌లో డివిజన్ ఇంచార్జ్ కీర్తి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.3 శాతం రిజర్వేషన్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు నిర్వహించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణల చిత్రపటాలకు నేతలు పాలాభిషేకం చేసి ,స్వీట్లు పంచిపెట్టారు .నగర మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, డివిజన్ అధ్యక్షుడు పెంచలయ్య, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ కంచి జ్ఞానేంద్రలు మీడియాతో మాట్లాడారు. జై హో బీసీ అనేది కేవలం ఒక నినాదం కాదని, అది తెలుగుదేశం పార్టీ తొలి నుంచీ పాటిస్తున్న ప్రధాన సిద్ధాంతమని పేర్కొన్నారు .తెలుగుదేశం పార్టీ స్థాపించిన సమయంలోనే స్వర్గీయ నందమూరి తారక రామారావు బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించి వారికి రాజకీయ గుర్తింపు తెచ్చారని, ఆ తర్వాత చంద్రబాబు నాయుడు దానిని మరింత పెంచి బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడారని గుర్తుచేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి బీసీ రిజర్వేషన్లను కుదించి, నాయకులకు ప్రాతినిధ్యం లేకుండా చేసి తీవ్ర అన్యాయం చేశారని, బీసీ ద్రోహిగా మిగిలారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణ ప్రాంతాల్లో బీసీలకు 33.3 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించి బీసీల పక్షపాతిగా నిలిచిందని, దీంతో బిసి వర్గాల్లో మళ్లీ పండగ వాతావరణం నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో కో క్లస్టర్ షేక్ జాఫర్, ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి మాడుగుల పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర

**- పర్యటనను ఘన విజయం చేసే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలి**

అనకాపల్లి ఆగస్టు 21,అనంత జనశక్తి న్యూస్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాడుగుల పర్యటన ఘన విజయం చేసేలా ప్రతి కార్యకర్త బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మాడుగుల నియోజకవర్గం కె.కోటపాడు మండలంలో జోనల్ పరిశీలకులు బెందాళం అశోక్, జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి గతో కలిసి కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం ముఖ్యమంత్రి వర్యులు ఒక నియోజకవర్గంలో పాల్గొంటున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యం సాధ్యమవుతుందని, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

అనంతరం కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఉంటుందని తెలిపారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి సభావేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు.





# రహదారి సమస్య పరిష్కరించాలని గిరిజనుల వినతి

**- మా సమస్యను పట్టించుకునే నాధుడు లేరు:గ్రామస్తులు**

అనంతగిరి ఆగష్టు21:అనంత జనశక్తి న్యూస్



అనంతగిరి మండలం, జీనబాడు పంచాయతీ పరిధిలో గల వలస గురువు గ్రామానికి రహదారి సమస్యను పరిష్కరించి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు జిసిసి,చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.తాము నిత్యం వినియోగించే రహదారి చాలా కాలంగా సమస్యాత్మకంగా ఉందని తెలిపారు.రహదారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షా లు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూర్తిస్థాయిలో పరిష్కారం లభించలేదని గ్రామస్తులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్నవారిని ఆసుపత్రులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రహదారిని పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు. రహదారి సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# విశాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత

**- గోదావరి జలాలతో విశాఖ తాగునీటి సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం.**
**- రూ.1,000 కోట్లతో తాగునీటి ప్రణాళిక... ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటి సరఫరా లక్ష్యం.**
**- రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులు... శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు వినియోగించేలా చర్యలు.**
**- రోడ్లు, వీధి దీపాల పనులకు అత్యవసర ప్రాతిపదికన ప్రాధాన్యత.**
**- వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలు... 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు.**
**- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ.**

విశాఖపట్నం, ఆగస్టు 21:అనంత జనశక్తి ప్రతినిధి

విశాఖ నగరంలో తాగునీరు, రోడ్లు, వీధి దీపాలు, మురుగునీటి నిర్వహణ తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ తెలిపారు. శుక్రవారం VMRDA కార్యాలయంలో ప్రజాప్రతినిధులు,, GVMC కమిషనర్ కేతన్ గార్గ్, VMRDA అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్ష సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జీవీఎం సీ అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టవలసిన కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టు పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి, ప్రజా ప్రతినిధులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. విశాఖకు గోదావరి జలాలు రానున్న నేపథ్యంలో వాటి నిల్వకు అవసరమైన ప్రాంతాలను గుర్తించామని, సుమారు రూ.1,000 కోట్లతో తాగునీటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తే ప్రతి ఇంటికీ రోజుకు 135 లీటర్ల నీటిని అందించవచ్చని పేర్కొన్నారు. గోదావరి జలాలతో విశాఖ తాగునీటి సమస్య చాలా వరకు పరిష్కారమవుతుందన్నరూ.మురుగు నీటి శుద్ధి కోసం సుమారు రూ.1,500 కోట్లతో ఎస్ టి పి ప్రాజెక్టులను సిద్ధం చేస్తున్నామని, శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు అందించడం ద్వారా మంచినీటి వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు. డేటా సెంటర్ల వల్ల విశాఖలో నీటి సమస్య ఏర్పడుతుందనే ప్రచారంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.నగరంలో రోడ్లు, వీధి దీపాల పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించామని మంత్రి తెలిపారు. రహదారి పనుల జాప్యంపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డితో చర్చించామని, అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన వెంటనే పనులను వేగవంతం చేస్తామన్నారు. వెలంపేటలో 12 అంతస్తుల గృహ సముదాయాలను నిర్మించి, అర్హులకు సుమారు 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో గృహాలు అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఎన్నికల అంశం ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉందని, కోర్టు తీర్పు అనంతరం ఎన్నికల ప్రక్రియకు సంబంధించి తదుపరి చర్యలు చేపడతామని మంత్రి వెల్లడించారు.ఈ సమీక్షలో గాజువాక ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు), అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి. విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, కొణతాల రామకృష్ణ, విఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు.



# తొట్టంబేడు డిప్యూటీ తహసిల్దార్ జీవన్ సస్పెండ్

తిరుపతి ఆగస్టు 21, అనంత జనశక్తి న్యూస్

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు తహసిల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసిల్దార్ జీవన్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. 0.09 సెంట్ల భూమికి సంబంధించి రూ.3,00,000 అక్రమ లంచం డిమాండ్, శెట్టిపల్లి భూములకు సంబంధించి ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ పై నిరాధార అసత్య ఆరోపణలు చేసిన ఒక ఆడియో రికార్డింగ్ సోషల్ మీడియాలో బహిర్గతమైంది. ఈ విషయంపై శ్రీకాళహస్తి తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా సదర ఆడియో రికార్డింగ్ పరిశీలించి అందులోని వాయిస్ తొట్టంబేడు డిప్యూటీ తహసిల్దార్ జీవన్ కుమార్ దిగా గుర్తించారు. అధికారులు సమర్పించిన నివేదికల ఆధారంగా జీవన్ కుమార్ ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఈ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ రూట్స్ కింద జీవన్ కుమార్ పై మూడు అవయోగాలను నమోదు చేసి శాఖపరమైన చర్యలకు ఆదేశించారు.**

# ఏడు అంతస్తుల మల్టీ లెవల్ పార్కింగ్

**- వసతి సముదాయం.!**
**- విజయవాడ దుర్గమ్మ భక్తులకు రిలీఫ్**
**- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి**
**- టీటీడీకి ఉన్న మూడు ఎకరాల స్థలంలో నిర్మాణాలు**

విజయవాడ దుర్గమ్మ భక్తులకు శుభవార్త. కనకదుర్గమ్మ దర్శనం కోసం వెళ్లే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. దుర్గ గుడి వద్ద ట్రాఫిక్ సమస్యలు తొలగించేందుకు, వసతి సదుపాయాలు మెరుగుపరిచేందుకు సరికొత్త ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ విషయాన్ని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు.. కుమ్మరిపాలెం నుంచి 700 మీటర్ల మేరకు రెండో ఘాట్ రోడ్డు నిర్మాణానికై ఆలోచన చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రెండో ఘాట్ రోడ్డు నిర్మాణం సాధ్యాసాధ్యాల నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే కుమ్మరిపాలెంలోని మూడు ఎకరాల టీటీడీ స్థలంలో 15 వేల మంది భక్తులకు ఉపయోగపడేలా .. ఏడు అంతస్తుల మల్టీ లెవెల్ పార్కింగ్, వసతి సముదాయం నిర్మించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు ఆనం వెల్లడించారు. దుర్గాఘాట్ వద్ద భారీ కేశఖండనశాల, ఘాట్ రోడ్డు మొదటి మలుపు వద్ద 25 అడుగుల ఎత్తైన ఆదిశంకరాచార్యుల విగ్రహం ఏర్పాటు చేయడానికి కూడా ప్రణాళికలు రచిస్తున్నట్లు వివరించారు. అలాగే త్వరలోనే అత్యాధునిక మెకనైజ్డ్ కిచెన్లను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. మరోవైపు ఇంద్రకీలాద్రిపై రూ.52.50 కోట్లు ఖర్చుచేసి నూతనంగా నిర్మించిన భవనాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ కనకదుర్గ అన్నప్రసాద భవనం, రూ. 26.50 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ దుర్గా భవాని మహా ప్రసాద భవనాలను విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో కలిసి ప్రారంభించారు. అనంతరం నూతన అన్నప్రసాద సదనంలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు, ప్రసాద విక్రయ కేంద్రంలో నగదు చెల్లించి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను స్వీకరించారు. కనకదుర్గమ్మ దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. క్యూలైన్లలోని భక్తులకు తాగునీరు, పాలు, ప్రసాదాల పంపిణీతో పాటు పారిశుద్ధ్యం, భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆనం రామనారాయణ రెడ్డి వివరించారు.



## ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలి



(మొదటి పేజీ తరువాయి)

కమిటీలో మండలి బుద్ధ ప్రసాద్, టి.శివశంకర్, కందుల దుర్గేష్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవికుమార్ సభ్యులుగా ఉంటారని జనసేన పార్టీ అధికారికంగా ప్రకటించింది.

అయితే 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పేరు లేకపోవటంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు బాలినేని శ్రీనివాసరెడ్డికి జనసేన జాయినింగ్స్ కమిటీ, అలాగే స్థానిక సంస్థల ఎన్నికలు, డీలిమిటేషన్‌కు సంబంధించి ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ బాధ్యతలను అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాల రూపకల్పన కమిటీలో చోటు లేకపోవటంతో నెట్టింట చర్చ జరుగుతోంది.

మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని, ఈ ఎన్నికలలో అనుసరించే విధివిధానాల రూపకల్పనకు ప్రత్యేక కమిటీని నియమిస్తామని పవన్ కళ్యాణ్ గురువారం తెలిపారు. జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పవన్ పిలుపునిచ్చారు.

పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజక వర్గాలకే పరిమితం కాకుండా, జనసేన బలబలాలను బేరీజు వేసి, పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. వైసీపీ పాలనను ముగించేందుకే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన 21 సీట్లకు పరిమితమై పోటీ చేసిందని. ఆ వ్యూహం ఆ ఎన్నికలకేనని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలకు ఆయా ప్రాంత రాజకీయ, సామాజిక పరిస్థితులను అనుసరించి వ్యూహాలు ఉంటాయని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్




- రూ.108 కోట్లతో 11 ఫ్లోర్లతో నిర్మాణం
- రేవంత్ సర్కార్ గ్రీన్ సిగ్నల్
- బడ్జెట్‌లో ఇప్పటికే రూ.25 కోట్లు

హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్

హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న పాత అంబేద్కర్ భవనం స్థానంలో అత్యాధునిక సదుపాయాలతో కొత్త టవర్‌ను నిర్మించేందుకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుకు రూ.108 కోట్ల అంచనా వ్యయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న పాత భవనం స్థానంలో కొత్త నిర్మాణానికి మార్గం సుగమమైంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రకారం.. కొత్తగా నిర్మించనున్న అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌లతోపాటు 10 అంతస్తులతో ఉండనుంది.

అంటే మొత్తం 11 స్థాయిల్లో ఈ అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆలోచనలు, సామాజిక న్యాయం, విద్య, రాజ్యాంగ విలువలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఈ టవర్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలుస్తోంది. లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రస్తుతం ఉన్న అంబేద్కర్ భవనం జీ+1 నిర్మాణంతో ఉంది. ఈ భవనం గత 12 ఏళ్లుగా వినియోగంలో లేకుండా నిరుపయోగంగా మారింది. సరైన నిర్వహణ లేకపోవడంతో భవనం పరిస్థితి కూడా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. భవనం పరిస్థితిపై రోడ్లు, భవనాల శాఖ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించారు. ఆర్ అండ్ బీ అధికారుల సర్వే తర్వాత పాత భవనాన్ని పూర్తిగా తొలగించి.. అదే ప్రదేశంలో కొత్తగా అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మించడం అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందుకోసం రూ.108 కోట్ల మేర అంచనా వ్యయాన్ని రూపొందించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. 2026 27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే రూ.25 కోట్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేటాయించింది. తాజాగా ఆర్థిక శాఖ సమ్మతితో రూ.108 కోట్లకు పరిపాలనా అనుమతి లభించింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన తదుపరి ప్రక్రియను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

కొత్త టవర్ నిర్మాణానికి అవసరమైన ఆర్కిటెక్చరల్ డిజైన్లు, ప్లాన్లు, స్ట్రక్చరల్ డిజైన్ వంటి అంశాల కోసం నిపుణుల కన్సల్టెన్సీ సేవలను తీసుకోనున్నారు. భవన నిర్మాణం నాణ్యత, భద్రత, ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఉండేలా ప్రణాళిక రూపొందించనున్నారు. ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లనున్నారు. పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేందిర బోయి ఉత్తర్వులు జారీ చేశారు.

మొత్తంగా.. 12 ఏళ్లుగా వినియోగానికి దూరంగా ఉన్న పాత అంబేద్కర్ భవనం స్థానంలో రూ.108 కోట్లతో ఆధునిక అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మించాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి.. టవర్‌లో ఎలాంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తారు.. అనే అంశాలపై తదుపరి దశలో స్పష్టత రానుంది.

## షావుకారు జానకి మృతిపట్ల చంద్రబాబు, లోకేశ్ సంతాపం

హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంత జనశక్తి న్యూస్

అలనాటి ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతిపట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. జానకి భౌతికంగా దూరమైన ఆమె నటించిన పాత్రల ద్వారా అందరి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని సీఎం అన్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని మంత్రి లోకేశ్ కొనియాడారు.

**సీఎం చంద్రబాబు పోస్ట్...**

'అలనాటి ప్రముఖ నటి షావుకారు జానకి (94) ఆకస్మిక మరణం నాకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. 400కు పైగా చిత్రాల్లో నటించి ఎన్నో అవార్డులు, రివార్డులు పొందిన షావుకారు జానకి భౌతికంగా మనకు దూరం అయినా ఆమె నటించిన పాత్రల ద్వారా చిరస్థాయిగా మన మనసుల్లో నిలిచిపోతారు. షావుకారు జానకి ఆత్మకు ఆ భగవంతుడు శాంతి చేకూర్చాలని కోరుకుంటున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నాను' అంటూ ఎక్స్‌లో సీఎం చంద్రాబు పోస్ట్ చేశారు.

**సినీ రంగానికి జానకి అందించిన సేవలు చిరస్మరణీయం: మంత్రి లోకేశ్**

ప్రముఖ సినీ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతిపట్ల ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సంతాపం తెలిపారు. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో సుమారు 400 చిత్రాల్లో నటించి ప్రేక్షకులను అలరించారన్నారు. షావుకారు సినిమా పేరునే ఇంటిపేరుగా మార్చుకున్నారని అన్నారు. వైవిధ్యమైన పాత్రలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. సినీ రంగానికి ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. షావుకారు జానకి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. జానకి కుటుంబ సభ్యులకు మంత్రి లోకేశ్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఎస్ఆర్‌బీసీ నీటిని పరిశ్రమలకు అమ్ముతున్నారన్న ఆరోపణలు అవాస్తవం

- రైతులకు సాగునీరు ఇవ్వకపోవడానికి కారణం వర్షా భావమే
- ప్రజలకు తాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత: మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 21:అనంత జనశక్తి న్యూస్




ఎస్ఆర్‌బీసీ ద్వారా రైతులకు నీళ్లు ఇవ్వకుండా పరిశ్రమలకు నీటిని అమ్ముతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**దేశవ్యాప్తంగా వర్షా భావ పరిస్థితులు**

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని మంత్రి తెలిపారు. గత నాలుగు నెలలుగా వాతావరణ నిపుణులు సైతం తీవ్ర వర్షాభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితులను రైతులు గుర్తించి వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేయకుండా ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగిస్తున్నాం

కర్ణాటకలో కురిసిన కొద్దిపాటి వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం వచ్చిందని, అందుబాటులో ఉన్న నీటిని తెలుగు రాష్ట్రాలు జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. గత ఏడాది మే చివరి వారం వరకు రైతులకు సాగునీరు అందించామని మంత్రి పేర్కొన్నారు.

**తాగునీటికే తొలి ప్రాధాన్యత**

ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి స్పష్టం చేశారు. అవుకు రిజర్వాయర్‌కు ఒక టీఎంసీ నీటిని తీసుకొచ్చామని, దీని ద్వారా నాలుగు మండలాలకు తాగునీరు అందించవచ్చని తెలిపారు. తాగునీటి అవసరాల కోసం ఇతర ప్రాజెక్టులకు సుమారు 21 టీఎంసీల నీటిని తరలిస్తున్నామని చెప్పారు.

**పరిశ్రమలకు నీరు ఇవ్వడమే ఉద్దేశం కాదు**

నీరు వృథా కాకుండా ఉండేందుకు జీఎన్ఎస్ఎస్ ద్వారా నీటిని తరలిస్తున్నామని, పరిశ్రమలకు నీటిని అందించడమే దీని ఉద్దేశం కాదని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమలకు అందిస్తున్న నీరు కూడా చాలా స్వల్ప మొత్తమేనని తెలిపారు. సిమెంట్ పరిశ్రమలపై వేలాది మంది నిరుపేదలు ఆధారపడి జీవిస్తున్నందున వారి ఉపాధిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

వర్షాలు కురిస్తే రైతులకు సాగునీరు

భవిష్యత్తులో వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఎల్‌నినో ప్రభావం దేశవ్యాప్తంగా ఉన్నప్పటికీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే వర్షాలు రావని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

గోరుకల్లు రిజర్వాయర్ నింపాలని సీఎం ఆదేశాలు

భవిష్యత్తు తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గోరుకల్లు రిజర్వాయర్‌ను నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

**రాయలసీమకు ద్రోహం ఎవరు చేశారో ప్రజలకు తెలుసు**

రాయలసీమ కోసం వైసీపీ నేతలు చేసిన పోరాటం ఏమిటో సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. కుందూ, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుల విషయంలో వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు వివరించాలని అన్నారు. రాయలసీమకు ద్రోహం ఎవరు చేశారో, న్యాయం ఎవరి పాలనలో జరిగిందో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు.

జీఎన్ఎస్ఎస్ లైనింగ్‌తో భూగర్భ జలాలపై ప్రభావం

గతంలో మిగులు జలాలతో భూగర్భ జలాలను పెంచాలనే ఉద్దేశంతో జీఎన్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం జీఎన్ఎస్ఎస్‌కు లైనింగ్ చేయడం వల్ల భూగర్భ జలాలు తగ్గిపోయాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత సొంత నిధులతో పలుచోట్ల లైనింగ్‌కు రంధ్రాలు ఏర్పాటు చేసి భూగర్భ జలాలను పెంచే చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రతి అర కిలోమీటర్‌కు లైనింగ్‌లో రంధ్రాలు ఏర్పాటు చేయడం ద్వారా పలు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి వెల్లడించారు.

# విద్య, వైద్య రంగాల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత

- యువతకు నాణ్యమైన విద్యతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు
- కోటబొమ్మాళి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చిరకాల కోరిక సాకారం
- మూలపేట పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి

కోటబొమ్మాళి, ఆగస్టు 21:అనంత జనశక్తి న్యూస్

రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాల బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో డిగ్రీ కళాశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా. ఆయన మాట్లాడుతూ కోటబొమ్మాళి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలన్న తన చిరకాల కోరిక సాకారం కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.యువతకు నాణ్యమైన ఉన్నత విద్య అందించడంతో పాటు వారికి విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమల స్థాపన అవసరమని మంత్రి పేర్కొన్నారు. ఇటీవల రూ.2,600 కోట్ల పెట్టుబడితో 450 ఎకరాల విస్తీర్ణంలో కోరమండల్ పరిశ్రమను మూలపేటలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని తెలిపారు. దేశంలోని ప్రముఖ పరిశ్రమలు మూలపేటలో తమ పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావడం శుభ పరిణామమని, రానున్న రోజుల్లో మూలపేట పోర్టు ప్రాంతం పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చెందనుందని అన్నారు.

విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తు

విద్యతోనే యువతకు బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని మంత్రి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నత విద్యకు సంబంధించి సమగ్ర విధానాలను అమలు చేస్తూ ప్రతి ఒక్కరికీ ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా చారిత్రాత్మక చర్యలు చేపడుతున్నారని తెలిపారు.కోటబొమ్మాళి డిగ్రీ కళాశాలకు త్వరలో శాశ్వత భవనం నిర్మించేందుకు చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో కళాశాల భవనాన్ని నిర్మించేందుకు కృషి చేస్తామని చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించేలా అవసరమైన కోర్సులను డిగ్రీ కళాశాలలో మంజూరు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

**సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**

ప్రజా ప్రభుత్వంగా అన్ని వర్గాల సంక్షేమం, అన్ని రంగాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని మంత్రి అన్నారు. శ్రీకాకుళం జిల్లా వెనుకబాటుతనాన్ని రూపుమాపి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడినప్పటికీ వంశధార కాలువల నుంచి సాగునీటిని అందించి రైతులకు అండగా నిలిచామని మంత్రి గుర్తు చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పంట బీమా నమోదుకు ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు అవకాశం కల్పించిందని తెలిపారు. జిల్లాలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శత శాతం పంట బీమా నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు.



**కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి రూ.5 కోట్లు**

కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులను చేపట్టి గత ఏడాది కంటే మరింత వైభవంగా ఈ ఏడాది కొత్తమ్మ తల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

అనంతరం డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలను మంత్రి చేతులమీదుగా మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్, ఆర్డీఓ ఎం. కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఇంచార్జ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, టి. గోవిందమ్మ, శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా, ఎన్.ఎస్. ఎన్.మూర్తి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. అప్పన్న, తదితరులు, పాల్గొన్నారు.

# ఎంపీ అవినాశ్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసుకు సంబంధించి సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు, దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ల ఆధారంగానే ఈడీ తమ దర్యాప్తును వేగవంతం చేసింది

వైఎస్ వివేకానందరెడ్డి 2019 మార్చిలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలోని తన స్వగృహంలో దారుణ హత్యకు గురయ్యారు. ప్రారంభంలో రాష్ట్ర పోలీసులు ఈ కేసును విచారించినప్పటికీ, 2020లో దర్యాప్తు సీబీఐకి బదిలీ అయింది. ఈ హత్య వెనుక పెద్ద కుట్ర ఉందన్న ఆరోపణలతో సీబీఐ లోతైన విచారణ జరిపి.... హత్య కుట్రలో భాగస్వామ్యం ఉందనే ఆరోపణలపై వైఎస్ భాస్కర్ రెడ్డిని 2023 ఏప్రిల్ 16న అరెస్ట్ చేసింది.

డైవర్షన్ రాజకీయం ఈడీ సోదాలపై వైఎస్సార్‌సీపీ

ఈడీ సోదాలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కూటమి ప్రభుత్వం ఎదుర్కొంటున్న తీవ్రమైన ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ తనిఖీలు చేయిస్తున్నారని గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆరోపించారు. రాష్ట్రంలో డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అక్రమాలు, పోలీసు వాహనంలో గంజాయి దొరకడం, సుగాలి ప్రీతి తల్లి చక్రాల కుర్చీ నిరసనను అడ్డుకోవడం మరియు అధికార పార్టీ ఎంపీ లింగమనేని రమేష్ కుమారుడి కారు ఢీకొని యువతి మృతి చెందిన హిట్ అండ్ రన్ కేసు వంటి అంశాలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయని శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఈ సమస్యల నుంచి తప్పించుకోవడానికే ఈడీని రంగంలోకి దించారని దుయ్యబట్టారు. డీఎస్సీ క్రీడా కోటా అక్రమాలపై సీబీఐ విచారణకు సిద్ధమా అని సవాలు విసిరారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1 అక్రమాలపై కూడా సీబీఐ విచారణ ఎదుర్కొనేందుకు తమ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. వివేకా హత్య జరిగినప్పుడు చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రిగా ఉన్నారని శ్రీకాంత్ రెడ్డి గుర్తుచేశారు. మొదట సిట్ , ఆ తర్వాత సీబీఐ విచారణ జరిపాయని తెలిపారు.

ఈ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉన్నప్పుడు, విచారణను ఎందుకు అడ్డుకుంటున్నారు... నిజాన్ని ఎందుకు బయటకు రానివ్వడం లేదని ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తరఫున పలు కేసుల్లో వాదిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లుథ్రా, వివేకా హత్య కేసులోని నిందితుడి తరఫున కూడా హాజరవుతున్నారని, లాయర్ ఫీజుల కోసం ప్రజాధనాన్ని ఎంత ఖర్చు చేస్తున్నారో పారదర్శకంగా చెప్పాలని డిమాండ్ చేశారు. "వివేకానందరెడ్డి మా నాయకుడు, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు. తప్పుడు కథనాలు, డైవర్షన్ రాజకీయాలు ఆపి విచారణ సాగనివ్వండి, నిజం బయటకు రానివ్వండి" అని శ్రీకాంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి




హైదరాబాద్, ఆగస్ట్ 21, అనంతజనశక్తి న్యూస్

మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తీవ్రంగా ఖండించారు. గురువారం శాసన సభాపక్ష (సీఎల్పీ) కార్యాలయం వేదికగా దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అత్యవసర మీడియా సమావేశం నిర్వహించారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా మాట్లాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

**కొండా ఫ్యామిలీపై ఫైర్...**

"తన కూతురు వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదనడం సరికాదు," అని కొండా సురేఖ వైఖరిని ఎమ్మెల్యేలు తప్పుబట్టారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను మంత్రి వెంటనే ఖండించాల్సిందని అభిప్రాయపడ్డారు. "కొండా సురేఖ గతంలోనూ నోరుజారి పార్టీకి ఇబ్బందులు తెచ్చిపెట్టారు. కొండా కుటుంబం మాట్లాడే భాష ఎప్పుడూ పార్టీకి తలనొప్పిగా మారింది. మీ బాధ్యతారాహిత్య వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇలా మాట్లాడే వారిపై ఏఐసీసీ వెంటనే చర్యలు తీసుకోవాలి" అని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు ఎంతగానో కష్టపడ్డారని ఎమ్మెల్యేలు గుర్తుచేశారు. "పార్టీ, ముఖ్యమంత్రి గురించి ఇలా బహిరంగంగా మాట్లాడటం ముమ్మాటికీ తప్పే. ఏదైనా సమస్య ఉంటే సీఎల్పీ లేదా పీసీసీ సమావేశాల్లో చర్చించాలి. సొంత పార్టీ నేతలే సీఎంకు అండగా నిలవాలి కానీ, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను బహిరంగంగా తప్పుపట్టడం సరికాదు. మనం ఉన్న చెట్టు కొమ్మను మనమే నరుక్కున్నట్లుగా ఉంది ఈ వైఖరి. సుస్మిత వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు బలాన్ని చేకూరుస్తాయి" అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. "కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఎగిరెగిరి పడుతున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో మీ గతి ఏమైందో అందరికీ తెలుసు. జి. చిన్నారెడ్డికి పార్టీ ఎన్నిసార్లు టికెట్ ఇచ్చినా ఆయన ఎగిరెగిరి పడుతున్నారు. రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి, సురేఖ.. మీరందరూ కాంగ్రెస్ కార్యకర్తలు రక్తం చిందించి పనిచేస్తేనే ఈ స్థాయికి వచ్చారు," అని గుర్తుచేశారు.

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... "మా పార్టీలోనే కొండా సురేఖ వెనుక కొందరు గుంట నక్కలు చేరారు. రేవంత్ రెడ్డి రక్తం తాగింది చాలు, సురేఖ వెంటనే పార్టీ నుంచి వెళ్ళిపోవాలి. పార్టీ నుంచి బహిష్కరించక ముందే ఆమె వెళ్లిపోవడం మంచిది. ఏ పార్టీలో ఉన్నా గొడవలు లేకుండా సురేఖ ఉన్నారా? ఒక్క ఎమ్మెల్యేతో అయినా ఆమెకు మంచి సంబంధాలు ఉన్నాయా? కూతురు మాట్లాడుతుంటే వెనుక బ్యానర్‌లో సురేఖ ఫోటో ఉంది.. మళ్లీ ఆ వ్యాఖ్యలకు నాకు సంబంధం లేదనడం విడ్డూరం. ఇంకెన్ని రోజులు ఈ బ్లాక్‌మెయిల్ రాజకీయం నడుపుతారు? మాలాంటి వాళ్లను అవమానిస్తూ రక్తం తాగుతామంటే చూస్తూ ఊరుకోం" అని హెచ్చరించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్పందిస్తూ... "పిల్ల కాకి కొండా సుస్మిత మాట్లాడిన మాటలు ఆమెవి కావు.. అవి కొండా సురేఖ మాట్లాడించిన మాటలే," అని ఆరోపించారు.**

**ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ, "పార్టీలో కనీస సభ్యత్వం కూడా లేని, అనామకురాలైన కొండా సుస్మిత మా ఎమ్మెల్యేను పట్టుకుని అడ్డగోలుగా మాట్లాడుతోంది. రేవంత్ రెడ్డి నిర్ణయాలను వ్యతిరేకించే వారికి కాంగ్రెస్‌లో ఉండే అర్హత లేదు. నోటీసులు ఇస్తే నా బిడ్డ మాటలకు నాకు సంబంధం లేదని సురేఖ చెబుతున్నారు. ఖండించని పక్షంలో సంబంధం లేదనడం ఎలా కుదురుతుంది? మీ తప్పడు భాషకు ప్రభుత్వం మూల్యం చెల్లిస్తోంది. మీరు మాత్రం పదవిని ఎంజాయ్ చేస్తూ పార్టీని బజారున పడేస్తున్నారు" అని మండిపడ్డారు. ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి ఎవరు రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడినా వారిపై అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.**

# ప్రోటీన్ కోసం రుచిపచి లేని ఫుడ్ తినాల్సిన అవసరం లేదు, సోయాతో రుచిగా ఇలా చేసుకుంటే బరువు పెరగరు, హెల్దీ కూడా



సోయా చంక్స్.. వీటితో చాలా మంది బిర్యానీలు, కూరలు, ఇలాంటి రెసిపీలు చేసుకుంటారు. ఇవి ఎంతో హెల్దీ. ఇందులో ఎక్కువగా ప్రోటీన్ ఉంటుంది. వీటిని తినడం కొంతమందికి బోరింగ్‌గా అనిపిస్తుంది. అలాంటి వారు సోయా చంక్స్‌తో చక్కగా సరికొత్త వెరైటీ చేసుకుని తినొచ్చు. చక్కగా వెరైటీగా వీటితో కట్‌లెట్ చేసుకుని హ్యాపీగా తినొచ్చు. దీని వల్ల చక్కగా టేస్టీగా సోయాని ఎంజాయ్ చేయొచ్చు. సోయా చంక్స్ అనేవి ఎప్పుడు కూడా చప్పగా ఎలాంటి టేస్ట్ లేకుండా ఉంటాయి. కానీ, ఇప్పుడు చెప్పినట్లుగా తింటే మాత్రం రుచికి రుచి.. ఆరోగ్యానికి ఆరోగ్యం అందినట్లుగా ఉంటుంది.











**వేడి నీటిలో నానబెట్టడం**

ముందుగా కొన్ని సోయా చంక్స్‌ని తీసుకుని వేడి నీటిలో నానబెట్టాలి. వెంటనే తర్వాత నీటిలో నుంచి వాటిని తీసేయాలి. ఎక్కువసేపు వద్దు. ఎక్కువసేపు నానితే అవి బాగోవు. కాబట్టి, కాసేపు నానగానే వెంటనే వాటిని స్క్వీజ్ చేసి తీసేయాలి.

**పనీర్ యాడ్ చేయడం**

అలానే లో ఫ్యాట్ పనీర్‌ని తీసుకోండి. ఇందులో చక్కగా ప్రోటీన్ ఉంటుంది. దీనిని కూడా ఈ కట్‌లెట్‌లో యాడ్ చేయొచ్చు. కాబట్టి లో ఫ్యాట్ ఫ్రెష్ పనీర్ తీసుకోండి. ఇప్పుడు మిక్సీ జార్‌లో సోయా, పనీర్‌ని వేయండి. అందులోనే ఉల్లి, పచ్చిమిర్చి తరుగు మీ టేస్ట్‌కి తగ్గట్లు వేయండి. తర్వాత అల్లం కూడా వేయండి. కొత్తిమీర వేసి పేస్టులా చేయండి. మరీ మెత్తగా కాకుండా కాస్తా బరకగా మిక్సీ పట్టి ఓ గిన్నెలో తీయండి.

**బైండింగ్ కోసం**

ఇప్పుడు తయారైన సోయా మిశ్రమంలో బైండింగ్ కోసం కొద్దిగా శనగపిండి లేదా ఓట్స్ పిండి వేసి కలపండి. అందులోనే ఉడికించిన బఠానీలని 30 గ్రాముల వరకూ కొద్దిగా మెదిపి వేయండి. ఇప్పుడు తయారైన పిండిలో కసూరి మెథి, ఉప్పు, ధనియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి అన్నీ కూడా రుచికి సరిపడా కలుపుకోండి. అన్నీ బాగా కలిసేలా చూడండి.

**కట్‌లెట్‌లా చేయడం**

ఇప్పుడు తయారైన పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీస్తూ టిక్కీల్లా ఒత్తండి. వీటిని కొద్దిగా నూనె వేస్తూ రెండువైపులా కాల్చండి. వీటిని వేడివేడిగా కొత్తిమీర, పుదీనా చట్నీతో ఎంజాయ్ చేయండి. ఇలా చేయడం వల్ల మీకు మంచి టేస్టీ ఐటెమ్‌ని తిన్నట్లుగా అనిపిస్తుంది. పైగా ప్రోటీన్ కూడా అందుతుంది.

**ఎందుకు ఈ రెసిపీ స్పెషల్**

ఇప్పుడు తయారైన రెసిపీలో ప్రోటీన్ ఎక్కువగా కేలరీలు తక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల బరువు తగ్గడానికి హెల్ప్ అవుతుంది. ప్రోటీన్ అందుతుంది. ఇందులో కలిపిన పదార్థాలన్నీ ప్రోటీన్ ఎక్కువగా ఉండేవే. పైగా వీటిని చేయడానికి ఎక్కువగా నూనె కూడా వాడలేదు. కాబట్టి, చక్కగా తినొచ్చు. ఈజీగా జీర్ణమవుతాయి. రిఫైండ్ ఫ్లోర్ కంటే ఇలా తయారైన రెసిపీలు చాలా టేస్టీగా, హెల్దీ అని చెప్పొచ్చు.

# రొయ్యలకు నరాలు ఎందుకు తీయాలి, తీయకుండా తింటే ఏమవుతుందో తెలుసా?



సండే వచ్చిందంటే చాలు నాన్ వెజ్ ప్రియులకు పండగే. చికెన్, మటన్, చేపలు ఇలా రకరకాల వెరైటీలు తింటారు. అయితే, చాలా మందికి రొయ్యలంటే ఇష్టం. రొయ్యలు పోషకాలతో సమృద్ధిగా ఉండే సూపర్ ఫుడ్. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. అయితే, రొయ్యల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండటం వల్ల ఆరోగ్యానికి మంచిదని నిపుణులు అంటున్నారు.



రొయ్యల్లో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు గుండె జబ్బుల నుంచి రక్షిస్తాయి. రొయ్యల్లో అయోడిన్ అనే ఖనిజం పుష్కలంగా ఉంటుంది. అందుకే ఇది థైరాయిడ్ రోగులకు ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. రొయ్యల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యానికి చాలా అవసరం. ఇక, రొయ్యల్ని పులుసుగా, ఫ్రై చేసుకుని తింటారు. ఇది ఎంతో రుచిగా ఉంటుంది.

ఇక రొయ్యల పచ్చడి కూడా చాలా ఫేమస్. అయితే, రొయ్యల్ని వండేటప్పుడు చాలా శుభ్రంగా క్లీన్ చేస్తారు. ముఖ్యంగా రొయ్యలకు నరాలు తీయాలని పెద్దలు చెబుతుంటారు. నరాలు తీయకుండా రొయ్యలు తినకూడదని నిపుణులు కూడా అంటున్నారు. అసలు రొయ్యలకు నరాలు ఎందుకు తీయాలి, తియ్యకుండా తింటే ఏమవుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**రొయ్యల నరాలు ఎందుకు తీయాలి?**

రొయ్యల వెనుక భాగం వీపు వెంట డైజెస్టివ్ ట్రాక్ట్ అనే నరం ఉంటుంది. ఇది ముదురు నలుపు రంగులో ఉంటుంది. ఇది వ్యర్థాల్ని, కొన్నిసార్లు విష పదార్థాల్ని కలిగి ఉంటుంది. రొయ్యల్ని నరాలతో పాటు తినడం వల్ల ఈ వ్యర్థాలు, విష పదార్థాలు హాని చేసే అవకాశం ఉంది.

నరాలు ఉండే రొయ్యల్ని తినకూడదని అందుకే పెద్దలు చెప్పేది. ఇక, రొయ్యల నరాల్ని తొలగించడాన్ని డెవైనింగ్ అంటారు. ఇది తొలగిస్తే రుచి కూడా బాగుంటుందని ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. లేదంటే వంట రుచి మొత్తం పాడవుతుంది.

**రొయ్యల నరాల్ని తీయకపోతే కలిగే ప్రభావం**

రొయ్యలు నరాలు పేగు వ్యర్థాలు, పాక్షికంగా జీర్ణమైన ఆహారం, ఇసుక లేదా గ్రిట్ కలిగి ఉండొచ్చు. దీనిని తినడం వల్ల అవాంఛిత అవశేషాలు శరీరంలోకి ప్రవేశించవచ్చు. అంతేకాకుండా జీర్ణక్రియకు ఆటంకం కలిగించవచ్చు. రొయ్యల్ని నరాలతో తినడం వల్ల అసౌకర్యం, అజీర్ణం లేదా అలెర్జీ ప్రతిచర్యలు ఎదురవుతాయి. వంట సాధారణంగా బ్యాక్టీరియాను చంపుతుంది. అయితే రొయ్యల నరం యొక్క గ్రిటీ ఆకృతి చేదు రుచిని ఇస్తుంది. నరాల్ని తొలగించడం వల్ల ఈ ప్రభావం తగ్గుతుందని నిపుణులు



అంటున్నారు.

**నరాలతో ఉన్న రొయ్యల్ని తింటే ఏమవుతుంది?**

మీకు రొయ్యల వల్ల ఎలాంటి అలెర్జీ లేకపోతే.. నరాలతో ఉన్న వాటిని వండి తినడం వల్ల తక్షణమే ఎటువంటి అలెర్జీ ప్రతిచర్యలు ఉండవు. అయితే, ఆ నరంలో ఉండే వ్యర్థాలు, టాక్సిన్లు, రసాయనాలు మన జీర్ణ ఆరోగ్యంతో పాటు పేగుల్ని ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. వీటిని తినడం వల్ల కొంతమంది ఆకస్మిక దద్దుర్లు, వేడి ఆవిర్లు, గొంతులో ఊపిరి ఆడకపోవడం, గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కలగవచ్చు. కొన్నిసార్లు ప్రాణాలకే ప్రమాదం అంటున్నారు. అందుకే నరాలతో ఉన్న రొయ్యల్ని తినకూడదని నిపుణులు సలహా ఇస్తున్నారు.

**రొయ్యల్ని ఎలా క్లీన్ చేయాలి?**

రొయ్యల్ని క్లీన్ చేయడం, వేరు చేయడం అనేది ట్యాప్ ఆన్ చేసి నీటిలో కడగడం ద్వారా ప్రారంభమవుతుంది.

రొయ్యల్ని చల్లటి నీటితో శుభ్రంగా కడిగి దుర్వాసన వస్తుందో లేదో తనిఖీ చేయాలి.

అదనపు నీటిని తొలగించి.. పదునైన కత్తిని ఉపయోగించి ముందుగా రొయ్య తలను కత్తిరించండి. ఆ తర్వాత తోకను కూడా కట్ చేయండి.

చేతులతో రొయ్యల బయటి పెంకును తొలగించండి. శుభ్రమైన కత్తిని తీసుకుని రొయ్యల వంపు చుట్టూ చీలిక చేసి.. ముదురు నలుపు రంగులో ఉన్న నరాన్ని సున్నితంగా తొలగించండి.

ఆ తర్వాత రొయ్యల కాళ్ళను తీసేయండి. చివరగా చల్లటి నీటిలో కొద్దిగా ఉప్పు వేసి రొయ్యల్ని శుభ్రంగా కడుక్కోవాలి.

**రొయ్యలు తినడం వల్ల ప్రయోజనాలు**

రొయ్యల్లో గ్లైకోసమినోగ్లైకాన్ అనే బయోయాక్టివ్ సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాల్ని కలిగి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల గాయాల నుంచి వచ్చే వాపు తగ్గుతుంది. రొయ్యల్ని తినడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి వల్ల కలిగే మంట కూడా గణనీయంగా తగ్గుతుంది.

బరువు తగ్గాలనుకునేవారికి రొయ్యలు మంచి ఆప్షన్. రొయ్యల్లో కేలరీలు, కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉంటాయి. రొయ్యల్లో అయోడిన్ కూడా ఉంటుంది. ఇది థైరాయిడ్ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

రొయ్యలు మెదడు పనితీరును పెంచడంలో సాయపడతాయి. రొయ్యల్లో అస్టాక్సంతిన్ ఉంటుంది. ఇది కణాలు, మైటోకాండ్రియల్ పొరల స్థిరత్వాన్ని పెంచుతుంది. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. మెదడు సంబంధిత వ్యాధుల్ని నివారించడంలో సాయపడుతుంది.

రొయ్యల్లో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షిస్తాయి. రొయ్యల్లో ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో సాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# 'బ్రహ్మాస్త్ర 2'లో దీపిక?



ఓవైపు తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. తన రాబోయే సినిమా చిత్రీకరణలతో బిజీగా గడుపుతోంది బాలీవుడ్ నాయిక దీపికా పదుకొణె. ఇప్పుడామె ఖాతాలో ఓ కొత్త చిత్రం చేరినట్లు తెలుస్తోంది. ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. దీనికి సీక్వెల్ రాబోతున్న విషయం తెలిసిందే. హిందీ హీరో రణ్‌బీర్ కపూర్, అలియా భట్ ప్రధాన పాత్రల్లో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలో ఓ కీలక పాత్రలో సందడి చేయనుందట దీపిక.

"బ్రహ్మాస్త్ర 2' స్క్రిప్ట్ పనులు ముగింపు దశకి వచ్చాయి. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ కొనసాగింపు చిత్ర షూటింగ్‌ను ప్రారంభించనున్నారు. ఇందులో అమృత అనే శక్తిమంతమైన పాత్ర కోసం దర్శకుడు దీపికతో చర్చలు చేస్తున్నారు. ఈ పాత్రకు అపారమైన గంభీరత ఉన్న నటి అవసరమని.. దీపిక అయితేనే దీనికి సరిగ్గా సరిపోతుందని చిత్రబృందం భావిస్తోంది. త్వరలో ఈ విషయంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు ఉన్నాయ"ని బాలీవుడ్ వర్గాల్లో చర్చలు జరుగుతున్నాయి.

# ఇన్‌స్టా రీల్స్‌తో 'ఇరుముడి' అవకాశం!

"నా తొలి తెలుగు సినిమా 'ఇరుముడి' కావడం... స్నేహంగా మెలిగే రవితేజ, ప్రియా భవానీ శంకర్‌తో కలిసి ఇందులో నటించడం ఎంతో సంతోషాన్నిచ్చింది" అని చెప్పింది బేబి నక్షత్ర. ఏడో తరగతి చదువుతున్న ఈ చిన్నారి ఓ కీలక పాత్ర పోషించిన చిత్రం 'ఇరుముడి'. రవితేజ, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించారు. శివ నిర్వాణ దర్శకుడు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు. ఈ రోజే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది నక్షత్ర. "ఇప్పటి వరకూ ఆరు సినిమాలు చేశా. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ ఇలా భిన్న భాషలు, సంస్కృతిని అర్థం చేసుకుంటూ ఈ సినిమాలు చేయడం మంచి అనుభవం. ఇన్‌స్టాలో నేను చేసిన రీల్స్ చూసే దర్శకుడు శివ నిర్వాణ నాకు 'ఇరుముడి' సినిమాలో నటించే అవకాశం ఇచ్చారు. ఇందులో మణికంఠ అనే అమ్మాయిగా కనిపిస్తాను. రవితేజకు కూతురిగా కనిపించే పాత్ర అది. ప్రియ భవానీ శంకర్ నాకు తల్లిగా నటించారు. వాళ్లిద్దరూ ఎంతో స్నేహంగా మెలగడం, దర్శకుడు శివ నిర్వాణ సహకారంతో ఆడుతూ పాడుతూ చిత్రీకరణ పూర్తి చేశా. తెలుగు భాష నాకు అర్థం అవుతోంది. అందుకే నా పాత్రకి స్వయంగా డబ్బింగ్ చెప్పా. సీలేరులో చిత్రీకరణ కావడంతో నాకు ఆ ప్రాంతమంతా కేరళలాగే అనిపించింది. మా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే సినిమాలు చేయగలుగుతున్నా. ఇప్పటివరకూ నా సినీ ప్రయాణంలో పృథ్వీరాజ్ సుకుమారన్, శివరాజ్ కుమార్, రవితేజలాంటి అగ్ర హీరోలతో సినిమాలు చేయడం చాలా బాగుంది. మైత్రీ సంస్థలో పనిచేయడం నా అదృష్టంగా భావిస్తున్నా" అని చెప్పింది నక్షత్ర.



# 'టాక్సిక్' సెన్సార్.. కట్స్ లేకుండా 'ఏ' సర్టిఫికెట్!

యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' (Toxic) గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భారీ యాక్షన్ అండ్ రివేంజ్ డ్రామాగా తెరకెక్కిన ఈ చిత్రం సెన్సార్ రిపోర్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఎలాంటి కట్స్ సూచించకుండా సెన్సార్ బోర్డు (CBFC) ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. కన్నడ, ఇంగ్లిష్ భాషల్లో రూపొందిన ఈ సినిమా నిడివి 3 గంటల 12 నిమిషాలు. కన్నడ వెర్షన్‌లో కేవలం రెండు పదాలను మ్యూట్ చేయడంతో పాటు పొగ తాగడం, మద్యానికి సంబంధించిన సన్నివేశాల్లో హెచ్చరిక లైన్‌ను జోడించాలని బోర్డు సూచించింది. సాధారణంగా సినిమాల్లో హింసాత్మక సన్నివేశాలపై కఠినంగా వ్యవహరించే సెన్సార్ బోర్డు, ఇంతటి వైలెంట్ సినిమాకు ఒక్క సీన్ కూడా కట్ చేయకుండా అనుమతి ఇవ్వడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. హాలీవుడ్ చిత్రాలైన 'స్పైడర్ మ్యాన్', 'సూపర్ మ్యాన్' సినిమాల్లో ముద్దు సన్నివేశాలపై ఆంక్షలు విధించే సెన్సార్ బోర్డు.. 'టాక్సిక్' లాంటి యాక్షన్ డ్రామాకు మాత్రం క్లియరెన్స్ ఇచ్చిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ఇక ఇప్పటికే ఈ సినిమాపై యశ్ మాట్లాడుతూ.. ఇది పెద్దల కోసం మాత్రమే తీసిన చిత్రమని స్పష్టం చేశారు.



# సింధు ఆశ తీరలే




సొంతగడ్డపై ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పోడియంపై నిలవాలని, ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకాల సిక్సర్ సాధించాలని అనుకున్న .వి.సింధుకు తీవ్ర నిరాశ తప్పలేదు. ఆ భారత స్టార్ ప్రిక్వార్టర్స్‌లో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో ప్రపంచ నంబర్‌వన్‌కు షాకిచ్చిన ఆయుష్ శెట్టి కూడా పోరాటాన్ని ముగించాడు. ఇక భారత్ ఆశలన్నీ క్వార్టర్స్ చేరిన డబుల్స్ జోడీలు పుల్లెల గాయత్రి-ట్రీసా జాలీ, సాత్విక్-చిరాగ్‌పైనే ఉన్నాయి.

దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు పెద్ద షాక్. పతకం తెస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకున్న పి.వి.సింధు ఓడిపోయింది. ఈ టోర్నీలో ఆరో పతకం గెలవాలనుకున్న ఈ తెలుగమ్మాయి పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం 1 గంట 28 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సింధు 11-21, 21-15, 17-21తో ప్రపంచ నం.3 ర్యాంకు ప్లేయర్ వాంగ్ జి యీ (చైనా) చేతిలో ఓడింది. ఈ పోరులో తొలి గేమ్‌లో సింధు ఆరంభంలో మెరుగ్గానే ఆడింది. 7-8తో ప్రత్యర్థికి సమీపంగా నిలిచింది. అక్కడ నుంచి చైనా అమ్మాయి దూసుకెళ్లింది. 14-9తో ఆధిక్యం సాధించిన వాంగ్.. అదే జోరుతో గేమ్ గెలిచింది. రెండో గేమ్ కూడా నువ్వానేనా అన్నట్లు సాగింది. అయినా కూడా సింధు 15-13తో స్వల్ప ఆధిక్యంలో నిలిచింది. వాంగ్ నుంచి పోటీ ఎదురైనా సింధు అదే ఊపులో గేమ్ గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో సింధు దూకుడుగా ఆడింది. ఒక దశలో 7-4తో ఆధిక్యం సాధించింది. కానీ వాంగ్ వదల్లేదు. మెరుపు స్మాష్‌లతో విజృంభించిన ఆమె.. భారత స్టార్‌ను సమం చేసింది. తర్వాత సింధు 13-10తో విజయం దిశగా వెళ్తున్నట్లు కనిపించింది. మళ్లీ వాంగ్ పుంజుకుంది. 15-15తో స్కోరు సమం చేసిన ఆమె.. ఆపై భారత షట్లర్‌కు ఎక్కువ అవకాశం ఇవ్వలేదు. స్కోరు 17-18 ఉన్నప్పుడు వాంగ్‌తో 54 ర్యాలీల షాట్ ఆడడంతో సింధు బాగా అలసిపోయింది. వాంగ్‌ది కూడా ఇదే పరిస్థితి. కాళ్లు తిమ్మిర్లు ఎక్కి ఇబ్బంది పడుతున్నా కూడా వరుస పాయింట్లు సాధించిన వాంగ్.. గేమ్‌తో పాటు మ్యాచ్‌ను దక్కించుకుంది. పురుషుల సింగిల్స్‌లో యువ కెరటం ఆయుష్ శెట్టి కథ ముగిసింది. తొలి రౌండ్లో ప్రపంచ నంబర్‌వన్ షి యుకిని కంగుతినిపించిన ఈ భారత కుర్రాడు.. ప్రిక్వార్టర్స్‌లో ఓడాడు. అతడు 19-21, 11-21తో ప్రపంచ 12వ ర్యాంక్ ఆటగాడు ఫర్హాన్ (ఇండోనేసియా) చేతిలో పరాజయం చవిచూశాడు. ఆయుష్ పోరాటం తొలి గేమ్‌కే పరిమితమైంది. హోరాహోరీగా సాగిన ఆ గేమ్‌ను త్రుటిలో చేజార్చుకున్న అతను.. రెండో గేమ్‌లో ప్రత్యర్థి దూకుడు ముందు నిలవలేకపోయాడు.

సాత్విక్ జంట ముందుకు: ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రెండో పతకంపై గురి పెట్టిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఆ దిశగా ముందడుగు వేశారు. తొలి రౌండ్లో బై, రెండో రౌండ్లో వాకోవర్ అందుకున్న ఈ జోడీ.. హోరాహోరీ పోరులో నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్ జంట 21-23, 21-19, 21-17తో జునైది ఆరిఫ్-యాప్ రాయ్ (మలేసియా) ద్వయంపై గెలిచింది. ప్రత్యర్థి జంట నుంచి గట్టిపోటీ ఎదురైనా.. తొలి గేమ్ కోల్పోయినా.. ఒత్తిడికి నిలిచిన భారత జోడీ ముందంజ వేసింది. హోరాహోరీగా సాగిన తొలి గేమ్‌లో మలేసియా ద్వయానిదే పైచేయి అయింది. రెండో గేమ్‌లో సాత్విక్ జంట పుంజుకుంది. ప్రత్యర్థి జోడీ నుంచి పోటీ ఎదురైనా.. విరామ సమయానికి 11-8తో నిలిచింది. తర్వాత అదే జోరుతో గేమ్ గెలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో ఆరిఫ్ ద్వయం 11-8తో ముందంజలో నిలిచింది. అయితే సాత్విక్ జంట పోరాటం వదల్లేదు. క్రమంగా స్కోరు సమం చేసిన భారత జంట.. తర్వాత మరింత దూకుడు ప్రదర్శించింది. వరుస పాయింట్లతో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రీసా జంట క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టింది. భారత జంట 21-16, 21-12తో రినా ఇవాంగా-కీయ్ నకనిషి (జపాన్) జోడీని చిత్తు చేసింది. తొలి గేమ్‌లో మాత్రమే ప్రత్యర్థి జోడీ నుంచి గాయత్రి ద్వయానికి పోటీ ఎదురైంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల ద్వయం ఓడిపోయింది. తనీషా జంట 16-21, 5-21తో గువో-చెన్ (చైనా) జోడీకి తలొంచింది.

"వాంగ్‌కు గాయం అయిందో లేదో తెలియదు. అది ఆమె ఎత్తుగడలో భాగం కావొచ్చు. ప్రతి పాయింట్ చాలా ముఖ్యమైన పరిస్థితుల్లో ఆమె విరామం తీసుకుంది. ఆఖరి నిమిషాల్లో నేను మరింత ఓపిగ్గా ఆడాల్సింది. సుదీర్ఘంగా సాగిన ర్యాలీలను పాయింట్లుగా మార్చుకోవాల్సింది. తప్పులు దిద్దుకుని మరింత బలంగా వస్తా"



## భారత్ – అఫ్గాన్ టీ20 సిరీస్ షెడ్యూల్‌లో మార్పులు?

శ్రీలంకతో గాలె వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ అద్భుత విజయం సాధించింది. మానవ్ సుతార్, రవీంద్ర జడేజా నాణ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకోగా.. సీనియర్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ పెద్దగా ప్రభావం చూపించలేదు. కేవలం ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. దీంతో రెండో టెస్టులో అతడికి తప్పిస్తారనే ప్రచారం సాగుతోంది. యువ బౌలర్ సారాంశ్ జైన్‌కు అవకాశం ఇస్తారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే చేసిన వ్యాఖ్యలతో కుల్‌దీప్ యాదవ్‌కు రెండో టెస్టులోనూ అవకాశం ఖాయమని స్పష్టమైంది.

"తొలి టెస్టులోనూ కుల్‌దీప్ బాగానే బౌలింగ్ చేశాడు. వికెట్లు తీసే అవకాశాలను సృష్టించాడు. గాలెలో అతడి పాత్ర భిన్నమైంది. అందులో సక్సెస్ అయ్యాడు. అతడు టీమ్ఇండియా మ్యాచ్ విన్నర్. తప్పకుండా రాబోయే మ్యాచ్‌లో చేసి చూపిస్తాడు. ఫింగర్ స్పిన్నర్లతో పోలిస్తే రిస్ట్ స్పిన్నర్లు బంతి కాస్త సాఫ్ట్‌గా మారిన తర్వాత ఇబ్బంది పడటం సహజం. ఫింగర్ స్పిన్నర్లు తేలికగా హ్యాండిల్ చేయగలరు. ఎడమచేతివాటం రిస్ట్ స్పిన్నర్ అయిన కుల్‌దీప్ యాదవ్‌కు తొలి టెస్టులో అదే సమస్యగా మారింది. ఏదో ఒక మ్యాచ్‌లో ఎక్కువగా వికెట్లు తీయనంత మాత్రాన అతడి ప్రదర్శనపై ఓ నిర్ణయానికి రాలేం" అని సాయిరాజ్ స్పష్టం చేశారు.

సుతార్ నమ్మకమైన ప్లేయర్

అఫ్గానిస్థాన్‌పై తొలి టెస్టులోనే ఏడు వికెట్లు తీసిన మానవ్ సుతార్ .. ఇప్పుడు శ్రీలంకపై పది వికెట్ల ప్రదర్శన చేశాడు. సుతార్ బౌలింగ్ ప్రతిభపై సాయిరాజ్ మాట్లాడుతూ.. "సుతార్ బౌలింగ్ తీరు రోజురోజుకీ మెరుగవుతోంది. బంతిపై చాలా ఒత్తిడి తెస్తాడు. బౌలింగ్‌లో వైవిధ్యం చూపిస్తాడు. మాకు నమ్మకమైన ఆటగాడు. జట్టుకు అవసరమైన సందర్భంలో వికెట్ తీసే నైపుణ్యం ప్రదర్శించాడు. అయితే, మున్ముందు అతడిపై ఒత్తిడి లేకుండా చూసుకుంటాం. సుతార్ బలం ఏంటో గుర్తించి దానిని మరింత మెరుగ్గా చేసేందుకు చూస్తాం" అని బహుతులే వెల్లడించారు.

## సెమీస్‌కు గాయత్రి – ట్రీసా జోడీ.. 15 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం

బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు గాయత్రి గోపీచంద్ - ట్రీసా జాలీ (Gayatri-Treesa) జోడీ పతకం ఖాయం చేసింది. క్వార్టర్ ఫైనల్‌లో విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. దీంతో 15 ఏళ్ల తర్వాత మహిళల డబుల్స్ విభాగంలో భారత్‌కు పతకం రానుంది. చివరిసారిగా 2011లో అశ్విని పొన్నప్ప - జ్వాలా గుత్తా జోడీ కాంస్య పతకం సాధించింది.

తొలి గేమ్‌ను కోల్పోయినా..

ఇటీవలే అర్జున అవార్డును గెలుచుకున్న గాయత్రి గోపీచంద్ తన సత్తా ఏంటో మరోసారి చూపించింది. ట్రీసా జాలీతో కలిసి ఫేవరెట్‌గా బరిలోకి దిగిన గాయత్రి జోడీకి తొలి గేమ్‌లో పరాజయం ఎదురైంది. చైనా షట్లర్లు జియా యి ఫాన్ - ఝాంగ్ షు జియాన్ జోడీ 21-16 తేడాతో తొలి గేమ్‌ను గెలుచుకుంది. కానీ, భారత జోడీ పుంజుకున్న తీరు అద్భుతం. హోరాహోరీగా సాగిన రెండోగేమ్‌లో 21-15 తేడాతో భారత్ గెలిచి సమంగా నిలిచింది. ఇక నిర్ణయాత్మక పోరులోనూ గాయత్రి-ట్రీసా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. ఆరంభంలో కాస్త పోటీ ఎదురైనా నిలబడింది. చివరికి 21-13 తేడాతో మూడో గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. ఇక సెమీస్‌లోనూ గెలిస్తే ఫైనల్‌కు చేరుకున్న తొలి భారత జోడీగా గాయత్రి - ట్రీసా ఘనత సాధిస్తారు.

PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314